# మనం

జనం కోసం అక్షర యజ్ఞం.

హైదరాబాద్ - శనివారం 21 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 74 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## మాది ప్రజా క్షేమం-సామాజిక న్యాయ బడ్జెట్

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

**రూ.3,24,234 కోట్లు**

రెవెన్యూ వ్యయం: రూ.2,34,406 కోట్లు

మూలధన వ్యయం: రూ.47,267 కోట్లు



# పీపుల్ ఫ్రెండ్లీ బడ్జెట్

## బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు.. ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు

మేం పాలకులం కాదు, ప్రజలకు సేవకులం

దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్ర ఆదాయమే ఎక్కువ

అసెంబ్లీ బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి

మండలిలో పద్దు ప్రతిపాదించిన మంత్రి ఉత్తమ్



### 9 కొత్త పథకాల ప్రకటన

వార్షిక బడ్జెట్‌లో భాగంగా డిప్యూటీ సీఎం 9 కొత్త పథకాలను ప్రకటించారు. 2

## శాఖల వారీ కేటాయింపులు..

రాష్ట్ర బడ్జెట్‌లో ముఖ్య శాఖలకు కేటాయించిన నిధులు

- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యాశాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- పర్యాటక శాఖకు రూ.1,224 కోటు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు

## వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయాలకు ప్రాధాన్యత

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్లో 'ప్రజా క్షేమం-సామాజిక న్యాయం' అనే అంశానికి పెద్ద పీట వేసింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌలిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో బడ్జెట్లో ప్రాధాన్యతనిచ్చిన 5 కీలక రంగాలు... వాటికి కేటాయించిన నిధుల వివరాలు..



...వివరాలు 2లో

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా.. 1.15 కోట్ల ఫ్యామిలీలకు ప్రయోజనం

ఒక కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి దురదృష్టవశాత్తు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. ఇలాంటి ప్రమాదం ఏ ఒక్క కుటుంబానికి ఉండకూడదనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక వినూత్న పథకాన్ని ప్రకటించింది. ఆ పథకం ద్వారా అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవితబీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది.

...వివరాలు 2లో

## ఊహాజనిత బడ్జెట్

### ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 20: 'అప్పుల మీదనే ప్రభుత్వం ఆధారపడ్డట్లు ఈ బడ్జెట్తో స్పష్టమఉంటున్నది. విద్యాశాఖకు 15% నిధులు ఇస్తానని గత మూడు బడ్జెట్లలో కేటాయించలేదు. హ్యాట్రిక్ చీటింగ్ బడ్జెట్, మాయల ఫకీర్ బడ్జెట్. ఊహా జనిత బడ్జెట్. హామీల అమలు ప్రస్తావన లేదు. వాస్తవికతకు దూరంగా ఉన్న బడ్జెట్. అప్పుల మీదనే ప్రభుత్వం ఆధారపడ్డట్లు ఈ ...మిగతా 2లో

## ఉగాది పచ్చడి మిశ్రమంలా ఉంది

### సీపీఐ శాసన సభా పక్ష నేత కూనంనేని



హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఉగాది పచ్చడిలా మిశ్రమంగా ఉందని సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. పాత బడ్జెట్ కు యధాతధంగా కొత్త బడ్జెట్ ఎక్కించారని, కొంత బడ్జెట్ ను పెంచడం తప్ప ఇంకేం మార్పులు లేవన్నారు.' రాష్ట్రం మొత్తంగా రూ. 8.64 కోట్ల అప్పుల ...మిగతా 2లో

### ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

## ఇకపై పదో తరగతికి పరీక్షలుండవ్

ప్లస్ టూ విధానం అమలుకు యోచిస్తున్నం

కేటీఆర్, హరీష్.. కేసీఆర్‌ను గృహ నిర్బంధం చేసిండ్రు

ఫోన్ ట్యాపింగ్ కేసులో చట్టపరంగానే ముందుకెళ్తం

**అసెంబ్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్‌చాట్**



హైదరాబాద్, మార్చి 20 (మనం బ్యూరో): పదో తరగతి పరీక్షలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై పదో తరగతికి పరీక్షలు లేనట్లేనని చెప్పారు. ప్రస్తుతం దేశమంతా ప్లస్ టూ విధానం అమల్లో ఉందని ప్రస్తావిస్తూ ఆ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు సూత్ర ప్రాయంగా తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా శుక్రవారం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్ అనీ, అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చామ న్నారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో ...మిగతా 2లో



## ఈద్ ముబారక్

పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు

## రేవంత్ రంజాన్ శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 20: పవిత్ర రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరితో సంతోషంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక చింతన పెంచుకునే ఈ పండుగ.. సోదరభా వాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లౌకికవాదానికి పెద్దపీట వేస్తామని ఆయన పేర్కొన్నారు. 'రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముస్లింల ...మిగతా 2లో

## పెరిగిన ప్రీమియం పెట్రోల్ రేటు

### లీటర్‌కు రూ. 2.35 పైసల పెంపు



ఢిల్లీ, మార్చి 20: దేశవ్యాప్తంగా ప్రీమియం పెట్రోల్ ధర లీటర్ కు రూ.2.35 పెరిగింది. ఈ మేరకు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ పీసీఎల్) ప్రకటించింది. సాధారణ పెట్రోల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. అలాగే, బీపీసీఎల్ స్పీడ్, ఐవోసీఎల్ ఎక్స్ పీ 95 ప్రీమియం పెట్రోల్ ధరలకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ.2.09 ...మిగతా 2లో

### ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.22 పెంపు



2

## చెవిలో పూలు పెట్టొద్దు

బడ్జెట్ పేరుతో మరోసారి మోసం చేయొద్దు

నిరసనగా సభ నుండి బీఆర్ఎస్ వాకౌట్

శాసనసభ ఎంట్రీ గేట్ వద్ద బైఠాయించి ధర్నా

## అంకెల ఆర్భాటాలు.. కేటాయింపుల ప్రగల్భాలు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్





## 6 గ్యారంటీల అమలు మోసాన్ని అసెంబ్లీలో ఎండగడతాం: కేటీఆర్

2

## అంకెల గారడీ, మాటల పేరడీ తప్ప ఏమీ లేదు?

హరీశ్ రావు ఆగ్రహం



### ఇది...కాపీ.. పేస్ట్ బడ్జెట్



### కుమార్తెతో కలిసి..

## ట్యాంకర్‌పై కిమ్ షికారు



ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె కిమ్-జు-యే మరోసారి వార్తల్లో నిలిచారు.

9










# పెరిగిన ప్రీమియం పెట్రోల్ రేటు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రూ.2.35 వరకూ పెట్రోలియం సంస్థలు ప్రీమియం పెట్రోల్ ధరను పెంచాయి. సవరించిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఇండస్ట్రియల్ డీజిల్ ధర లీటర్ పై రూ.22 పెరిగింది. సాధారణ డీజిల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**మూడు రకాల పెట్రోల్..**

ప్రస్తుతం దేశంలో మూడు రకాల పెట్రోల్ లభిస్తోంది. ఒకటి సాధారణ పెట్రోల్, మరొకటి ప్రీమియం. ఇది కాకుండా హై ఆక్టేన్ ప్రీమియం అనే మూడో రకం పెట్రోల్ కూడా ఉంది. మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజ్ కోసం వాహనాల్లో ప్రీమియం పెట్రోల్‌ను ఉపయోగిస్తారు. ప్రస్తుత ధరల పెంపు హై-ఆక్టేన్, ప్రీమియం పెట్రోల్ వాడే వినియోగదారులను ప్రభావితం చేస్తుంది. బీపీసీఎల్ స్పీడ్, హెచ్పీసీఎల్ పవర్, ఐఓసీఎల్ ఎక్స్‌పీ95 పేర్లతో ఈ ప్రీమియం పెట్రోల్‌ను విక్రయిస్తున్న విషయం తెలిసిందే.

**సాధారణ, ప్రీమియం పెట్రోల్ మధ్య తేడా ఏంటి?**

పెట్రోల్ గ్రేడ్ను దాని ఆక్టేన్ విలువ ఆధారంగా వర్గీకరిస్తారు. భారత్లో సాధారణ పెట్రోల్ ఆక్టేన్ విలువ 87 కాగా, అదే ప్రీమియం పెట్రోల్ ఆక్టేన్ విలువ 91గా ఉంది. హై ఆక్టేన్ కలిగిన ఇంధనం ఎక్కువ కంప్రెషన్ రేషియోని కలిగి ఉంటుంది. దీని ఫలితంగా, వాహనం ఇంజిన్ను స్టార్ట్ చేసే సమయంలో ఎక్కువ ఇంధనం తీసుకోదు.

**ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.22 పెంపు**




పశ్చిమాసియా యుద్ధం ఒక్కొక్క రంగాన్ని ప్రభావితం చేసుకుంటూ పోతోంది. శుక్రవారం పెట్రోల్ ధర పెరిగిన కొద్ది సేపటిలోనే డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. ఇండస్ట్రియల్ డీజిల్ ధర లీటరుపై ఏకంగా రూ.22 పెరిగింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఇండస్ట్రియల్ డీజిల్ ధరను భారీగా పెంచినట్లు జాతీయ మీడియా పేర్కొంది. నిన్నటి వరకూ రూ.87.57గా ఉన్న లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర తాజాగా పెంచిన ధరతో రూ.109.59కి చేరింది. కాగా.. రెగ్యులర్ పెట్రోల్, డీజిల్ ధరల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులేదు. కానీ.. అటు పవర్ పెట్రోల్, ఇటు ఇండస్ట్రియల్ డీజిల్ ధరలు పెరగడంతో.. రెగ్యులర్ ఫ్యూయల్ రేట్లు కూడా త్వరలోనే పెరుగుతాయన్న ఆందోళన మొదలైంది. దీంతో కొందరు వాహనదారులు ముందుగానే బాటిళ్లతో పెట్రోల్ బంకులకు చేరుకుంటున్నారు.

# పీపుల్ ఫ్రెండ్లీ బడ్జెట్



హైదరాబాద్, మార్చి 19 (మనం బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఉభయ సభల్లో ప్రవేశపెట్టింది. రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌ను శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రవేశపెట్టారు. శాసనసభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మొత్తం బడ్జెట్ రూ.3,24,234 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా పేర్కొన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందనీ, గత ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం తలసరి ఆదాయం రూ.4 లక్షల 18 వేల 931 కాగా, వృద్ధి రేటు 10.2 శాతంగా ఉందన్నారు. దేశ తలసరి ఆదాయం రూ.2 లక్షల 19 వేల 575 కాగా, వృద్ధి రేటు కేవలం 6.9 శాతం మాత్రమే ఉందన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే రాష్ట్ర తలసరి ఆదాయం లక్ష 99 వేల 356 రూపాయలుగా అంటే దేశ తలసరి ఆదాయం కంటే 1.9 శాతం ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యమన్న డా.అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తూ పాలన సాగిస్తున్నామన్నారు. మేము పాలకులం కాదు, ప్రజలకు సేవకులం. ప్రజలు మాకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావించి ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథకంలో తీసుకుపోతున్నామని వెల్లడించారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు, ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలనీ, ప్రజల జీవన స్థితి గతుల మార్పుకు దోహదపడే లెక్కలని స్పష్టం చేశారు.

## 9 కొత్త పథకాల ప్రకటన...

**వార్షిక బడ్జెట్‌లో భాగంగా డిప్యూటీ సీఎం 9 కొత్త పథకాలను ప్రకటించారు.**

**1. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం:** ఇందులో భాగంగా రాష్ట్ర ప్రజలందరికీ సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా అందించే విధంగా వచ్చే జూన్ 2 నుండి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.4000 కోట్లు ప్రతిపాదించారు.

**2. చేయూత:** ఈ పథకానికి అర్హులైన వారికి రూ.2 లక్షల నూతన పెన్షన్లు మంజూరు చేస్తున్నామనీ, ఇందుకోసం బడ్జెట్‌లో ఊ.14,861 కోట్లను ప్రతిపాదించారు.

**3. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు:** ఈ పథకంలో భాగంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక రవాణా వ్యవస్థలతో కూడిన అన్ని వనరులతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయాలని ప్రతిపాదించాము. ఈ స్కూళ్లలో ప్రీ ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు విద్య అందిస్తామనీ, ఈ పథకం మొత్తానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రకటించారు.

**4. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం:** ఈ విద్యా సంవత్సరం నుండి ప్రీ ప్రైమరీ మొదలుకుని ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు, మిగతా మూడు రోజులు రాగి జావ అందించనున్నట్లు వెల్లడించారు.

**5. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రతిపాదించారు.

**6. నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం:** ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు అందరికీ దాదాపు 23 లక్షల 51 వేల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రైవేట్ ఆసుపత్రులలో 1,998 వ్యాధులకు ఈ పథకం ద్వారా చికిత్స పొందవచ్చనీ, ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అమలు చేస్తామని వెల్లడించారు.

**7. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం:** ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించిన డిప్యూటీ సీఎం ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి 20 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే, 60 ఏండ్ల వరకు రూ.10 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2 కోట్ల అదనపు కవరేజి లభించే విధంగా రూపకల్పన చేశామనీ, ఈ రెండు పథకాల మొత్తానికి బడ్జెట్లో రూ.1056 కోట్లు ప్రతిపాదించారు.

**8. సీఎం ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్ పథకం:** రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణను, వారికి ఉపాధి లభించిన ఆయా దేశాలకు సంబందించిన భాషా జ్ఞానంలో శిక్షణ ఇప్పించడం, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం సీఎం ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్నామనీ వెల్లడించారు.

**9. ఏటీసీలకు స్కాలర్ షిప్:** ఏటీసీలలో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతి నెల రూ.2 వేలు స్కాలర్‌షిప్ రూపంలో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ, ఇందుకోసం ప్రస్తుత బడ్జెట్‌లో రూ.80 కోట్లు కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి ప్రకటించారు.

# ‘చెవిలో పూలు’ పెట్టొద్దు

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అత్యంత వాడివేడిగా సాగాయి. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించగానే.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ ఊహించని రీతిలో నిరసన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ప్రజల ‘చెవిలో పూలు’ పెట్టి మోసం చేస్తోందని అంటూ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా తమ చెవుల్లో రంగు రంగుల పువ్వులు పెట్టుకుని సభలోకి వచ్చారు. బడ్జెట్ ప్రసంగం మొదలవ్వగానే బీఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి? నిరుద్యోగ భృతి ఎక్కడ? రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది? అంటూ నినాదాలతో సభను హోరెత్తించారు. భట్టి ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన బీఆర్‌ఎస్ నేతలు, అనంతరం నిరసనగా సభ నుండి వాకౌట్ చేశారు.

ఇదిలాఉంటే, సభ నుంచి బయటకు వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ గేట్ వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు.

ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. ‘పెళ్లి చేసుకునే ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. ఇది పేద మహిళలను వంచించడమే’ అని ధ్వజమెత్తారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని, యువతను నట్టేట ముంచిందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని, ఇది కేవలం అంకెల గారడీ మాత్రమేనని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు.

# వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయాలకు ప్రాధాన్యత

హైదరాబాద్, మార్చి 19 (మనం బ్యూరో): సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్లో ‘ప్రజా క్షేమం - సామాజిక న్యాయం’ అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్లో ప్రాధాన్యతనిచ్చిన 5 కీలక రంగాలు... వాటికి కేటాయించిన నిధుల వివరాలు.

**1. వ్యవసాయం, రైతు సంక్షేమం: రూ. 23,179 కోట్లు**

రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

**2. విద్య, నైపుణ్యాభివృద్ధి : రూ. 26,674 కోట్లు**

రేవంత్ సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్లకు భారీగా నిధులు కేటాయించారు.

**3. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలు**

మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం), గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసరమైన నిధులను పుష్కలంగా కేటాయించారు.

**4. మౌలిక సదుపాయాలు : రూ. 47,267 కోట్లు**

రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు.

**5. సామాజిక భద్రత (బీమా పథకాలు)**

ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు ’ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం’ కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్లో ఒక కీలక



# రేవంత్ రంజాన్ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయి’ అని రేవంత్ రెడ్డి చెప్పారు. గంగా జమునా తెహజీబ్కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# అంకెల గారడీ, మాటల పేరడీ తప్ప ఏమీ లేదు?

**హరీశ్ రావు ఆగ్రహం**

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారని విమర్శించారు. అన్ని రంగాలకు మొండిచేయి చూపారని అన్నారు. ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా చేశారు. అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీ లేదని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పరిస్థితి బాగా ఉందని చెబుతున్నారని, మరోవైపు మూడేళ్లు కాకుండానే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో అవినీతి జరిగిందని స్వయంగా మంత్రి కుమార్తె ఆరోపణలు చేశారని గుర్తుచేశారు.తాజా బడ్జెట్‌ను చూస్తుంటే ఇదో బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందని హరీశ్ రావు విమర్శించారు. గతంలో నిధులు కూడా ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదని అన్నారు. ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వెనుక పిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని భట్టి విక్రమార్క రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందని అన్నారు. క్యూర్, రేర్, ప్యూర్ పేరుతో హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని మండిపడ్డారు. కూల్చడాల మీద ఉన్న ప్రేమ నిర్మించడంపై లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇకపై పదో తరగతికి పరీక్షలుండవ్

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకుని మౌలిక వసతుల కల్పనకు సరిపడే నిధుల కేటాయింపు జరిగిందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్ద పీట వేసిందనీ, అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్ట ప్రకారమే ముందుకెళతామనీ, తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదం ఉందన్నారు. మాజీ మంత్రి హరీష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఊరట లభించలేదనీ, ఈ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకరరావు 20 నెలలు అందుబాటులో లేరనీ, ఆ కారణంగానే విచారణ ఆలస్యమైందన్నారు. ఆయన అందుబాటులోకి రాగానే విచారణ వేగంగా కొనసాగుతోందనీ, చక్రధర్‌గౌడ్ కేసు కొట్టేస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కొట్టేసినట్లు ప్రచారం చేశారని మండిపడ్డారు. కేటీఆర్, హరీష్ రావు కలిసి కేసీఆర్‌ను గృహ నిర్బంధం చేశారనీ, అందుకే అసెంబ్లీకి రాలేదన్నారు. హిల్ట్ పాలసీ, టీడీఆర్ భూ బదలాయింపులపై ఏ ఏజెన్సీతో విచారణకైనా సిద్ధమేననీ, హిల్ట్ పాలసీతో రూ.5 లక్షల కోట్ల నష్టం జరిగిందనడం సరికాదన్నారు. ఈ మధ్య పోలీసులపై కాల్పులు జరిగినా బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించలేదనీ, డ్రగ్స్ దొరికినా మాట్లాడలేదనీ, బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రిని ఎంపిక చేస్తుందన్న సీఎం కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ఏ పదవి అయినా చేపట్టే వెసులుబాటు ఉంటుందన్నారు. జీవన్‌రెడ్డి విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మీనాక్షి నటరాజన్‌ను అడగాలని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ కేంద్రం తీసుకున్న నిర్ణయమనీ, మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి రావాలని భద్రత కల్పిస్తామని మాత్రమే అన్నామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# ఉగాది పచ్చడి మిశ్రమంలా ఉంది

## సీపీఐ శాసన సభా పక్ష నేత కూనంనేని

(మొదటి పేజీ తరువాయి)

ఊబిలో కూరుకుపోయింది. మరో లక్ష కోట్ల రూపాయల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆ లెక్కలు ఈ బడ్జెట్ చూపించలేదు. ఇంత డబ్బు ఎలా తీసుకువస్తారనేది పెద్ద ప్రశ్న? ఈ దశలో బడ్జెట్ ప్రవేశపెట్టడం అంటే కత్తి మీద సాము లాంటిది. ఈ బడ్జెట్ 1 కోటి 50 లక్షల కుటుంబాలకు కుటుంబ జీవిత భీమా సౌకర్యం కల్పించడం మంచి పరిణామం. గత బడ్జెట్లో విద్యకు 7.57 శాతం నిధులు కేటాయిస్తే, ఈ బడ్జెట్లో 8.22 శాతం కేటాయించారు. వైద్య రంగానికి సంబంధించి 4.2 శాతం మాత్రమే నిధులు కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్ రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టారు. దాదాపు రూ.58 వేల కోట్ల బడ్జెట్ లోటు చూపిస్తున్నారు. అంటే మళ్లీ అప్పు చేయాల్సిందే. గత బడ్జెట్ రూ. 22 వేల కోట్లు తగ్గినట్టుగానే ఈ బడ్జెట్ కూడా సుమారు రూ. 40 వేల కోట్లు తగ్గే అవకాశం ఉంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆర్ ఉద్యోగులు, జర్నలిస్టులు, కాంట్రాక్టు కార్మికులు, జెన్ సింగరేణి, జర్నలిస్టుల ప్రస్తావన లేకపోవడం దారుణం. గత బడ్జెట్ ఇందిరమ్మ ఇండ్లకు రూ.14 వేల కోట్లుగా కేటాయించారు. కానీ.. ప్రస్తుతం రూ.7 వేల కోట్లు కేటాయించారు. ఈ చర్యలతో ప్రభుత్వం చాలా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అంతిమంగా రూ.8 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా కచ్చితంగా అవసరముంది. లేకపోతే ‘చల్తీ కా నామ్ గాడీ తరహాలో ప్రభుత్వ పరిపాలన సాగుతుంది.రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అసంతృప్తిని మిగిల్చిందని సీపీఎం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఈ బడ్జెట్ మిశ్రమ బడ్జెట్అని, ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు లేవని విమర్శించారు. ముఖ్యంగా బడ్జెట్ లో పెన్షన్ల పెంపు విషయమే రాలేదన్నారు. గీత కార్మికులు, యాదవులు, ముదిరాజులు, చేనేత కార్మికులు వంటి వృత్తి సంఘాలకు బడ్జెట్లో ప్రస్తావన లేదు. విద్యకు 20% డిమాండ్ చేస్తుంటే 8% మాత్రమే కేటాయించారు. ఆరోగ్యానికి 4% మాత్రమే కేటాయించారు. కొత్తగా ఇందిరమ్మ బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, నైపుణ్యాభివృద్ధిలో ఈ బడ్జెట్ దిశానిర్దేశం చేయలేక పోయింది.

# ఊహాజనిత బడ్జెట్

## ఏలేటి మహేశ్వర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

బడ్జెట్తో స్పష్టమైంది. ముస్లింలతో పోలిస్తే బీసీలకు అన్యాయం జరిగిన బడ్జెట్. నిరుద్యోగులను, మహిళలను మోసం చేసిన బడ్జెట్. ఉద్యోగ క్యాలెండర్ ప్రస్తావన లేదు. కాంగ్రెస్ నేతల సమయం ఢిల్లీ టూర్లకు సరిపోతున్నది.’’ అని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు.

# 6 గ్యారంటీల అమలు మోసాన్ని అసెంబ్లీలో ఎండగడతాం: కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి: గన్ పార్క్ వద్ద భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై ప్లకార్డులతో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన బాకీ కార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను మోసం చేసిన విధానాన్ని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఎండగట్టారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ నిరసనలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణను ఆగం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దివ్యాంగులకు బాకీ పడ్డ రూ.54,000 ఎక్కడ అని నిలదీశారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటూ ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.24,000లో, సంవత్సరానికి రూ.12,000 చొప్పున రెండు సంవత్సరాలుగా బాకీ ఉందని విమర్శించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నెలకు రూ.4,000 చొప్పున మొత్తం రూ.54,000 బాకీ ఎక్కడ అని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం ఏమైందని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర సంపాదనను దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# ఇది...కాపీ..పేస్ట్ బడ్జెట్

- **పాత బడ్జెట్‌ను కాపీచేసి కొత్తగా ప్రవేశపెట్టారు**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శలు**

హైదరాబాద్,మార్చి 20(మనం,ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్ర బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈ బడ్జెట్ ప్రజలను ఏమాత్రం ఆకట్టుకునేలా లేదని, ఇది కేవలం కాపీ పేస్ట్ బడ్జెట్’ అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌లో ప్రజా ఆమోదం పొందే అంశాలేవీ లేవని ఆమె విమర్శించారు. తెలంగాణ జాగృతి నిపుణుల బృందం అంచనా వేసిన విధంగానే బడ్జెట్ అంకెలు ఉన్నాయని, కానీ కేటాయింపుల్లో మాత్రం ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మండిపడ్డారు.

**బీసీలకు అన్యాయం:**

రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్లో కేవలం 4 శాతం నిధులు మాత్రమే కేటాయించడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బీసీల కోసం ఏటా రూ. 20,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించి బీసీలను వంచించారని దుయ్యబట్టారు.

ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, కార్పొరేషన్లు, షాపింగ్ కాంప్లెక్స్ వంటి హామీలు ఎక్కడా అమలు కాలేదని విమర్శించారు. గ్లోబలైజేషన్‌లో అంతరించిపోతున్న కులవృత్తులను ఆదుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని, కేవలం తెలంగాణ జాగృతి మాత్రమే వారి గురించి ఆలోచిస్తోందని పేర్కొన్నారు.

**పేదలకు:**

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి గత బడ్జెట్‌లో రూ. 12,000 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు దాన్ని రూ. 5,500 కోట్లకు తగ్గించడం పేదలను మోసం చేయడమేనని కవిత విమర్శించారు. 22.5 లక్షల ఇళ్లు ఇస్తామని చెప్పి ఇంత తక్కువ నిధులు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. అలాగే, రైతు భరోసా, చేయూత పెన్షన్లు, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలకు గత ఏడాది కేటాయించిన నిధులనే ఈసారి కూడా అక్షరం పొల్లుపోకుండా కాపీ పేస్ట్ చేశారని ఎద్దేవా చేశారు. ఇది విజన్ ఉన్న బడ్జెట్ కాదని, కేవలం రివిజన్ బడ్జెట్ అని ఆమె చురకలంటించారు.

**నిరుద్యోగులకు:**

రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కవిత తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణలో డిగ్రీ చేసిన ప్రతి నలుగురు యువకుల్లో ఒకరికి, ఇద్దరు యువతుల్లో ఒకరికి మాత్రమే ఉద్యోగం దక్కుతోందని అజీం ప్రేమ్ జీ యూనివర్సిటీ సర్వే చెబుతోందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వచ్చి నిరుద్యోగులను మోసం చేశారని, అందుకే ఆయనకు ‘రాహుల్ ఫేక్’ అని నామకరణం చేస్తున్నామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్ర అప్పు రూ. 8,64,198 కోట్లకు చేరుకుందని, అంటే రాష్ట్రంలో ప్రతి వ్యక్తిపై రూ. 2.16 లక్షల అప్పు భారం పడిందని వివరించారు. ఒక్కో కుటుంబంపై దాదాపు రూ. 9 లక్షల అప్పును కాంగ్రెస్ ప్రభుత్వం నెత్తిన పెట్టిందని మండిపడ్డారు. కేంద్రం నుంచి రావాల్సిన రూ. 22,000 కోట్ల నిధులను రాబట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, కేవలం 50 శాతం నిధులు మాత్రమే సాధించగలిగిందని విమర్శించారు.

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా.. 1.15 కోట్ల ఫ్యామిలీలకు ప్రయోజనం

హైదరాబాద్, మార్చి 19: ఒక కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి దురదృష్టవశాత్తు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. ఇలాంటి ప్రమాదం ఏ ఒక్క కుటుంబానికి ఉండకూడదనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక వినూత్న పథకాన్ని ప్రకటించింది. ఆ పథకం ద్వారా అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవితబీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది.

1.15 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం : ఎంతోమంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. కుటుంబానికి రూ.5లక్షల జీవిత బీమాను కల్పిస్తోంది. ఈ మేరకు శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఈ పథకం గురించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. ఈ స్కీమ్‌కు రూ.4000 వేల కోట్లను కేటాయిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ పథకం 2026 జూన్ 2వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.



# చట్ట సభల్లో విప్‌ల నియామకం

- మండలి విప్‌లుగా అద్దంకి,బల్మూరి
- శాసన సభలో ముగ్గురు విప్‌లు..



హైదరాబాద్,మార్చి20(మనం న్యూస్)ః తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అటు అసెంబ్లీ, ఇటు శాసనమండలిలో విప్‌ల నియామకం చేపట్టింది. ఇద్దరు ఎమ్మెల్సీలను.. శాసనమండలిలో విప్‌లుగా నియమించింది. అదే సమయంలో మరో ముగ్గురు ఎమ్మెల్యేలను శాసనసభలో విప్‌లుగా నియమిస్తూ.. ఉత్తర్వులు వెలువరించింది. మండలిలో అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లకు విప్ పదవులు దక్కగా.. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలకు అసెంబ్లీలో విప్ పదవులు దక్కాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సమన్వయం కోసంః**

రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి శాసనసభ, శాసనమండలిలో సమన్వయం అందించేందుకు ఈ ప్రభుత్వ విప్లను నియమించింది. ఈ నియామకాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తరపున మాట్లాడేందుకు, వాణిని వినిపించేందుకు, అందరు ఎమ్మెల్యేలను ఏకం చేయడంలో భాగంగా ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలను విప్‌లుగా రేవంత్ రెడ్డి సర్కార్ నియమించింది.

**సభా నిర్వహణలో విప్‌లదే కీలక పాత్రః**

శాసనసభలో ఏదైనా బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు లేదా ముఖ్యమైన చర్చలు జరిగినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా హాజరయ్యేలా చూడటంలో విప్‌ల పాత్ర కీలకం. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయకుండా పార్టీ లైన్ను అమలు చేయడం వారి ప్రధాన బాధ్యత. బడ్జెట్ సమావేశాలు, ఇతర కీలక సెషన్ల నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజకీయంగా అనుభవం ఉన్న నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా సభలో ప్రభుత్వ పట్టును మరింత బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. తాజా నియామకాలపై సదరు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా కామ్రేడ్ జాటోత్ ఠాను నాయక్ 76వ వర్ధంతి



హన్మకొండ, మార్చి 20(మనంన్యూస్)ః సేవాలాల్ సేన సేవాలాల్ విద్యార్థి సేన హనుమకొండ జిల్లా అధ్యక్షులు కునుసోతు మురళి నాయక్ కామ్రేడ్ జాటోత్ ఠాను నాయక్ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి భూమికోసం భుక్తి కోసం వ్యక్తి చాకిరీ విముక్తి కోసం నిరంతరం పోరాడిన గొప్ప యోధుడు ఆయనే పేద ప్రజల హక్కుల కోసం రాష్ట్ర ప్రయోజనాల కోసం అలుపెరగని పోరాటం చేశారు. తన ప్రాణ త్యాగానికి సైతం వెనకడుగు వేయకుండా చేసిన ఆయన పోరాటం ఫలితంగా అనేక ప్రాంతాలలో పేద ప్రజలకు భూములు లభించడం అగ్రకులాల అధిపత్యం నుండి విముక్తి పొందడం జరిగింది. ఈ కార్యక్రమం హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వాంకుడోతు అశోక్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఠాను నాయక్ ఫోటో కు అశోక్ నాయక్ మురళి నాయక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు ఇట్టి కార్యక్రమంలో సేవాలాల్ విద్యార్థి సేన వరంగల్ జిల్లా కన్వీనర్ బానోతు సుమన్ నాయక్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ఇస్లావత్ వీరన్న నాయక్ ఆలోజి నాయక్ సేవాలాల్ విద్యార్థి సేన మహిళా విభాగం సభ్యురాలు శివాని పాల్గొన్నారు.

# అసెంబ్లీలో క్యాబినెట్ భేటీ

**బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం**

**ప్రజాభవన్ నల్లపోచమ్మ ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి ప్రత్యేక పూజలు**

**మండలిలో ఇంగ్లీషులో మంత్రి ఉత్తమ్ బడ్జెట్ ప్రసంగం**

**బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల అభ్యంతరం, బయటకు వెళ్లిపోయిన కాంగ్రెస్ సభ్యులు**

హైదరాబాద్, మార్చి 20 ( మనం బ్యూరో ) : రాష్ట్ర వార్షిక బడ్జెట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బడ్జెట్ సమావేశాలలో భాగంగా శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతకు ముందు బడ్జెట్ ప్రతిపాదనల ప్రతులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీఎం రేవంత్ రెడ్డికి అందించగా, ఆయాన పుష్ప గుచ్ఛంతో భట్టిని అభినందించారు. అంతకు ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన నివాసమైన ప్రజా భవన్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో బడ్జెట్ ప్రతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం అసెంబ్లీలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కాగా, శాసనమండలిలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్ ప్రసంగమంతా ఇంగ్లీషులోనే సాగింది. దీంతో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు మధ్యలో అభ్యతరం తెలిపారు. అటు అధికార కాంగ్రెస్ సభ్యులు కూడా ఉత్తమ్ ప్రసంగం అర్థం కాకపోవడంతో సభ నుంచి బయటకు వచ్చారు.

## ఆరు గ్యారంటీ హామీలు నీటిమూటలేనా?

- హామీలన్ని నెరవేర్చేదాక కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీస్తాం అని కేటీఆర్ వార్నింగ్
- గన్‌పార్క్ వద్ద ప్లకార్డులతో బీఆర్ఎస్ ఆందోళన,
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మరోసారి నమ్మిన ప్రజల్ని తీవ్రంగా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యులు శుక్రవారంనాడు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీగా విచ్చేచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యమని గ్యారంటీ కార్డులు ఇచ్చి భద్రం చేసుకోమన్నారని గుర్తుచేశారు. ఇంతవరకు ఒక్క గ్యారంటీని నెరవేర్చిందని లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వృద్ధులు, వితంతువుల తరఫున బడ్జెట్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.2500 మహాలక్ష్మీ నిధులు ఎప్పుడిస్తారని నిలదీస్తామని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో రైతులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంక్రాంతి, ఉగాది గడిచినా రైతు భరోసా పడలేదని అన్నారు. ఉద్యోగాలపై బొంకుతున్న కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు.

# బడ్జెట్‌లో పోలీసులకు పెద్దపీట




- రూ. 11,907 కోట్ల కేటాయింపు
- గత ఏడాది కంటే 16 శాతం పెంపు
- రాష్ట్ర విధానం...దేశానికే దార్శనికం
- మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్,మార్చి 20(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః గత ఏడాది కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో హోంశాఖకు 16 శాతం నిధులకు అధికంగా కేటాయింపు జరిపారు. ఈక్రమంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో హోంశాఖకు 11,907 కోట్ల భారీ నిధులను కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. కొత్త బడ్జెట్‌లో మావోయిస్టుల పునరావాసం, పోలీసు వ్యవస్థ ఆధునీకరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చారమన్నారు. గత ఏడాది బడ్జెట్‌లో 9,564 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది బడ్జెట్‌లో సుమారు 16.87శాతం పెంచడం జరిగిందన్నారు. ముఖ్యంగా జీరో టాలరెన్స్ విధానంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలతో పాటు మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. వెరసి గత సంవత్సరాలతో పోలిస్తే హోంశాఖకు కేటాయింపులు గణనీయంగా పెరిగాయని, రాష్ట్రంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుందన్నారు.

**రాష్ట్రం...దేశానికి దార్శనికం ః**

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల సమస్యను శాంతి భద్రతల సమస్యగా పరిగణించి వారిపై ఉక్కుపాదం మోపిందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్రం అటు పోలీసు, ఇటు సైనిక బలగాలతో మావోయిస్టు పార్టీని అణిచివేసిందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మావోల సమస్యలకు సంబంధించి మూలాలను విశ్లేషించిందని, యువతకు సరైన జీవనోపాధి, సామాజిక గౌరవం, ఆర్థిక భరోసా కల్పిస్తే అడవులలోకి వెళ్లిన వారు ఆయధాలు వీడి జనజీవన స్రవంతిలో కలుస్తారనే వాస్తవాన్ని గుర్తించిందన్నారు. ఇదే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం మావోయిస్టుల లొంగుబాటులో అనుసరించిన విధానం దేశానికే దార్శనికమైందన్నారు.

తెలంగాణ రాష్ట్రం అవిర్భవించిన 2014 నుంచి 23 వరకు 347 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2023 డిసెంబర్ 7 నుంచి 2026 మార్చి8 వరకు 732మంది వివిధ హోదాలలోని మావోయిస్టులు లొంగిపోయారన్నారు. నక్సలిజం పుట్టుకకు కారణమైన ప్యూడలిస్ట్, సామాజిక,ఆర్థిక అసమానలను రూపుమాపితేనే మావోయిస్టు ఉద్యమానికి ముగింపు పలకగలమని తెలంగాణ రాష్ట్రం నిరూపించిందన్నారు. సమగ్ర సంక్షేమం, ఉపాధి ద్వారానే నిజమైన సామాజిక మార్పు సాధ్యమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం దేశానికే మార్గదర్శనం చేసిందని మంత్రి పేర్కొన్నారు.

# బడ్జెట్‌పై ప్రభుత్వం విఫలం ప్రజలకు లాభం శూన్యం

**ఈ బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు మంగళం పాడింద్రు?**

**మంత్రులు అంకెలతో మాయచేసే ప్రయత్నం చేసింద్రు?**

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**




హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్పందించారు. ఈ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది శూన్యమని విమర్శించారు. ఇది అంకెల గారడీ తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనంలేదని అన్నారు. ఈ బడ్జెట్ ప్రజలను మోసం చేసేదిగా ఉందని మండిపడ్డారు. మహిళలు, పేదలు, నిరుద్యోగులు, రైతులు ఇలా ఎవరికీ ఉపయోగపడని బడ్జెట్ అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు, కేటాయింపులు ఒక్కటీ బడ్జెట్‌లో కనిపించలేదని విమర్శించారు. అవినీతికి అవకాశం ఉన్న ప్రాజెక్టులకు భారీ మొత్తంలో నిధులు కేటాయించారని ఆరోపించారు. గత బడ్జెట్ అంచనాలను అందుకోవడంలోనే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కానీ ఇప్పుడు మరోసారి అంకెలతో మాయచేసే ప్రయత్నం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో కూడా ఆరు గ్యారెంటీలకు మంగళం పాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం, వితంతు పెన్షన్ రూ.4 వేలకు పెంచుతామన్న హామీలను నెరవేర్చలేదని అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రస్తావన లేదని అన్నారు. రైతులకు ఇచ్చే రైతు భరోసాను కూడా ఎగ్గొట్టారని విమర్శించారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు.

## చర్చ అంటేనే ప్రభుత్వం లాగు తడుస్తోంది..

**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగాలేదు?**

**చరిత్రలో ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలే**

**ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం : మధుసూదనాచారి**




హైదరాబాద్, మనం ప్రతినిధి : చట్టసభల్లో చర్చ అంటేనే ప్రభుత్వం లాగు తడుస్తోందని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనచారి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు అసెంబ్లీలో జవాబు ఇవ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండటం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తుందని మధుసూదనచారి మండిపడ్డారు. ప్రతిపక్షాలు అడిగిన ఏ ఒక్కదానికీ జవాబివ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. మేం లేవనెత్తిన అంశలపై పలాయనం చిత్తగించడం కనిపిస్తోందని అన్నారు. ఎగవేతలు, ఎదురుదాడి, అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని అన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు.

## జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ సంగతేంటి?

- తాజా బడ్జెట్‌లో జర్నలిస్టులకు మొండి చేయి?
- హెల్త్ కార్డ్ పని చెస్తదా?... డైలమాలో జర్నలిస్టులు
- బడ్జెట్‌పై టీయూడబ్ల్యూజే ఆందోళన వ్యక్తం

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టులకు మొండి చేయి చూపిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ఆరోపించారు.


బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్ ముచ్చట అసలే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వంలో కంటే తాము అధికంగా సంక్షేమం కోసం నిధులు కేటాస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జర్నలిస్టులను పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో అదనంగా 100 కోట్లు సంక్షేమ నిధిని కేటాయిస్తానని చెప్పి ప్రస్తుత బడ్జెట్‌లో చిల్లి గవ్వ కేటాయించకపోవడం అన్యాయం అన్నారు.

తాజా బడ్జెట్‌లో కూడా ఇళ్ల స్థలాల ప్రస్తావన చేయకపోవడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పలుమార్లు కోరినా హెల్త్ కార్డు సంబంధించిన అంశమే బడ్జెట్ ప్రసంగంలో లేక పోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రభుత్వ తీరును పరిశీలిస్తే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రతను అందించే జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను ఈ ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేసిందా? అనే అనుమానం కలుగుతుందన్నారు. ఇది తెలంగాణ జర్నలిస్టులకు పూర్తిగా అన్యాయం చేసిన బడ్జెట్‌గా తాము భావిస్తున్నట్లు ప్రకటించారు. ఈ బడ్జెట్‌పై తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

## హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు 50 శాతానికి పెంపు



హైదరాబాద్, మార్చి 20 : హైదరాబాద్లో ఉద్యోగం చేస్తున్న వారికి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఇంటి అద్దెభత్యం (హెచ్‌ఆర్‌ఏ) మినహాయింపు పరిమితిని 50 శాతానికి పెంచింది. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు, 2026ను కేంద్రం శుక్రవారం నోటిఫై చేసింది. ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో.. ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న కొత్త ఆదాయపు పన్ను చట్టంలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి రాబోయే కొత్త నిబంధనలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేసింది.

గతంలో ముంబయి, ఢిల్లీ, చెన్నైలను మాత్రమే మెట్రో నగరాలుగా పరిగణించేవారు. ఇప్పుడు ఈ జాబితాలోకి హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ లను కూడా చేర్చారు. అంటే 8 నగరాల్లో నివసిస్తున్న ఉద్యోగులు తమ జీతంలో 50 శాతం వరకు హెచ్‌ఆర్‌ఏ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. మిగిలిన వారికి యథాతథంగా 40 శాతం కొనసాగుతుంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో అంటే 2027 జులైలో ఫైల్ చేయబోయే రిటర్నుల సమయంలో ఇది వర్తిస్తుంది. ఆగస్టు 12న కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సంక్లిష్టంగా ఉన్న ఆదాయపు చట్టాన్ని సులభతరం చేయడం దీని ఉద్దేశం. పాత ఆదాయపు పన్ను చట్టంలో 819 సెక్షన్లు ఉండగా.. కొత్త దాంట్లో 536కు కుదించారు. అలాగే చాప్టర్లను సైతం 47 నుంచి 23కు తగ్గించారు. పాత ఆదాయపు పన్ను చట్టంలో 5.12 లక్షల పదాలు ఉండగా దాన్ని.. దాదాపు సగానికి అంటే 2.6 లక్షలకే పరిమితం చేశారు. అదనంగా 39 కొత్త టేబుళ్లు 40 ఫార్ములాలు చేర్చారు.

## మెడికల్ సీట్ల భర్తీకి గడువు పెంచాలె

### సుప్రీం కోర్టుకు యాజమాన్యాల వినతి



ఢిల్లీ, మార్చి 20 : తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసిందని, అప్పటికి ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఖాళీగా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహా, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకొచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని కోర్టుకు వివరించారు. గడువు పెంచాలని ఫిబ్రవరి 28కి ముందే.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేయగా.. ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు వివరించారు. ఇదే పరిస్థితి తలెత్తితే.. కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని చెబుతూ.. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందుంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్ల సమాధానం చెప్పాలని ఎన్‌ఎంసీకి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సుప్రీం కోర్టు మార్చి 23కు వాయిదా వేసింది.

## ప్రభుత్వ బడ్జెట్.. ప్రజలను తీవ్ర నిరాశ పరచింది?

- బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ తీవ్ర అసంతృప్తి

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు ఎల్. రమణ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు నిరుద్యోగులు, మహిళలు, వృద్ధుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. బీసీలకు ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు. ముదిరాజులు, మున్నూరు కాపులు, గొల్ల కుర్మలు, చేనేత, గీత కార్మికులతో పాటు ఇతర బీసీ కులాలకు మొండిచేయి చూపింది అని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు ప్రకటించిన 'ఆరు గ్యారెంటీలు' బడ్జెట్‌లో ఎక్కడా కనిపించకపోవడం గమనార్హమని, వాటికి తగిన నిధుల కేటాయింపులు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. గత బడ్జెట్లో రూ. 56 వేల కోట్లు కేటాయించి, ఈసారి దానిని రూ. 50 వేల కోట్లకు తగ్గించడం దారుణమని పేర్కొన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ సంపద సృష్టించి పేదలకు పంచుతూ సంక్షేమ స్వర్ణయుగాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకే నియామక పత్రాలు అందిస్తూ తామే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. పెన్షన్ల పెంపు కోసం ఎదురుచూస్తున్న ప్రజలను కూడా ప్రభుత్వం నిరాశపరుస్తోందని అన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో భారీ అవినీతి

- టెండర్లలో వెయ్యి కోట్ల స్కాం : హరీశ్‌రావు
- ఆర్గనైజ్డ్‌గా రింగ్ అయ్యి పనులను పంచుకుంటున్న కాంట్రాక్టర్లు
- 76 స్కూళ్లలో ప్రతి టెండర్‌కి ఎక్సెస్ ధర కోట్ చేసింద్రు?
- కనిష్టంగా 4.59%.. గరిష్టంగా 4.96% ఎక్సెస్‌తో 5% దాటకుండా పక్కా ప్లాన్‌తో కొల్లగొట్టింద్రు? సమయం వచ్చినప్పుడు అన్నీ బయటపెడతా : హరీశ్‌రావు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాములు కొనసాగుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులను పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి స్కాంలు చేస్తున్నాడని అన్నారు. అందులో సీఈ, ఈఎన్‌సీ అందరూ రిటైర్డ్ వాళ్లే ఉన్నారని తెలిపారు. నాలుగైదు స్కూళ్లను ప్యాకేజీ చేసి అన్యాయాలకు తెర తీశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వీటి టెండర్లలో రూ.1000 కోట్ల స్కాం జరిగిందని అన్నారు. ఇందులో బీజేపీ వారికి ఒకటి, రెండు ప్యాకేజీలు దక్కాయని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ బయటపెడతామని హరీశ్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్‌గా అయ్యి పనులను పంచుకుంటున్నారని అన్నారు. 76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లలో కనిష్టంగా 4.59% నుంచి గరిష్టంగా 4.96% ఎక్సెస్తో, నిబంధనల ప్రకారం 5% దాటకుండా పక్కా ప్లాన్‌తో కొల్లగొట్టారని విమర్శించారు. ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. 76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారని అన్నారు. అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95% ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్‌లో 4.95 ఎక్సెస్‌కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్‌లో 4.95 ఎక్సెస్‌కు టెండర్ ఇచ్చారని.. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్‌లో 4.77 ఎక్సెస్‌కు టెండర్ ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్‌లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్‌కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గం ఖమ్మంలో 4.95 ఎక్సెస్‌కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి సీతక్క నియోజవర్గం ములుగులో 4.95 ఎక్సెస్‌కు టెండర్ ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ నియోజకవర్గం ఆంథోల్‌లో 4.99కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నియోజకవర్గం వికారాబాద్‌లో 4.89కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని తెలిపారు.



## ముస్లింల పవిత్ర రంజాన్!!

నెలవంక నవ్వులతో నింగి పులకించగా..
ముప్పై రోజుల నిష్ఠ ముగిసి మురిపించగా..
ప్రార్థనల పరిమళం పుడమిని తాకగా..
వచ్చెను రంజాన్ పండుగ పరవశంగా!
ఆకలి కేకల అర్థం తెలిసే 'రోజా' దీక్షలు,
దైవ చింతనలో సాగే పవిత్ర ఆచరణలు..
కులమతాల కంచెలు చెరిపేసే 'ఇఫ్తార్' విందులు,
మానవత్వపు మమతను చాటే మధుర క్షణాలు!
తనకున్న దానిలో తోటివారికి పంచే 'జకాత్',
బీదవాడి మొహంలో వెలిగించే చిరునవ్వుల
కాంతి..
ప్రతి గుండెలో నిండాలి సోదరభావపు శాంతి,
ప్రతి ఇంటా కురియాలి అల్లాహ్ కరుణా కాంతి!
ఈద్గా మైదానంలో ఏకమైన జనవాహిని,
ప్రేమతో పెనవేసుకునే ఆత్మీయ ఆలింగనలు..
షీర్ ఖుర్మా తీపిలా నిండాలి జీవితపు తీపి,
అందరికీ తెలియజేయాలి ఈ 'ఈద్' గొప్పతనం
చాటి!
చంద్రుడి చిలిపి చిరునవ్వుతో చిగురించే వేళ,
చీకట్లను చీల్చుకుంటూ వెలుగై వచ్చే పండుగ
రంజాన్.
ఉపవాసాల ఉపన్యాసం నేర్పిన నియమం,
మనసును మలిచిన దివ్యమైన సాధనం.
దానం దయల దివ్యస్వరూపం,
బాధలో ఉన్నవారికి భరోసా అయ్యే భావం,
అదే ఈద్ ఉల్ ఫితర్ సందేశం!!

**- మీర్జా సల్మాన్ బేగ్**

# సామరస్య పతాక.. ఐక్యతా ప్రతీక ఈదుల్ ఫిత్ర్



రమజాన్ నెల ముగిసిన తరువాత వచ్చే ఈదుల్ ఫిత్ర్ పర్వదినం ముస్లిం సమాజానికి ఒక సాధారణ పండుగ కాదు. ఏకబిగిన నెల రోజుల పాటు సాగిన ఆత్మపరిశీలన, నియమ శిక్షణ, ఉపవాసం, ప్రార్థన, దానం, సహనం వంటి విలువల సాధనకు అందివచ్చిన అవకాశం. రమజాన్ ముగిసిన తరువాత జరుపుకునే ఒక మహత్తరమైన ఆధ్యాత్మిక సంబరం. నెల రోజులపాటు మనిషి ఆకలి దప్పులు అనుభవిస్తూ తన లోపలి ఆత్మను పరిశుద్ధం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయాణానికి ముగింపు సూచించే ఆనందోత్సవమే ఈదుల్ ఫిత్ర్. ఈ పండుగలో ఉన్న అసలు అర్థం కేవలం కొత్త బట్టలు ధరించడం, పాయసం సేవించడం, బంధువులతో కలుసుకోవడం మాత్రమే కాదు. దాని వెనుక ఒక గొప్ప ఆధ్యాత్మిక, తాత్విక, సామాజిక సందేశం దాగి ఉంది. ఆ సందే శాన్ని అర్థం చేసుకున్నప్పుడే ఈదుల్ ఫిత్ర్ అసలు గొప్పతనం మనకు అర్థమవుతుంది.

ఇస్లాం ధర్మంలో ఉపవాసం (సౌమ్) కేవలం ఆకలి దప్పులను భరించడం మాత్రమే కాదు. మనిషి తన కోరికలను నియంత్రించుకోవడం, లోపలి చెడులను జయించడం, తనను తాను శుద్ధి చేసుకోవడం అనే గొప్ప సాధన. ఉపవాసం ద్వారా మనిషి తన లోని అహంకారం, అసూయ, ద్వేషం, స్వార్థం వంటి దుర్గుణాలను త్యజించడం నేర్చుకుంటాడు. రమజాన్ నెలలో ముస్లింలు ఎక్కువగా ప్రార్థనలు చేయడం, ఖురాన్ పఠనం చేయడం, పేదలకు దానం చేయడం ద్వారా ఆత్మీయతను పెంపొందించుకునే ప్రయత్నం చేస్తారు.

పవిత్ర ఖురాన్ లో అల్లాహ్ ఇలా చెబుతున్నాడు.. 'విశ్వాసులారా! మీకు పూర్వం వారిపై విధించినట్లే మీపై కూడా ఉపవాసం విధించబడింది, తద్వారా మీలో 'తఖ్వా' (దైవభీతి) జనించే అవకాశం ఉంది' (అల్ బఖరా 2:183). ఈ ఆయత్ ఉపవాసం అసలు లక్ష్యాన్ని స్పష్టంగా వివరిస్తోంది. ఉపవాసం మనిషిని దైవభక్తి వైపు తీసుకువెళుతుంది. అల్లాహ్ ముందు మనిషి ఎంత చిన్నవాడో, ఎంత ఆధారపడి ఉన్నాడో గుర్తు చేస్తుంది.

ఈదుల్ ఫిత్ర్ పండుగలో మరో ముఖ్యమైన అంశం' సదఖయే ఫిత్ర్'. ప్రతి ముస్లిం ఒక నిర్ణీత మొత్తాన్ని పేదలకు ఇచ్చే దానం ఇది. ఈ దానం వెనుక గొప్ప సామాజిక తత్వం ఉంది. పండుగ రోజు ఎవరూ బాధపడకూడదు అనే భావన దీనికి మూలం. దైవప్రవక్త మహమ్మద్ (స) ఇలా చెప్పారు..'ఫిత్రా ఉపవాసాన్ని అపవిత్రమైన మాటల నుంచి శుద్ధి చేస్తుంది, పేదలకు ఆహారం అందిస్తుంది'.



ఈద్ రోజు ఉదయం ముస్లింలు ప్రత్యేక ప్రార్థన కోసం ఈద్ గాహ్ లేదా మస్జిద్ లకు వెళ్తారు. వేలాది మంది ఒకే చోట చేరి ఒకే వరుసలో నిలబడి నమాజ్ చేయడం ఒక గొప్ప ఐక్యతకు ప్రతీక. అక్కడ అందరూ దైవం ముందు సమానులే. ఈ సమానత్వం ఇస్లాం ధర్మ ప్రధానతత్వం. మానవ సమాజంలో ఏర్పడిన కుల, వర్ణ, ఆర్థిక అసమానతలను అంతం చేసే దిశగా ఇస్లాం గొప్ప సందేశాన్ని ఇస్తుంది. ఈద్ ప్రార్థనలో భుజం భుజం కలిపి నిలబడటం ద్వారా మనిషి ఒంటరిగా జీవించలేడని, సమాజంతో కలిసే జీవితం సార్థకం అవుతుందని గుర్తు చేస్తుంది. ఈద్ (పండుగ) కుటుంబ సంబంధాలను బలోపేతం చేస్తుంది.

ఇప్పటి వేగవంతమైన ప్రపంచంలో మనుషుల మధ్య సంబంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. వ్యక్తిగత ప్రయోజనాలు, పోటీ భావం, ఆర్థిక ఒత్తిడులు మనిషిని ఒంటరిగా మార్చుతున్నాయి. ఇలాంటి సమయంలో ఈద్ పండుగ మనిషిని మళ్లీ కుటుంబం వైపు, సమాజం వైపు తీసుకువెళ్తుంది.

ఈ పండుగలో మరో ముఖ్యమైన సందేశం 'సామరస్యం'. ఇస్లాం ధర్మం ఇతర మతాల ప్రజలతో శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహిస్తుంది. ఈద్ సందర్భంలో ముస్లింలు తమ పొరుగువారితో, ఇతర మతాల మిత్రులతో కూడా ఆనందాన్ని పంచుకుంటారు.

ఈ నేపథ్యంలో ఈద్ మనకు ఒక గొప్ప తాత్విక సందేశం ఇస్తుంది. మనిషి జీవితం కేవలం భౌతిక సంపదల కోసం మాత్రమే కాదు. మనిషి తనలోని మానవత్వాన్ని పెంపొందించుకోవాలి. సమాజానికి ఉపయోగపడే జీవితం గడపాలి. ఇతరుల బాధను అర్థం చేసుకోవాలి.

రమజాన్ నెలలో మనం సాధించిన ఆత్మపరిశుద్ధత, సహనగుణం, దానగుణం, దైవభక్తి వంటి విలువలు కేవలం ఒక నెలపాటు మాత్రమే కాకుండా జీవితాంతం కొనసాగాలి. ఈద్ ఆ విలువలను కొనసాగించే ప్రతిజ్ఞగా మారాలి. రమజాన్ తర్వాత మనిషి ఒక కొత్త ఆత్మతో జీవితం ప్రారంభించాలి. ప్రస్తుతం ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. యుద్ధాలు, ద్వేష రాజకీయాలు, సామాజిక విభజనలు, ఆర్థిక అసమానతలు. ఇలాంటి పరిస్థితుల్లో రమజాన్ మనిషికి, ప్రేమ, దయ, ఐక్యత, సహజీవనం అనే మహత్తరమైన పాఠాలు నేర్పు తుంది.

ఈద్ మనకు బోధించే మరో విషయం ఏమిటంటే, మనిషి మనిషికి శత్రువు కాదు.సమాజంలో శాంతి ఏర్పడాలంటే పరస్పర గౌరవం అవసరం.

ఈదుల్ ఫిత్ర్ పండుగ ఒక సామాజిక ఉద్యమం. ఒక మానవతా సందేశం. ఈద్ రోజున మనం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' అని చెప్పుకునే ఆ క్షణం - మనుషుల మధ్య ఉన్న అన్ని గోడలు కూలిపోవాలని సూచించే ఒక అందమైన ప్రతీక.

ఈదుల్ ఫిత్ర్ అనేది కేవలం శుభాకాంక్షలు చెప్పుకునే రోజు మాత్రమే కాదు. అది మనసులను దగ్గర చేసే అనుభూతి. మనుషుల మధ్య ఉన్న గోడలను కూల్చే సందేశం. శాంతి, సహనం, సామరస్యం, ఐక్యతలకు ప్రతీకగా నిలిచే ఒక మానవతా పిలుపు. ఆ పిలుపును మన జీవన విధానంగా మార్చుకున్నప్పుడు - ఈద్ నిజంగా ఈద్ అవుతుంది.

**- యండి. ఉస్మాన్ ఖాన్**

# తెలంగాణ సంక్షేమ బడ్జెట్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కింద, మూడవ తెలంగాణ బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి అయినా మల్లుభట్టి విక్రమార్క సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవ త్సరానికి 3.24 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో మొత్తం రెవెన్యూ వ్యయం 2.34 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మూలధన వ్యయం 47,267 కోట్లుగా నిర్దేశించారు. ఇది ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో పోలిస్తే 20% కంటే ఎక్కువ పెరుగుదలను సూచిస్తుంది. ఆరు గ్యారం టీల అమలుకు మొత్తం రూ.50,713 కోట్లు కేటాయించారు. శాఖల వారీగా పంచాయతీరాజ్ శాఖకు రూ.2,622 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు సుమారు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు కేటాయించడం జరిగింది. వైద్య మరియు ఆరోగ్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు కేటాయించారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు కేటాయించగా, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,937 కోట్లు కేటాయించారు. అలాగే బీసీ సంక్షేమానికి రూ.3,769 కోట్లు కేటాయించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6,000 కోట్లు కేటాయించగా, గృహ నిర్మాణ శాఖకు రూ.7,430 కోట్లు కేటాయించడం జరిగింది.

ఇప్పటికే ఉన్న పథకాలకు అదనంగా తెలంగాణ 2026-27 బడెట్‌లో పలు కీలక సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యంగా ఇందిరమ్మ ఫ్యామిలీ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం కింద రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు, దీనికి రూ.4,000 కోట్లు కేటాయించి 2026 జూన్ 2 నుంచి అమలు చేయాలని నిర్ణయించారు. చేయూత పథకం కింద మరో 2 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేయగా, ఈ పథకానికి రూ.14,861 కోట్లు కేటాయించారు. విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా అభివృద్ధి చేయడానికి రూ.500 కోట్లు కేటాయించారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు పోషకాహారంతో కూడిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టి, ఇందుకు రూ.800 కోట్లు కేటాయించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని మొదటి సారిగా ఇంటర్మీడియట్ స్థాయికి విస్తరించి రూ.100 కోట్లు కేటాయించారు. ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి ఆధారితులకు క్యాష్‌లెస్ ఆరోగ్య రక్షణ పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అమలు చేయనున్నారు. ఉద్యోగుల కోసం ప్రమాద బీమా పథకం కింద ప్రమాద మరణానికి రూ.1.2 కోట్లు, 60 సంవత్సరాల వరకు రూ.10 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాద మరణానికి రూ.2 కోట్లు పరిహారం ఇవ్వనున్నారు. ఈ పథకాలకు కలిపి రూ.1,056 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు సిఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించి, నైపుణ్య శిక్షణ, భాషా శిక్షణ, వీసా మరియు ప్రయాణ సహాయం అందించనున్నారు.

వివిధ కారణాల వల్ల ప్రభుత్వాలు వాస్తవంగా ప్రతిపాదించిన కేటాయింపులను ఖర్చు చేయలేకపోతున్నాయి. ఆర్థిక మందగమనం




లేదా పన్నుల వసూళ్లలో తగ్గుదల వల్ల ప్రభుత్వాలకు బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులను పూర్తిగా కేటాయించడం లేదా ఖర్చు చేయడం సాధ్యం కావడం లేదు. ప్రాజెక్టుల ఆమోదంలో ఆలస్యాలు, పరిపాలనా లోపాలు, బ్యూరోక్రటిక్ అడ్డంకులు నిధుల వినియోగాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్నిసార్లు ప్రకృతి వైపరీత్యాలు లేదా అత్యవసర సంక్షేమ అవసరాల కోసం నిధులను మళ్లించాల్సి వస్తుంది. సరైన ప్రణాళిక మరియు శాఖల మధ్య సమన్వయం లోపం కూడా ఖర్చులను ఆలస్యం చేస్తుంది. అదనంగా అవినీతి, లీకేజీలు మరియు అమలు స్థాయిలో సామర్థ్యలోపాలు నిధుల సమర్థవం తమైన వినియోగాన్ని తగ్గిస్తాయి. 2025-26 తెలంగాణ బడ్జెట్లో మొత్తం వ్యయం సుమారు 3.04 లక్షల కోట్లుగా ప్రతిపాదించగా, అప్పు చెల్లింపులను మినహాయించి సుమారు 2.84 లక్షల కోట్ల ఖర్చు అంచనా వేశారు. తాజా కంప్ట్రోలర్(CAG)అండ్ ఆడిటర్ జనరల్ వివరాల ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో (నవంబర్ వరకు) రాష్ట్ర మొత్తం ఆదాయం సుమారు 1,66,785 కోట్లు మాత్రమే నమోదు కాగా, ఇది బడ్జెట్ అంచనాల 58.55% మాత్రమే కావడం వల్ల ఆదాయ లక్ష్యాలు పూర్తిగా సాధించలేదని తెలుస్తోంది. అదే సమయంలో రాష్ట్రం అప్పులు మరియు వడ్డీ చెల్లింపుల లక్ష్యాలను మించి ఖర్చు చేయగా, వడ్డీ చెల్లింపులు 24,085 కోట్లకు చేరి బడ్జెట్ అంచనాల కంటే 124% ఎక్కువగా ఉన్నాయి, ఇది పెరుగుతున్న అప్పుల భారం సూచిస్తుంది. ఇఅఎ నివేదికల ప్రకారం రాష్ట్రపు మొత్తం బాకీలు ఇటీవల 3 లక్షల కోట్లకు మించి పెరిగాయి, ఇది అప్పులపై అధిక ఆధారపడటాన్ని చూపుతోంది. కొన్ని సంవత్సరాల్లో ఆర్థిక లోటు (Fiscal deficit) GDPలో 3%గా నిర్దేశించిన FRBM పరిమితిని దాటడం వల్ల ఆర్థిక క్రమశిక్షణ బలహీనమవుతోందని వెల్లడైంది. సబ్సిడీలు, పెన్షన్లు మరియు వడ్డీ చెల్లింపులపై వ్యయం పెరగడం వల్ల అభివృద్ధి ఖర్చులపై ఒత్తిడి పెరుగుతోందని ఆడిట్ పేర్కొంది. రాష్ట్రం తన సొంత వనరుల ద్వారా సుమారు 80% ఆదాయం సమకూర్చు కునే సామర్థ్యం ఉన్నప్పటికీ, 98,244 కోట్ల హామీలు (guarantees) ఉండటం వల్ల ఆర్థిక ప్రమాదాలు కొనసాగు తున్నాయి. మొత్తంగా, ఆదాయ సేకరణ మరియు మౌలిక సదుపాయాల ఖర్చుల్లో రాష్ట్రం మంచి ప్రదర్శన కనబరుస్తున్నప్పటికీ, అప్పుల స్థిరత్వం, ఆఫ్-బడ్జెట్ అప్పులు మరియు ప్రజా నిధుల సమర్థ వినియోగంపై ఇంకా ఆందోళనలు కొనసాగుతున్నాయని ఇఅఎ పేర్కొంది. ఏ ప్రభుత్వం అయినా తన ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన హామీల ఆధారంగా బడ్జెట్‌ను ప్రతిపాదిస్తుంది. పాలకపక్షం మరియు ప్రతిపక్షం బడ్జెట్‌పై ఎంత వాదనలు, విమర్శలు చేసినా, ప్రజలు బడ్జెట్‌తో సంతృప్తి చెందేది వారి ప్రాథమిక అవసరాలు అయిన ఉపాధి, ఆదాయం, జీవన వ్యయం వంటి అంశాలను ఇది సమర్థంగా పరిష్కరించినప్పుడు మాత్రమే.

పన్నులు సహేతుకంగా ఉండి, ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడు సంతృప్తి పెరుగుతుంది. సంక్షేమ పథకాల సమర్థ అమలు మరియు కనిపించే అభివృద్ధి ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతాయి. పారదర్శకత మరియు నిధుల సరైన వినియోగం ప్రజల విశ్వాసాన్ని బలపరుస్తాయి. మొత్తంగా, ఆర్థిక వృద్ధి మరియు సామాజిక సంక్షేమాన్ని సమతుల్యంగా ప్రోత్సహించే బడ్జెట్ ప్రజల సంతృప్తిని పెంచుతుంది.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# ఎన్కకురుకుతున్న సదువులు





రాజు పీనుగును బుజానేసుకొని కాట్నాల గడ్డ వైపు మొసపోసుకుంట నడుస్తున్నడు. బుజం మీదున్న బేతాలుడు ఇదంతా జూసి రాజా నువు బరువు మొయ్యలేక గసుకొట్టు కుంట నడుస్తున్నవ్ కదా! నీ ఆయాసం తగ్గడానికి ఓ కత చెప్పనా! అని అడిగాడు. సరే సెప్పని రాజనగానే.. బేతాలుడు కత సెప్పుడు మొదలు వెట్టిండు. అనగనగా ఓ రాజ్జెం. ఆ రాజ్జెం పేరు బేపర్వా రాజ్జం. ఆరాజ్జేనికి రాజు మఖర శంభుడు. ఆయనకొక మంతిరి ఉండేటోడు. ఆయిన పేరు వాక్సతురుడు. రాజు ఏది జేయాల్నన్న మంతిరి మాట మీన జేసుడే.

మంతిరి కేముందంటే నా అసోంటి తోపులు,నాకు ఉపాయాలు జెప్పేటోల్లే ఫన్జేత్తరు.మిగతోల్లంత ఉట్టి బట్టేబాజిగాల్లు, పన్దొంగలు.ఆల్లందరికి జీతాల్దండుగ ,ఆల్లని ఉజ్జోగాల్నుంచి పీకెయ్యాలని మనసులనుకొని, తన సోపతి గాల్లతో సోచాయించిండు. ఆల్లు గూడ గంగెడ్లోలే తలూపింద్రు. ముందు గాల ఎవ్వల్ని దీసెయ్యాలే సోచాయిస్తున్నపుడు, ఒకాయన ఓ మంచి ముచ్చట జెప్పిండు. మన రాజ్యంల సదువు కునే పోరగాండ్లు మస్తుగున్నరు. ఆల్లకు సదువు జెప్పే పంతుల్లు సుత బొచ్చెడు మంది ఉన్నరు. ముందు గాల ఆల్ల ఫని పడ్దాం అనుకున్నడు. ఓరోజు రాజుతానికి బోయిండు. గాయినతో అననే అన్నడు. మన రాజ్యంల ఉజ్జోగులెక్కువైంద్రు అట్లనే పని దొంగలు సుత ఎక్కువైంద్రు. కిందినించి మీద్దాక వసూలు రాజాలు పెరుగుతున్నరు. ఇంకా ఈల్లందర్నీ పీకేత్తే బోలెడంత రూపాయల్మిగులుయ్. ఇంకొన్ని ఖార్కానాలు వెట్టచ్చు, కొత్తోల్లకు, పన్జేసే టోల్లకు ఉజ్జోగాలివ్వచ్చు అని మాంచిగ నమ్మిచ్చిండు.

మరి జనాలు ఎదురు తిరిగితే ఏంజేద్దాం! అని రాజు అననే అన్నడు. మీకెదురు తిరిగే దమ్మెవడిది రాజా, యెదురు తిరిగితే ఊకుంటమా! తొక్కి పడెయ్యం. బొక్కలో నూకెయ్యం. అనుకుంటూ ఇంక మీరు మాట్లాడే బాస బాలేదందాం, అల్లు ఇంట్ల బయిట ముచ్చటవెట్టే బాసను ఖతం జేద్దాం. పైగా మీరు రాజ(ఆంగ్ల)బాసలో సదువుకుంటే మీరు రాజులై పోవచ్చనే ఆస పెడ్దాం. గంతే గాకుండా అయ్యవార్లతో (పంతుల్లతో) ములాఖతౌదాం. ఆల్లతో గూడ మనమనుకున్నట్లే తలూపిద్దాం. ఆల్లేమయినా మట్లాడేదుంటే మనమే తికమక ముచ్చట్లడిగీ నోల్లు మూయిద్దాం. నాలు గైదు బడులుమూసి ఒక రాజ బాసలో బడులు తెరుత్తున్నం గదా! గిదేం చెప్పుకుందాం... ఇంకేమన్నంటే కులాల కొట్లాట వెట్టిద్దాం. బస్ ఖేల్ ఖతం దుఖ్నంబంద్.

మరి మన జనాలంతా సంఘాలు గట్టి మన దేశంల గలాట జేత్తరేమో నని అనుమానమని రాజు అనగానే, ఆల్లబొంద గా సంఘాలకు మనం బయపడ్తమా? మనది యేరే రాజ్జెం అయినంక సంఘాల జోరు ఉన్నదా? అన్ని ఆనపాముల్లెక్క ఉన్నయి గదా! గసొంటి సంఘాలకు బయపడ్తే మనమేం రాజ్యం జేత్తం? మరి మనమే రాసుకున్న నిబంధనల మాటలేంటీ? అని రాజుకు నచ్చజెప్పే అచ్చికాలు బుచ్చకాలు జెప్పిన్రు.

ఇంకా రకరకాల పేర్లతో బల్లు ఉన్నయ్. గిట్లైతే సదువులు ఒక్కతీర్గ ఉండయ్ కదా! గందుకనీ బువ్వ వెట్టి, సదువు జెప్పే బడులు (గురుకులాలు)మూసేద్దాం. గట్లైతే తిండికి లేనోడు బడి బంజేసి గింత పాలేర్లుగ మారుతరు. గింద్ల సుత మస్త్ పాయిదా ఉంటది. పాలేర్లు దొరుకుతరు, సర్కారు అల్ల మీన పెట్టె పుక్కానికిచ్చే బడి బట్టలు, వయ్యిలు,రాత బుక్కుల కర్సు సుత మిల్గుతయి.

పన్నెండో తరుకతి దాంక పరీచ్చలు గిరీచ్చలు అన్నీ బంద్. గీ పరీచ్చల్ల సుత గిప్పుడు 35 మార్కుల కామ్యాబ్‌ను 45 మార్కులకు పెంచుదాం. బస్ కామ్యాబ్ కాని పొల్లగాండ్లు ఏదన్నా పన్జేసుకుంటరు. ఇగ ఎంట్రన్సీ పరీచ్చలన్నీ బంద్జేసి గీ మార్కులతోటే పెద్దపెద్ద సదువులకు పంపిద్దాం. గప్పుడు ఊల్లల్ల సదివే టోన్కిగాక, పట్నపోన్కి, ప్రై'వేటోన్కి'(కార్పోరేట్) సీట్లత్తయి. గప్పుడు జనాలకు సర్కారు బడులు మీన పురాగ నమ్మకం లేకుండ అయితది. సర్కారు కర్సు తప్పుతది. బడులు పెట్టుమని, పంతుల్లుగావాలని అడిగేటోల్లు సుత ఉండరు. పంతుల్ల అక్కెర తక్వైతది. ఆల్లు జీతాల్ పెంచుమని,హోదా పెంచమని కొట్లాడే తారీఖుండదు. ఇంక ఆల్లను తయారుజేసే పెద్దబల్లను(డైట్ కళాశాలలు) గుడుక బంజేయచ్చు. మండలానికి ఒకటో, రొండో బడులు నడిపిద్దాం. బస్సులేద్దామని చెప్పుదాం. గిప్పుడెట్లాగూ ఫిరి బస్సులు(ఆడోల్లకు) నడిపిత్తన్నం గదా! గండ్లనే గీ ఫోరలు సుతం బస్సచ్చినప్పుడే అత్తరు. సదివేటోడు సదువుతడు. సాతగానోడు రాజుతాన లేదా అల్ల తాబేదార్ల తాన పాలేర్లైతరు.గంతే...! జీతాలకోతకు నీకేం వక్కుంది అని ఈల్లంటే యెట్లా! అని రాజుకు మల్లో అనుమానం. అన్నీ మనమే.. అంతా మనదే. మనకు నచ్చిందీ చేద్దాం. పదవేయ్ల రూపాయల్ పడేత్తే సురుకైన ఫోరలు మత్తు మంది పంతుల్లైతరు. ఈల్లందరూ అద్దెసరుకసోంటోల్లు(కాంటాక్ట్ ) ఇగ గాల్లు అడ్డుకుంటే నోల్లునొక్కేద్దాం. గంతే..!!

'సేటెరుగనావిడ మొగని పెండ్లి బోయినట్లు', మంతిరి మాటలు నమ్మి రాజు ఫర్మాన జారి జేసిండు. అని బేతాలుడు కతజెప్పి, రాజా యిప్పుడు నువ్వు నా సవాల్‌కు సరైన ముచ్చట జెప్పక పోతే నీ తలకాయ యెయ్యి వక్కలైతది. ఇను నిజంగనే అయ్యవార్లు పన్జేత్తలేరా? పన్జేయించే బాద్యత రాజ్యానికి లేదా? పని సెయ్యని వాల్లనిడిసి వెట్టి సదువుల గుడులు మూసేసు డేంది?

చదువులు బెహతరీన్‌గా ఉండాలంటే పంతులయ్యలకు బెహతిరీన్ జీతాలు ఉండాలి. గట్ల అయితే ఊళ్ళల్లా పంతుల్లకు కొంచెం ఇలువ ఉంటదని మంచి మంచోళ్ళు సెప్పిన్రు గదా మరిగీన గిట్ల ఎందుకు అన్నడు? అనగానే రాజు ఆయాసంలో గూడ పోరగాండ్లు జడుసుకునేటట్టు నవ్వి, పిచ్చోడా 'కుక్కను చంపాలంటే పిచ్చి కుక్క అనే పేరు వెట్టాలే'. బల్లు మూసెయ్యాలంటే అయ్యవార్లు పన్జేత్తలేరనే పచారం జెయ్యాలే. పన్జెత్తలేరు గనుక జీతాల్ కోతవెట్టాలే. ఉన్నదున్నట్టుగా జెప్పాలంటే సర్కారు రకరకాల ఇకమతుల తోని, నింపుడూ,ఎంపుడు పనులతోని, దినాం ఓ కొత్త పారం దెచ్చి, అడిగిందే అడుగుతూ, గుమస్తా పనికే అల్ల పనితనమంతా ఐపోతాంది. పోరలను అల్ల బాసల సదివిత్తే తెలివికచ్చి, మనంజెప్పింది ఇనరు అనే ఇకమతులు. ఇగ గా మంతిరి సెప్పినట్టు జేత్తే పోరల సదువులన్ని సట్టుబండలైతయి.

ఎవడడిగితే ఆల్లకు కాన్గిరి బడి వెట్టుకొమ్మన్నంక, సర్కారు బల్లకి పోరగాండ్లు యాడికెల్లత్తరు. రాజ్యానికి కర్సు తప్పియ్యాలంటే సర్కారు యన్ని మూసెయ్యాలే.

గట్లనే దునియాల పేద్ద (ప్రపంచ)బాంక్ గూడ గదే అంటంది గదా! ఈల్లు,ఆల్లు ఒకటేనాయే. నాలుగైదు బల్లను ఒకటి జేత్తే పొయేటోడు బడి కోతడు లేదంటే దరుమ పెబువు లిచ్చిన గొర్లకో, బర్లకో వోతరు. కొంచెం పైసలుంటే కాన్గిరి బడులకోతడు.. గిప్పుడు రాజులూ (పాలకులు)కోరుకునేది కాన్గిరే గదా! అని రాజు సెప్పగానే బేతాలుడు పగలబడి నవ్వుకుంటు పీనుగుతో కల్సి మయమై పోయిండు

**- మీసా రాజమల్లయ్య**
9491319904

# మధ్యతరగతి ఆశల దోపిడీ

కార్పోరేట్ రంగం ఆర్థిక వ్యవస్థకు ఇంధనం అందించేలా పనిచేస్తుంది. అయితే, ఈ రంగంలోని కొన్ని విధానాలు మధ్యతరగతి ప్రజల ఆర్థిక ఆశలను క్రమపద్ధతిలో దోపిడీ చేసే విధంగా ఉన్నాయనే అభిప్రాయాలు మాత్రం వున్నాయి. మధ్యతరగతి ప్రజలు తమ భవిష్యత్తు భద్రత కోసం సేవింగ్స్‌ను పెట్టుబడులుగా మార్చాలని ఆశిస్తారు. కానీ ఈ ప్రక్రియలో ఏర్పడే అసమతుల్యతలు వారి ఆశలను దోపిడీ చేస్తున్నాయి.

ప్రమోటర్లు మార్కెటింగ్ వ్యూహాల ద్వారా అతిశయోక్తి హామీలు ఇవ్వడం, లేదా భవిష్యత్తు లాభాలను అతిగా ప్రచారం చేయడం వల్ల మధ్యతరగతి ప్రజలను ఆకర్షణకు గురి చేస్తారు. ఫలితంగా, వారి ఆశలు 'వాటాలు' (షేర్స్) రూపంలో మార్కె ట్లోకి ప్రవేశిస్తాయి. కానీ ఆ సంస్థ యొక్క నిర్వహణ లో వీరికి పరిమిత పాత్రే ఉంటుంది. ఇది చట్టబద్ధమైనదే అయినప్పటికినీ ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ లోపం వల్ల నష్టాలు పెరుగుతాయి. తద్వారా మధ్యతరగతి ప్రజలు నష్టపోతుంటారు. రెగ్యు లేటరీ బాడీలు ఇలాంటి ప్రక్రియలను పర్య వేక్షిస్తాయి. కానీ పూర్తి పారదర్శకత లోపించి నప్పుడు సమస్యలు తలెతుతాయి. ఫలితంగా, మధ్యతరగతి ఆశలు మరిన్ని వాటాలుగా మారి, మార్కెట్ అస్థిరతలకు గురవుతాయి. భారతీయ కంపెనీల్లో ప్రమోటర్ వాటా సగటున 55-60 శాతం వరకు ఉంటుంది. ఇది నిర్ణయాలు తీసుకునే సమయంలో మైనారిటీ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పూర్తిగా ప్రభావితం చేసే అవకాశం కలిగిస్తుంది. ఈ అసమతుల్యత మధ్యతరగతి పెట్టుబడిదారులకు ఎప్పటికీ ప్రమాదకరమే.ఒక సంస్థ విజయవంతమైన తర్వాత, దాని ప్రమోటర్ యొక్క కుటుంబ సభ్యులు లేదా సంబంధితులు కొత్త కంపెనీలు స్థాపించడం సర్వసాధారణం. మొదటి సంస్థ యొక్క 'గుడ్విల్' అంటే మంచి పేరు మరియు విశ్వాసం, ఈ కొత్త సంస్థలకు ఆధారంగా మారుతుంది. ఉదాహరణకు, మొదటి సంస్థ బ్రాండ్ విలువను ఉపయోగించుకుని మరిన్ని పెట్టుబడులు సేకరించడం మధ్యతరగతి ప్రజల మరిన్ని ఆశలను ఆకర్షిస్తుంది.

చట్టపరంగా, ప్రమోటర్లు కంపెనీ నిధులను వ్యక్తిగత ఉపయోగానికి మళ్లించకూడదు. కానీ రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్స్ లాంటి పద్ధతుల ద్వారా ఇది సాధ్యమవుతుంది. సెబీ అధ్యయనం ప్రకారం, 233 లిస్టెడ్ కంపెనీల్లో 25 శాతం సందర్భాల్లో కంపెనీలు నెట్ ప్రాఫిట్లో 20 శాతం కి పైగా రాయల్టీని సంబంధిత పార్టీలకు చెల్లించాయి. నష్టాల్లో ఉన్న 63 కంపెనీలు కూడా రూ. 1,355 కోట్లు చెల్లించాయి.

ఇన్వెస్టర్లు ఇలాంటి విషయాలపై ప్రశ్నలు సంధించలేకపోవడం, రెగ్యులేటరీ ఆడిట్లు ఆలస్యమవడం వల్ల నష్టాలు పెరుగుతాయి. మధ్యతరగతి ప్రజలు తమ పెట్టుబడులు కోల్పోయినప్పుడు ఎవరిని అడగాలో తెలియని పరిస్థితిలో ఆందోళన చెందుతారు. ఇది చట్టబద్ధమైన ప్రక్రియలోనే జరిగినప్పటికీ, ఇన్వెస్టర్ రక్షణ విషయంలో బలహీనతలను ఎత్తిచూపుతుంది. ఒక సంస్థ విఫలమైన తర్వాత కూడా, ప్రమోటర్లు కొత్త కొత్త కంపెనీలు స్థాపించి మళ్లీ మళ్లీ పెట్టుబడులు సేకరిస్తారు. మధ్యతరగతి ఆశలు మళ్లీ మళ్లీ వాటాలుగా మారి, ఈ చక్రం నిరంతరం కొనసాగుతుంది. అంతా చట్టబద్ధంగా జరుగుతుంది, కానీ ఇది ఒక విధమైన 'సిస్టమాటిక్ రిస్క్'ను సృష్టిస్తుంది. విశ్లేషణాత్మకంగా, ఇది మార్కెట్ డైనమిక్స్కు సంబంధించినది. రెగ్యులేషన్లు ఉన్నప్పటికీ, ప్రమోటర్లు కొత్త ఇన్కార్పొరేషన్ల ద్వారా మళ్లీ ప్రారంభించవచ్చు.

మధ్యతరగతి ప్రజలు గత అనుభవాల నుంచి నేర్చుకోకపోవడం, ఆర్థిక సాక్షరత లోపం వల్ల ఈ చక్రం కొనసాగుతుంది. ఇది సమాజంలో ఆర్థిక అసమానతలను పెంచుతుంది, ఎందుకంటే ప్రమోటర్లు తరచూ లాభపడుతుండగా, ఇన్వెస్టర్లు మాత్రం నష్టపోతారు. గణాంకాలు కూడా ఈ సమస్యను రుజువు చేస్తున్నాయి. ఈక్విటీ ఎఫ్ అండ్ ఓ, ట్రేడింగ్లో 93 శాతం వ్యక్తిగత ట్రేడర్లు ఆర్థిక సంవత్సరం 2022-24 ల మధ్య నష్టపోయారు. ఈ మొత్తం సుమారు రూ. 1.8 లక్షల కోట్లు. ఆర్థిక సంవత్సరం 25లో నష్టాలు 41శాతం పెరిగి రూ. 1.06-1.1 లక్షల కోట్లకు చేరాయి . ఇది మధ్య తరగతి పెట్టుబడిదారుల చురుగ్గా పాల్గొన్నట్లు మాత్రమే కాక నష్టపోయినట్లు సూచిస్తోంది. కార్పొరేట్ రంగం అవకాశాలతో నిండినది, కానీ అది మధ్యతరగతి ఆశలను రక్షించాలి. ఈ విషయంలో మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, చట్టబద్ధమైన ప్రక్రియల్లోనూ లోపాలు ఎక్కువే ఉండవచ్చు. మదుపరులలో ఆర్థిక సాక్షరత పెంచడం, రెగ్యులేటరీ మెరుగుదలలు ద్వారా మనం ఈ చక్రాన్ని భేదించవచ్చు. అంతిమంగా, మధ్యతరగతి ఆశలు వాటాలుగా మారి మళ్ళీ మళ్ళీ శూన్యమవకుండా ఉండా లంటే, జాగ్రత్త మరియు అవగాహనే ముఖ్యం. ఇది సమాజంలో ఆర్థిక న్యాయాన్ని నెలకొల్ప డానికి సహాయపడు తుంది. అట్లే చట్టబద్ధ ఆర్థిక దోపిడీని కూడా అరికట్టుతుంది.

**- అశోక్ గుంటుక**
9908144099

# గ్యాస్ వినియోగదారులు నిబంధనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ఏటూర్ నాగారం, మార్చి 20, మనం ప్రతినిధిః** గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునే వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గ్యాస్ సిలిండర్ల కొరత, బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు అంటూ కొన్ని మీడియాల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఏటూరు నాగారం మండల కేంద్రంలోని హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ గోదాము ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్యాస్ సిలిండర్ల సరఫరా పై అక్కడి యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ బుకింగ్, సరఫరా ప్రక్రియలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. గ్యాస్ బుకింగ్కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ప్రతి సిలిండర్ బుకింగ్కు మధ్య 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ గడువు పూర్తికాకముందు మళ్లీ బుకింగ్ చేయడానికి ప్రయత్నిస్తే ఓటిపి నంబర్ రాదని, కాబట్టి ప్రజలు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్దకు రావద్దని సూచించారు. గృహ అవసరాలకు గ్యాస్ బుకింగ్ సంబంధించి గతంలో వచ్చిన మెసేజ్లో ఉన్న తదుపరి బుకింగ్ తేదీ చూసుకుని ఆ తేదీకి మాత్రమే బుకింగ్ చేయాలని, గ్యాస్ బుక్ చేసిన వారికి సంబంధిత గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిర్దేశిత సమయంలోగా వినియోగదారుల ఇంటి వద్దకే వచ్చి సిలిండర్లను సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్ద గందరగోళం నివారించేందుకు ఓటిపి వచ్చిన వారికి ఒక లైన్ ఏర్పాటు చేసి సిలిండర్లను సరఫరా చేయాలన్నారు. అలాగే ఓటిపి రాని వారికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ప్రతి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ హెల్ప్ డెస్క్ వద్ద వినియోగదారులకు బుకింగ్ స్టేటస్, ఓటిపి సమాచారం, తదుపరి బుకింగ్ తేదీ, తదితర వివరాలను అందించాలన్నారు. గ్యాస్ బుకింగ్కు సంబంధించి నిర్దేశిత గ్యాస్ బుక్ లోని కన్స్యూమర్ నెంబర్ తో రిజిస్టర్ అయిన మొబైల్ నెంబర్ నుంచే వినియోగదారులకు ఓటిపి వస్తుందని, మొబైల్ నెంబర్ మార్పులు అనుమతించబడవని తెలిపారు. ఇది బ్లాక్ మార్కెటింగ్ నివారణ కోసం తీసుకున్న చర్యగా పేర్కొన్నారు. ప్రతి గ్యాస్ సిలిండర్కు ప్రత్యేక సీరియల్ నెంబర్ ఉంటుందని, సిలిండర్ దుర్వినియోగం లేదా ఇతరులకు మళ్లింపు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వినియోగదారుడు మళ్లీ గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్నప్పుడు డెలివరీ సమయంలో ఇదివరకు ఇచ్చిన సిలిండర్ ను నంబర్ సరిచూసుకుని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకునే వారిపై అవసరమైతే పోలీస్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 8 ఏజెన్సీల పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 86896, వాణిజ్య అవసరాలకు సంబంధించి 254 గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు. 943 గృహ అవసరాల గ్యాస్ బుకింగ్ లు జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాకు రోజుకు సుమారు 942 గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని, గ్యాస్ కొరత ఎక్కడా లేదని స్పష్టం చేశారు.

ప్రజలు భవిష్యత్తులో గ్యాస్ కొరత రావచ్చేమోనని అనుమానాలతో ముందుగానే బుక్ చేసుకోవడం వలన ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు సిలిండర్ల కోసం బారులు తీరాల్సి వస్తుందని పేర్కొన్నారు. వినియోగదారులు అపోహలను వీడి అనవసరంగా భయపడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోనే గ్యాస్ సిలిండర్ ల కోసం బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో సమగ్ర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వినియోగదారులకు ప్రతి రోజు గ్యాస్ సిలిండర్ల సరఫరా, బుకింగ్స్, ఫిర్యాదులపై నివేదికలు సమర్పించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డి ఎం సివిల్ సప్లయ్ క్రిష్ణ వేణి, డి టి విజయ్ కుమార్, సర్పంచ్ కాకుల మర్రి శ్రీలత, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, తదితరులున్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా పనులల్లో వేగం పెంచాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ఏటూర్ నాగారం, మార్చి 20,మనం ప్రతినిధిః** సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఏటూరు నాగారం లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రం లోని గదులను, వార్డులను, అటెండెన్స్ రిజిస్టర్ ను, లాబ్, మెడికల్ స్టోర్ గది, లేబర్ రూమ్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అదేవిధంగా వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను, వారికి అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్పీవీ వ్యాక్సిన్ వేసుకోవాలని గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇది ఒక మంచి అవకాశం అని తెలిపారు. ఇప్పటివరకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమందికి ఇవ్వడం జరిగిందని, వైద్యులు,సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని, నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, వైద్యులు,సిబ్బంది విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని, నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, సామాజిక ఆరోగ్య కేంద్రంలో రిపేర్లు గాని ఇతర పనులు ఏమైనా ఉన్నట్లయితే అంచనా వేసి ములుగు జిల్లా కార్యాలయానికి పంపించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ దశలలో నిర్మాణం లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లను పరిశీలించి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఫర్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ సురేష్, ఏటూరు నాగారం సర్పంచ్ శ్రీలత, ప్రజా ప్రతినిధులు, ఇతర ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈద్ ముబారక్ తోఫా కిట్ల పంపిణి




**మంగపేట, మార్చి 20: మనం ప్రతినిధిః** ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హిదాయతుల్లా ఆధ్వర్యంలో కమలాపురం ముస్లిం సోదరి సోదరిమనులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఈ రోజు రంజాన్ పండుగ సందర్భంగా ముఖ్యతిధులుగా రాష్ట్ర పంచాయతీ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి మంత్రి సీతక్క పంపిన ఈద్ ముబారక్ తోఫా కిట్లను ముస్లిం సోదర్లకు పంపిణి చేయడం జరిగింది. వారు మాట్లాడుతు ఆ అల్లా దీవెనలు అందరిపై ఉండాలి ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకొనుటకు రంజాన్ నెల నేపథ్యంలో ముస్లింలు గత నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేస్తూ నేటితో ముగించుకొని బంధుమిత్రులతో ఆత్మీయమిత్రులతో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకుంటారు. అదే విదంగా మంగపేట కమలాపురం జమ మసీద్ లకు చుట్టూ ప్రహరీ గోడ కావాలి అని అడుగగా వెంట్టనే గుమ్మడి సోమయ్య మంత్రి సీతక్క తో మాట్లాడి చుట్టూ ప్రహరీ గోడ కావాలని అడుగగా వెంట్టానే సీతక్క స్పందించి ప్రహరీ గోడ త్వరలోనే శాంక్షన్ చేపిస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది. మైనార్టీ సెల్ మంగపేట మండల అధ్యక్షులు టీవీ హిదాయాతుల్లా తోటి ముస్లిం సోదరులు రాష్ట్ర పంచాయతీ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్యకు మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డికి చాలువతో సన్మానిచ్చారు ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయోరి యాణయ్య, జిల్లా కార్యదర్శి తుది భగవాన్ రెడ్డి, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు మహబూబ్ ఖాన్, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ,మాజీ సింగిల్విండో డైరెక్టర్ గంగినేని శేషగిరి వెంకన్న, మంగపేట గ్రామ అధ్యక్షులు మహమ్మద్ సయ్యద్ హుసేన్ ముస్లిం పెద్దలు తదితరులు పాలుగోన్నారు

# విద్యుత్ సేవలలో విప్లవాత్మక మార్పు

- ఆన్‌లైన్ లైన్ క్లియర్ యాప్
- ఎస్ఈ సుదర్శనం

**జగిత్యాల, మార్చి 20(మనం న్యూస్)ః** విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంతోపాటు క్షేత్రస్థాయి ఉద్యోగుల భద్రతను పటిష్టపరిచేందుకు విద్యుత్ విభాగం ఒక మైలురాయి చర్య ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ అని జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం తెలిపారు . ఈ యాప్ విద్యుత్ రంగంలో పనిచేసే సిబ్బంది భద్రతకు అత్యంత కీలకంగా మారిందని అన్నారు. తప్పుడు ఫీడర్ ఎంపిక, పంపిణీ వ్యవస్థపై అస్పష్టత, సమాచార లోపం, మాన్యువల్ ప్రక్రియలో జాప్యం తదితర కారణాల వల్ల పలు సందర్భాలలో విద్యుత్ ఉద్యోగులు తీవ్రమైన ప్రమాదాలకు గురవుతున్నారని, వీటన్నింటికీ పరిష్కార మార్గం ఎల్సీ యాప్ అని వివరించారు . ఈ యాప్ ద్వారా లైన్ క్లియర్ అనుమతులు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జారీ అవుతాయన్నారు. సిబ్బంది పని చేయవలసిన ఫీడర్, పంపిణీ లైన్ వివరాలు యాప్లో స్పష్టంగా ప్రదర్శితమవుతాయి. తప్పుడు ఫీడర్ ఎంపికకు అవకాశం లేకుండా వ్యవస్థ అప్రమత్తం చేస్తుందనీ, అధికారులు , సిబ్బంది మధ్య రియల్టైమ్ సమాచార మార్పిడి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఎల్సీ జారీ, వినియోగం, రద్దు వివరాలు డిజిటల్గా నమోదు అవుతాయని , పారదర్శకత పెరుగుతుందన్నారు. విద్యుత్ భద్రతకు పెద్దపీట వేశామని , ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రతి ఒక్కరు ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ వాడాలని కోరుతున్నామని చెప్పారు . ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ ఉపయోగించడం వలన సంస్థ తరుపున నుండి సిబ్బందికి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా కాపాడకుంటున్నామని కేవలం ఎల్సీ (లైన్ క్లియర్) యాప్ ద్వారానే సాధ్యమైందని అన్నారు . ఇదంతా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తీసుకున్న చర్యల వలన జవాబుదారీతనం పెరిగిందని , అంతరాయాలు తగ్గాయని, సమర్థవంతమైన పర్యవేక్షణ కనపడుతుందని, సిబ్బంది పని ప్రదేశాలలో సులభంగా సౌకర్యవంతంగా పని చేసుకుంటున్నారని పేర్కొన్నారు.




# జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్




**ములుగు,మార్చి 20, మనం ప్రతినిధిః** జిల్లా ప్రజలకు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన ధర్మాల (జకాత్) ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ శాంతి, సౌహార్ద్రం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, మత సామరస్యంతోఈపండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# దేవాలయాల్లో పంచాంగ శ్రవణం



**భీమదేవరపల్లి, మార్చి 20(మనం న్యూస్)ః** భీమదేవరపల్లి దేవాలయాల్లో పంచాంగ శ్రవణం అర్చకులు చదివి వినిపించారు. గురువారం రోజున భీమదేవరపల్లి మండల పరిధిలోని దేవాలయాలైన తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన వీరభద్ర దేవస్థానంలో, గట్ల నర్సింగాపూర్ లోని కోదండ సీతారామ ఆలయంలో, ముల్కనూర్ లోని శివాలయాల్లో, కొప్పూరు గద్దల బండ్ల పంచముఖ ఆంజనేయ స్వామి, వంగరలోని శివాలయంలోఉగాది పండుగ సందర్భంగా తెలుగు నూతన సంవత్సరమైనా శ్రీ పరాభవ నామ సంవత్సర పురస్కరించుకొని అర్చకులు సంవత్సర భవిష్యత్ కాలంలో వివిధ రాశుల పంచాంగమును పట్టించారు. ఈ పంచాంగ శ్రవణకార్యక్రమంలో అర్చకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు మహోత్సవానికి రైతంగం




**భీమదేవరపల్లి, మార్చి 20 మనం న్యూస్ః** సిద్దిపేట జిల్లాలో జరిగే రైతు మహోత్సవానికి రైతాంగం తరలి వెళ్లారు. గురువారం రోజున ముల్కనూర్ బస్టాండ్ ప్రాంగణంలో భీమిదేవరపల్లి రైతులు ఎలుకతుర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి మండల వ్యవసాయ అధికారి పద్మ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎలుకతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఈనెల 19 నుండి 22 వరకు జరిగే రైతు మహోత్సవ కార్యక్రమానికి రైతాంగాన్ని తరలిస్తున్నామని, ఈ రైతు మహోత్సవ ప్రారంభ రోజున వ్యవసాయ పశుసంవర్ధక శాఖ అనుబంధ రంగాల 150 స్టాల్స్ ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ వాకిటి శ్రీహరి వివేక్ వెంకటస్వామి ప్రారంభిస్తారని, ఈనెల 22న ఆయిల్ ఫ్యాన్ ఫ్యాక్టరీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబడుతుందని, అదే రోజు వేదిక పైన రైతు భరోసా మొదటి విడత నిధులు ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారని తెలిపారు. ఈ రైతు మహోత్సవ కార్యక్రమానికి మండల ఏఈఓ లు అయిన కమలహాసన్, నాగరాజు, సుమలత, క్రైసోలైట్, శైలజ తో పాటుభీమదేవరపల్లి రైతాంగం దొంతర వేణిరవీందర్, మ్యా క జయపాల్, స్నేహలత నాగరాజు యాదయ్య జయమ్మ మాడుగుల లక్ష్మి సరోజన సృజన తదితర రైతులు తరలి వెళ్లారు.

# కందూరికి కృతజ్ఞతలు తెలిపిన నిర్మల వెంకన్న



**ములుగు, మార్చి 20,మనం ప్రతినిధిః** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీ లో యునైటెడ్ వె ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో సహకారంతో గ్రామంలో 15 ఎల్ఈడి సోలార్ లైట్లు వీధులలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోత్, నిర్మల వెంకన్న మాట్లాడుతూ గాంధీనగర్ గ్రామ వీధుల్లో వెలుగులు నింపేలా సోలార్ ప్యానల్ తో కూడిన లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా కరెంటుతో పని లేకుండా గ్రామాల్లోని వీధి దీపాలు వెలగడానికి ఉపయోగపడుతున్నాయని ఇంతటి మంచి కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర మంత్రి సీతక్క కు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు అదేవిధంగా ఈ కార్యక్రమం ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ బ్రాంచ్ మేనేజర్ కందూరి రాములు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో ములుగు కోఆర్డినేటర్ ల్యాగల రాజు, ఉపసర్పంచ్ వల్లపు మహేష్, కార్యదర్శి భారతి, వార్డు సభ్యులు, మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, తేజావత్, హుని , లాకావత్, ఈర్య, రామావత్ సంధ్యా బిక్షపతి, భూక్య మంజుల రవి, లిక్కి కుమారస్వామి, గ్రామ పెద్దలు, భూక్య సుఖ్య, బానోత్ బాలు, బానోత్ లాలు, భూక్య శ్రీను, లావుడియా హరి, లావుడియా బాలు,లిక్కి మల్లయ్య, పచ్చిపాల శ్రీశైలం, మారబోయిన రవీందర్, పెద్ద బోయిన నరసయ్య తదితరులున్నారు.

# ఘనంగా సిద్ధేశ్వర దేవాలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట



**మహదేవపూర్ మార్చి20 మనం న్యూస్ః** మహదేవపూర్ మండల కేంద్రంలోని టస్సర్ కాలనీ శ్రీ సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం రోజున భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది, ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించి, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ పల్లి జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ముఖ్య అతిథిగా హాజరై, దేవాలయ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతనుపెంపొందిస్తాయని అన్నారు, ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్దసంఖ్యలోపాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ తిరుపతి జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

- 22న ఏపీడబ్ల్యూజేఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ సభ




**తిరుపతి, మార్చి 20, మనం న్యూస్ః** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుపతిలోని రాస్ బిల్డింగ్లో నిర్వహించనున్న తిరుపతి జిల్లా ప్రథమ మహాసభల పోస్టర్ను యూనియన్ నాయకులు తిరుపతి ప్రెస్క్లబ్ లో శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వలిగలం గోపి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాడడానికి, జర్నలిస్టుల గలాన్ని ప్రభుత్వానికి తెలియజేయడానికి ఏర్పడ్డ సంస్థ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ అని అలాగే జర్నలిస్టుల సమస్యలపై పోరాటానికి ఈ సంఘం ముందుంటుందని అన్నారు.ఈనెల 4వ తేదీన విజయవాడలో జరిగిన చలో విజయవాడ కార్యక్రమ సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పక్క రాష్ట్రాలలో లాగా జర్నలిస్టులకు పింఛన్ పథకాలను అమలుచేయాలని, వెటర్నర్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, అలాగే ఎన్నో సంవత్సరాల జర్నలిస్టుల చిరకాల కోరిక అయినటువంటి జర్నలిస్టులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుపతిలోని రాస్ బిల్డింగ్లో జరగనున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభకు తిరుపతి జిల్లా జర్నలిస్టు మిత్రులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా నాయకులు జి. చంగల్రాయులు,( గాంది ) పానేటి చెంగల్రాయులు, శ్రీనివాసులు, తిరుపతి నియోజకవర్గం అధ్యక్షులు బాల సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి చామంచి కుమార్, పాల్గొన్నారు.

# పోచమ్మ అమ్మవారినీ దర్శించున్నగుగులోత్ వినోద రవీందర్




**వరంగల్, మార్చి 20 (మనం న్యూస్)ః** వరంగల్ జిల్లా సంగెం మండలం లోని లోహిత గ్రామంలొ పోచమ్మ అమ్మవారి బోనాల జాతర కనుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఉగాది పండుగ ను పురస్కరించుకొని అమ్మవారి ఆలయం గుడి లో సర్పంచ్ ఉప సర్పంచ్ దంపతులు వినోద రవీందర్ నాయక్, అమ్మవారి ఆశీస్సులు పొంది. గ్రామ ప్రజలందరూ క్షేమంగా ఉండాలని వీరితో పాటు మేము కూడా క్షేమంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్న సర్పంచ్ ఉప సర్పంచ్ దంపతులు. ప్రజలందరూ పోచమ్మ ఆలయం చుట్టూ రాత్రిపూట ఎడ్ల బండ్లు ట్రాక్టర్ ఆటోలు కార్లు టు వీలర్ వెకిల్ వాహనాల్లో భక్తులు అమ్మవారి గుడి చుట్టూ ప్రదర్శన చేసి అమ్మవారి ని దర్శించుకుని ప్రత్యేక పూలలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. అదేవిదంగా లోహిత.పెద్ద తండ గ్రామ ప్రజల అందరి మీద అమ్మవారి అశీసులు ఎల్లపుడు ఉడాలని మనసారా కోరుకుంటూ సర్పంచ్ దంపతులు పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల రద్దుపై విద్యాకమిషన్ స్పష్టత

**హైదరాబాద్, మార్చి 20 :** పదోతరగతి బోర్డు పరీక్షల రద్దు వార్తలు ప్రచారమవుతున్న నేపథ్యంలో తెలంగాణ విద్యా కమిషన్ ఓఎస్డీ డాక్టర్ జీనత్ స్పష్టత ఇచ్చారు. ఇంతవరకు పదోతరగతి పరీక్షలు రద్దు చేయమని ఎక్కడా సిఫార్సు చేయలేదని క్లారిటీ ఇచ్చారు. కేవలం 11వ తరగతి (ఇంటర్ ఫస్ట్ ఇయర్) పబ్లిక్ పరీక్షల రద్దుకు మాత్రమే ప్రతిపాదన వచ్చిందని తెలిపారు. టెన్త్ పరీక్షలు రద్దు చేస్తున్నట్లు ఎక్కడా సిఫార్సు చేయలేదన్నారు. కేవలం 11వ తరగతి (ఇంటర్ ఫస్ట్ ఇయర్) పబ్లిక్ పరీక్షల రద్దుకే ప్రతిపాదన చేసినట్లు వివరించారు. టెన్త్ బోర్డు, ఇంటర్ బోర్డు విలీనానికి కమిషన్ సిఫార్సు చేసిందని ప్రస్తావించారు.

తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని.. అధికారిక సమాచారాన్నే నమ్మాలని విద్యా కమిషన్ ఓఎస్డీ డాక్టర్ జీనత్ సూచించారు.

# టీటీడీకి 10 లక్షలు విరాళం



**తిరుమల, మార్చి 20, మనం న్యూస్ః** తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు కుమారుడు అరణి మదన్ మోహన్ తమ జేఎంసీ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున టీటీడీ శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రకు విరాళం డీడీని అందజేశారు.

## జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు దిశగా కీలక అడుగు సిబ్బందికి శిక్షణ

**సంగారెడ్డి,మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధిః** సంగారెడ్డి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు శ్రీకారం చుట్టగా, సంబంధిత సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రోగుల పూర్తి వైద్య వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు సంబంధించి డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెడికల్ ఆఫీసర్లు, స్పెషలిస్ట్ డాక్టర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, సంగారెడ్డి డివిజన్లో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ను ప్రారంభిస్తున్నామని, జీజీహెచ్, జోగిపేట్, పటాన్చెరు ఏరియా ఆసుపత్రులు, సదాశివపేట సీహెచ్సీతో పాటు సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 పీహెచ్సీలలో



సోమవారం నుంచి ఈ ప్రాజెక్ట్ అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు.సంబంధిత సిబ్బంది తమ సిస్టమ్స్, మొబైల్ ఫోన్లలో అవసరమైన సాఫ్ట్వేర్ లేటెస్ట్ వెర్షన్లో ఉందో లేదో ముందుగానే పరిశీలించాలని, అందరికీ లాగిన్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలన్నారు. జిల్లాలో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టును విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్హెచ్ఓ వసంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్, స్పెషలిస్ట్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బడ్జెట్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు పూర్తిగా నిరాశపరిచాయి

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశలు ఆశయాలు ఆకాంక్షలను ఈ బడ్జెట్ పూర్తిగా విరాశపరిచిందని విమర్శించారు ముఖ్యంగా రైతులు, యువత, నిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి స్పష్టమైన లాభాలు కలిగించే విధంగా బడ్జెట్లో ప్రణాళికలు లేవని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు కేవలం కాగితాలకే పరిమితమైపోయాయని గతంలో ఇచ్చిన హామీలను కూడా పూర్తిగా అమలు చేయ లేదని మనిపడ్డారు రైతు రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ ధరల నియంత్రణ వంటి కీలక అంశాలపై బడ్జెట్లో స్పష్టత లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని అన్నారు ఇక విద్యా వైద్యం మౌలిక వసతులు అభివృద్ధి వంటి రంగాలకు మా తగినంత నిధులు కేటాయించలేదని అన్న బడ్జెట్లో ప్రకటించిన గణాంకాలు వాస్తవ పరిస్థితులకు సరిపోలడం లేదని ఈ ప్రజలను మభ్య పెట్టే ప్రభుత్వమని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకి ప్రాధాన్యతను ఇచ్చారని ఆరోపించారు మొత్తంగా బడ్జెట్ ప్రజల అభివృద్ధికి దోహదం చేయడానికి ఇది నిరాశ బడ్జెట్ గా మిగిలిపోతుందని విమర్శించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**మహాదేవపూర్ మార్చి 20 (మనం న్యూస్ )ః** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో ఎస్సీ కాలనీలో పుల్యాలమల్లయ్య తండ్రి అయిన పుల్యాల ఎల్లయ్య అనారోగ్యంతో చనిపోవడం జరిగింది, తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రివర్యులు ఆదేశాల మేరకు శనివారం రోజున కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చల్లా రమేష్ రెడ్డి కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను కలిసి ధైర్యంగా ఉండాలని అలాగే ఆధార్యపడవద్దని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లెల్లనాగరాజు, తుడిచెర్ల శేఖర్, మరియు ఎనగందుల సమ్మక్క, తో పాటు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పంచాంగ శ్రవణం




**కరీంనగర్, మార్చ్ 20(మనం న్యూస్ )ః** పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక అశోక్ నగర్ లోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఈవెంట్లో భాగంగా, పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని వాసవి క్లబ్ ఎమ్మార్ కరీంనగర్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించగా పారువేళ్ల ఫణి శర్మ పంచాంగ వివరణ చేసారు. ఈ సందర్బంగా ఉగాది పచ్చడి పంపిణీ చేసారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఎమ్మార్ అధ్యక్షుడు చిట్టి మల్ల సత్యనారాయణ, సెక్రటరీ పాత రాహుల్,కోశాధికారి పైడ రవి ,గౌరవ క్లబ్ సభ్యులు కోడిత్యాల శివానందం, నగునూరి సుధాకర్ , మాడిశెట్టి గోపాల్ , బోనగిరి రామచంద్రం , కొండూరి ప్రసాద్ ,వొజ్జల వెంకటేశం , కేశెట్టి నాగరాజు , క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి

**ఉమ్మడి మహబూబ్ నగర్, మార్చి 20 మనం బ్యూరోః** పవిత్ర రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫితర్) సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ పర్యాటక, సాంస్కృతిక, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు అత్యంత నిష్టతో, క్రమశిక్షణతో ఉపవాస దీక్షలు ముగించుకుని జరుపుకునే ఈ పండుగ సమాజంలో శాంతి, సౌభాతృత్వానికి ప్రతీక అని ఆయన కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రం భిన్నత్వంలో ఏకత్వానికి, గంగా-జమునా తెహజీబ్ సంస్కృతికి నిలయమన్నారు. ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం మన రాష్ట్ర విశిష్టత అని ఆయన గుర్తుచేశారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని



మంత్రి ఆకాంక్షించారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. పరమత సహనం, స్నేహభావం మరింత పటిష్టం కావాలని కోరుకుంటూ అందరికీ 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

**ములుగు,మార్చి 20మనం ప్రతినిధి :** రంజాన్ మాసం ఎంతో ప్రత్యేకమైనదని, ఇది ఉపవాసం, ప్రార్థనలు, ఆత్మశుద్ధి సేవా భావం వంటి గొప్ప విలువలను ప్రతిబింబిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క అన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రంజాన్ మాసంలో పాటించే రోజువారీ ఉపవాసాలు మనలో నియంత్రణ, సహనం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని మంత్రి అన్నారు. అలాగే ఈ కాలంలో దానం (జకాత్), పేదలకు సహాయం చేయడం, సమాజంలో వెనుకబడిన వర్గాల పట్ల కరుణ చూపడం వంటి ఆచారాలు సమాజంలో సమానత్వం మరియు మానవత్వాన్ని బలపరుస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు.

ఈ పర్వదినం మనందరికీ పరస్పర గౌరవం, సహకారం, సోదరభావం ఎంత ముఖ్యమో గుర్తు చేస్తుందని మంత్రి సీతక్క తెలిపారు. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు ఉన్నా, మనమంతా ఒకే కుటుంబంగా కలిసి జీవించడం మన దేశ మహత్తర సంప్రదాయమని ఆమె అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, శాంతి, సామరస్యాల కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా యువత సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ మంచి మార్గంలో నడవాలని, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మంత్రి సూచించారు. రంజాన్ పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని, రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం కలగాలని మంత్రి సీతక్క గారు ఆకాంక్షించారు. ఈ పవిత్ర సందర్భంగా అందరూ ఐక్యంగా, ఆనందంగా పండుగను జరుపుకోవాలని ఆమె కోరారు.

## సిద్దిపేటకు జిల్లాకుతరలిన రైతులు



**దుగ్గొండి మార్చి 20 (మనం న్యూస్)ః**ప్రజా పాలన 99 రోజుల ఉత్సవాలలో భాగంగా, శుక్రవారం రోజున, ఉదయం ఏడు గంటలకు, దుగ్గొండి మండల కేంద్రం నుండి 51 మంది వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన రైతులు, ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి బస్సులో, 'రైతు మహోత్సవం' గ్రామం: నర్మెట్ట, మండలం: నంగునూరు, జిల్లా: సిద్దిపేట కు బయలుదేరి వెళ్లారు. అక్కడ రాష్ట్రస్థాయిలో 'రైతులు శాస్త్రవేత్తలతో ముఖాముఖి' కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయ ఇతర అనుబంధ శాఖలకు సంబంధించిన శాస్త్రవేత్తలు ఆయా శాఖలకు సంబంధించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వివరిస్తారు. అలాగే అక్కడ వ్యవసాయ ఇతర అనుబంధ శాఖలకు సంబంధించిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన,150 స్టాళ్లు ఏర్పాటు చేసి ఉన్నవి.

వాటిని తిలకించి రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకుంటారు. అని వ్యవసాయ అధికారి దుగ్గొండి గాజుల శ్యామ్ తెలిపారు

## మల్లూరు ఆలయం హుండీ లెక్కింపు




- రూ. 12,59,594 ఆదాయం

**ములుగు,మార్చి 20మనం ప్రతినిధి :** మంగపేట మండలంలోని మల్లూరు గ్రామంలో గల శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి హుండీలను శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో ఆలయ కళ్యాణ మండపంలో హుండీలు విప్పి లెక్కించారు. ఇట్టి కార్యక్రమనికి దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి హుండీల పర్యవేక్షణ అధికారిగా మందరగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు ఇట్టి హుండీల సంఖ్య 9 ఇట్టి హుండీలు మూడు నెలల 15 రోజులకు గాను భక్తులు కానుకల రూపంలో వేసిన రూపాయలు 12,59,594 హుండీ ఆదాయం వచ్చినది ఇట్టి కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మహేష్ పర్యవేక్షణధికారి శ్రీనివాస్ తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ సిబ్బంది, మంగపేట పోలీస్, రెవెన్యూ మల్లూరు గ్రామపంచాయతీ, వివిధ సేవా సమితి సభ్యులు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు

## వంగరలో మెగా హెల్త్ క్యాంప్



**భీమదేవరపల్లి, మార్చి 20 మనం న్యూస్ః** పీవీ స్వగ్రామ వంగరలో మెగా హెల్త్ క్యాంప్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అప్పయ్య ప్రారంభించారు. శుక్రవారం వంగర ప్రాథమిక ఉన్నత ఆరోగ్య కేంద్రంలో వంగర వైద్యాధికారులు డాక్టర్ రెహమాన్ డాక్టరరుబీనా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా డిఎం అండ్ హెచ్ ఓ ఆరోగ్యమెగా క్యాంపును ప్రారంభించి అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక వైద్య నిపుణులైన జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్యులు, ఎముకల నిపుణుడు, స్త్రీ ఆరోగ్య నిపుణురాలు ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఈ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో 147 మంది ప్రజలు ఆరోగ్య సేవలు వినియోగించుకోగా 28 మెరుగైన చికిత్స కోసం హయ్యర్ సెంటర్లను రిఫర్ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉల్లాల రమేష్ వార్డు సభ్యులు శ్రీ రామోజీ మొండయ్య, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హాస్పటల్లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**దుగ్గొండి మార్చి 20 (మనం న్యూస్):** దుగ్గొండి, న్యూస్టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తాళ్ల సతీష్ ముదిరాజ్ (42) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 8 గంటల సమయంలో వెళ్లి ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అదే గ్రామానికి చెందిన జనార్ధన్ ఇనుప కడ్డీలను ట్రాక్టర్ నిర్లక్ష్యంగా తరలిస్తుండగా అది గమనించని సతీష్కు ఇనుప కడ్డీలు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామస్థులు సతీష్ను ఆసుపత్రికి తరలించగా గత నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో



మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలతో పాటుగా భార్య ఉన్నారు.

## అంకెల గారడీ అబద్ధాల చిట్టా

- ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ తీవ్ర విమర్శలు
- హైదరాబాద్కు మొండిచేయి డా. దాసోజు శ్రవణ్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ సమాజాన్ని మరోసారి నయవంచనకు గురిచేస్తూ, నిరాశకు గురిచేస్తూ, మోసం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా బోగస్ బడ్జెట్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ లేదా శాసన మండలిలో అబద్ధం అనే పదాన్ని వాడొద్దని పార్లమెంటరీ సంప్రదాయాలు చెబుతున్నప్పటికీ, ఈ బడ్జెట్లో సత్యం లేకపోవడంతో దీనిని సత్యదూరం అయిన బడ్జెట్గా పేర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బడ్జెట్ వంటి అధికారిక పత్రాన్ని శాసనసభలో ప్రవేశపెట్టేటప్పుడు సహేతుకత, పారదర్శకత, నిజాయితీ ఉండాలని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో ఆ మూడు అంశాలు పూర్తిగా కనిపించకపోవడం బాధాకరమన్నారు. మొత్తం 69 పేజీల బడ్జెట్ డాక్యుమెంట్లో దాదాపు 39 పేజీలు ప్రభుత్వ స్వప్రశంసలతో నింపబడ్డాయని, అవి కూడా వాస్తవాలకు దూరంగా ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. డా. దాసోజు శ్రవణ్ మీడియా ప్రతినిధుల దృష్టికి ఒక గంభీరమైన గ్లేరింగ్ మిస్టేక్ తీసుకొచ్చారు. ప్రభుత్వం విడుదల చేసిన ఖ్రీజ్ఞూఖ్జ్హు ఆఖీజ్ఞ జీ ఆటజ్చీజ 2026-27 పుస్తకంలో రెవెన్యూ రిసిప్ట్స్కు సంబంధించిన అంకెలు తీవ్రమైన అనుమానాలకు తావిస్తున్నాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం బడ్జెట్ అంచనాల్లో రూ.2,29,720 కోట్ల రెవెన్యూ రిసిపట్స్ సాధిస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం రివైజ్డ్ ఎస్టిమేట్లో రూ.2,03,970 కోట్ల రెవెన్యూ రిసిపట్స్ సాధించామని పేర్కొనడం అనుమానాస్పదమన్నారు. అదే సమయంలో కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెబ్సైట్లో జనవరి 2026 వరకు రాష్ట్ర ఆర్థిక పనితీరుపై విడుదల చేసిన ఆడిట్ నివేదిక ప్రకారం, జనవరి 2026 నాటికి రాష్ట్ర రెవెన్యూ రిసిపట్స్ కేవలం రూ.1,38,371 కోట్లే ఉన్నాయని వెల్లడైందన్నారు. అయితే జనవరి తర్వాత కేవలం 50 రోజుల్లోనే రూ.65 వేల కోట్లకు పైగా అదనపు రెవెన్యూ వచ్చిందని చెప్పడం ఎలా సాధ్యమైంది? అని ఆయన ప్రశ్నించారు. ఇది నిజంగా ఆర్థిక అద్భుతమా? లేక అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇది ప్రజలను మోసం చేసే ప్రయత్నం. ఇది బోగస్ డాక్యుమెంట్. ప్రభుత్వం వెంటనే దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. ఇక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు 2,500 ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు 4,000 నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై నోటిఫికేషన్ల గురించి కూడా ప్రభుత్వం మౌనం వహించడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో రాష్ట్రానికి ప్రధాన ఆదాయ కేంద్రంగా ఉన్న హైదరాబాద్ నగరం, పట్టణ ప్రాంతాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టుగా కనిపిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం బడ్జెట్లో రూ.43,592 కోట్ల విలువైన పనులకు సాంక్షన్ ఇచ్చామని, అందులో రూ.24,752 కోట్ల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని పేర్కొనడం అంకెల గారడీ అని విమర్శించారు. బడ్జెట్ అనేది 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు చేపట్టే పనులకు సంబంధించిన కేటాయింపులపై మాట్లాడాల్సిన పత్రం అని ఆయన గుర్తుచేశారు. కానీ ఈ ప్రభుత్వం



గత బడ్జెట్లలో చేసిన కేటాయింపులను చూపిస్తూ ప్రస్తుత బడ్జెట్ను సమర్థించుకోవడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమన్నారు. ప్రస్తుత బడ్జెట్లో నగర అభివృద్ధి కోసం కేవలం రూ.17,907 కోట్లే కేటాయించినట్లు ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. ఇటీవల హైదరాబాద్ పరిపాలనా పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో హైదరాబాద్ కార్పొరేషన్, సైబరాబాద్ కార్పొరేషన్, మల్కాజిగిరి కార్పొరేషన్ వంటి కొత్త వ్యవస్థలు ఏర్పడ్డాయని, అనేక గ్రామపంచాయతీలు మరియు మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనం కావడంతో ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు సివిక్ సదుపాయాలపై భారీగా పెట్టుబడులు అవసరమని ఆయన పేర్కొన్నారు. కానీ, ఈ అవసరాలను పూర్తిగా పక్కన పెట్టి కేవలం 17 వేల కోట్ల కేటాయింపులు చూపించడం ద్వారా హైదరాబాద్ నగర ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరిగినట్టే అని ఆయన విమర్శించారు. ఒకవైపు హైదరాబాద్ను రీస్ట్రక్చర్ చేశామని, అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకుపోతామని చెబుతూ మరోవైపు తగిన కేటాయింపులు చేయకపోవడం ప్రభుత్వం మసిపూసి మారేడుకాయ చేసే విధానాన్ని బయటపెడుతోంది అని ఆయన అన్నారు. బడ్జెట్లో ఉన్న ఈ అంకెల గారడీ, వాస్తవాలకు విరుద్ధమైన వివరాలపై శాసనసభ, మండలిలో బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా పోరాడుతుందని, అవసరమైతే ప్రభుత్వాన్ని నిలదీసి నిజాలను బయటపెడతామని ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు.

## రోజా నోరు అదుపులో పెట్టుకో

- తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి,మార్చి 20, మనం న్యూస్ః** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను విమర్శించే స్థాయి మాజీ మంత్రి రోజాకు లేదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సనాతన ధర్మం పై రోజా మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. అలాగే శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకోవడమే కాకుండా, తరిగొండ వెంగమాంబ అన్నదానంకు ఒక రోజుకు అయ్యే ఖర్చు ను చెల్లించి భక్తులకు భోజనం వడ్డించిన గొప్ప మహిళ అని ఆయన కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్ళలో ఏనాడైనా శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇచ్చాడా అని ఆయన ప్రశ్నించారు. అలాగే తన సతీమణితో కలిసి తిరుమలకు గాని మరో దేవాలయానికి గానీ వెళ్ళిన సందర్భాలు ఏవైనా ఉంటే రోజా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సెటింగ్స్ వేసుకుని ఫేక్ భక్తిని నటిస్తున్న గొప్ప దంపతులు జగన్మోహన్ రెడ్డి, భారతీ రెడ్డీలని ఆయన విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఉగాది వేడుకలు తమ సతీమణులతో చేశారా అంటున్న రోజా తన భర్తతో కలిసి ఉగాది వేడుకలు ఎక్కడ జరిపిందో చెబితే బాగుంటుందని ఆయన డిమాండ్ చేశారు. ఒకరిని వేలెత్తి చూపించే ముందు మిగిలిన నాలుగు వేళ్ళు నీ వైపు చూపుతాయని



సంగతి రోజా గుర్తుపెట్టుకుంటే మంచిదని ఆయన హితవు పలికారు.

# ఉత్సాహంగా... ఉల్లాసంగా...







## అంగరంగ వైభవంగా శ్రేయస్ వన్ సిటీ బ్రోచర్ ఆవిష్కరణ

## ఉర్రూతలూగించిన సునీత సినీ గేయాలు

## సందడి చేసిన సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి

ఖమ్మం, మార్చి 20(మనం న్యూస్): ఖమ్మం నగరానికి సమీపంలోని వందనం గ్రామం రోడ్డులో గురువారం సాయంత్రం అద్భుతమైన వాతావరణంలో శ్రేయస్ ఫ్యూచర్ సిటీ డెవలపర్స్ ఆధ్వర్యంలో శ్రేయస్ వన్ సిటీ బ్రోచర్ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగర అభివృద్ధికి నూతన దిశను సూచించే ఈ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం ఉత్సాహభరితంగా, సందడిగా సాగింది. ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా సినీ ప్రముఖులు హాజరై కార్యక్రమానికి మరింత మెరుగులు చేకూర్చారు. యువత హృదయాలను గెలుచుకున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులను అలరించారు. వారి సందడి, అభిమానులతో సెల్ఫీలు, నవ్వులు కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. అదే విధంగా, సినీ గాయని సునీత తన మధుర గాత్రంతో, సినీ గేయాలతో సభను ఉర్రూతలూగించారు. ఆమె పాటలకు ప్రేక్షకులు కేరింతలు కొడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శ్రేయస్ వన్ సిటీ ప్రాజెక్ట్ ఆధునిక సదుపాయాలతో, నూతన జీవన విధానానికి తగిన విధంగా రూపుదిద్దుకుంటుందని నిర్వాహకులు శ్రేయాస్ శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్ నగర రూపకల్పనలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఖమ్మం నగరంలో ఒక ప్రత్యేకమైన సంబరంగా నిలిచింది. ఉత్సాహం, వినోదం, అభివృద్ధి అన్నీ కలిసిన ఈ వేడుక హాజరైన వారందరికీ చిరస్మరణీయ అనుభూతిని అందించింది.

# భద్రాద్రిలో విషాదం..

## గోదావరిలో ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతు



భద్రాచలం, మార్చి 20(మనం న్యూస్): భద్రాచలం వద్ద గోదావరి నదిలో మునిగి ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఉగాది సెలవుల సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చిన విద్యార్థులు నదిలో స్నానాలకు దిగగా ప్రమాదం చోటుచేసుకుంది.


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతి లోని ఎస్ఆర్ఎంటీ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, భద్రాచలం ప్రాంతానికి చెందిన తమ మిత్రులు అభిరామ్, శ్రీకర్లతో కలిసి ఎటపాక మండలంలోని పురుషోత్తమపట్నం గ్రామ శివారులో ఉన్న, కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలోని గోదావరి నది లోకి దిగారు. ఫోటోలు తీసుకుంటూ ఉండగా, ఏడుగురు యువకులు అకస్మాత్తుగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు ఈత రావడంతో ఒడ్డుకు చేరుకున్నారు. మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్గా గుర్తించారు. ఇందులో అభిరామ్, శ్రీకర్ భద్రాచలం ప్రాంతానికి చెందినవారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. ప్రత్యేక రిస్క్యూ బృందం కూడా మృతదేహాల కోసం గాలిస్తోంది. రాత్రి ఏడు గంటల సమయానికి ఇద్దరి మృతదేహాలు లభించాయి.

# ముస్లీం సోదరుల పెద్ద పండుగ రంజాన్



ఖమ్మం, మార్చి 20(మనం న్యూస్): ముస్లీం సోదరుల పెద్ద పండుగ రంజాన్ అని, ఈ పండుగను ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, సుడా మాజీ చైర్మెన్ బచ్చు విజయ్, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు అన్నారు. నగరంలోని త్రీ టౌన్ ప్రాంతంలో గల 32 వ డివిజన్ లో పార్టీ డివిజన్ అధ్యక్షులు నన్నే పఠాన్ అద్యక్షతన జరిగిన రంజాన్ తోఫా కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన అతిధిగా పాల్గొని కోట్లను 50 మందికి పంపిణీ చేశారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ రంజాన్ పండుగ ఎంతో విశిష్ట మైనదని అన్నారు.ప్రతీ ఒక్కరూ మానవాళి సుఖశాంతులు కోసం ప్రార్ధనలు చేయాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నామవరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన నామ



ఖమ్మం, మార్చి 20(మనం న్యూస్): బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రంజాన్ నెలకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించారు. రంజాన్ మాసం త్యాగం, నియమం, సేవా భావానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఉపవాస దీక్షలు పాటిస్తూ ఈ పవిత్ర మాసం మనిషిలో సహనం, కరుణ, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ సంక్షేమం కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి, ముస్లిం సోదరుల అభివృద్ధి కోసం కట్టుబడి పని చేశారని ఈ సందర్భంగా నామ తెలియజేశారు. ముఖ్యంగా ముస్లిం సమాజం ఆర్థికంగా, విద్యా పరంగా వృద్ధి సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లిం కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించినట్లు, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించినట్లు వివరించారు. అలాగే మైనార్టీ విద్యార్థులకు స్కాలర్షిప్లు, విదేశీ విద్యా సహాయం, వృత్తి ఆధారిత శిక్షణ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. డ్రైవర్ ఎంపవర్మెంట్ (ఓనర్ కమ్ డ్రైవర్) పథకం కింద సబ్సిడీతో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా యువతకు కార్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా తాను ఎంపీ గా గెలిచిన రెండు సార్లు కూడా 15వ, 17వ లోక్ సభల్లో మైనార్టీల సమస్యలు పైన మాట్లాడటం తో ముస్లిం రిజర్వేషన్స్ విషయమై నాటి కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన తీర్మానం ఆమోదించాలని పార్లమెంట్ సాక్షిగా పోరాటం చేసానని నామ గుర్తు చేసారు. నాటి బీఆర్ఎస్ పాలన లో మసీదుల అభివృద్ధి, దర్గాల సంరక్షణ, హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలు తీసుకున్నారని నామ పేర్కొన్నారు. ముస్లిం సోదర సోదరీమణుల అభ్యున్నతికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నామ తెల్పడంతో పాటు రంజాన్ పర్వదినం ప్రతి ఇంట ఆనందం, ఆరోగ్యం, శాంతి, సంపద, శుభ ఫలితాలు నింపాలని నామ ఆకాంక్షించారు.

# అరకొరగా మైనారిటీ బడ్జెట్

- మైనారిటీ డిక్లరేషన్ వాగ్దానాలకే పరిమితం
- కొత్త పథకాల ఊసేలేదు...
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యండీ యాకూబ్ పాషా ధ్వజం



ఖమ్మం, మార్చి 20(మనం న్యూస్): రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో మైనారిటీలకు అరకొరగా నిధులను కేటాయించడం దురదృష్టకరమని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యండీ. యాకూబ్ పాషా శుక్రవారం నాడు ఒక ప్రకటనలో మండిపడ్డారు. గత యేడాది బడ్జెట్లో మైనారిటీలకు 3,591 కోట్లు కేటాయించగా, ఈ యేడాది కేవలం 3,769 కోట్లను కేటాయించడం బాధాకరమని అన్నారు. గత యేడాది బడ్జెట్లో మైనారిటీలకు 'రాజీవ్ యువ వికాసం పథకం కింద 840 కోట్లు కేటాయిస్తూ, ప్రకటించి ఆన్లైన్లో నిరుద్యోగుల నుండి దరఖాస్తులను కూడా స్వీకరించి ఒక్క నిరుద్యోగ మైనారిటీకి కూడా ఋణం అందజేయలేదన్నారు. ఎన్నికలకు ముందు మైనారిటీ డిక్లరేషన్ లో భాగంగా అధికారంలోకి రాగానే మైనారిటీలకు ఉప ప్రణాళికతో పాటు మైనారిటీల సంక్షేమ బడ్జెట్ 4 వేల కోట్లు పెంచుతామని, నిరుద్యోగ మైనారిటీ యువత మరియు మహిళలకు రాయితీ రుణాలను సులభతరం చేయడానికి ప్రతి యేటా వెయ్యి కోట్లు ఇస్తామని, ఇమామ్, మౌజన్ లకు 10 వేల నుండి 12 వేలకు పెంచుతామని ప్రకటించారని, రాష్ట్ర వ్యాప్తంగా 44 లక్షల మంది ముస్లిం జనాభా ఉంటే అందులో కేవలం 4.5 లక్షల నిరుపేదలకు తూ..తూ..మంత్రంగా'రంజాన్ గిఫ్ట్ ప్యాక్లు 'అందించి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మైనారిటీలకు విధ్యా, ఉపాధి, సంక్షేమ రంగాల్లో తగు ప్రాతినిధ్యం కల్పించి మైనారిటీ బడ్జెట్ ను పెంచాలని కోరారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

- కాంగ్రెస్‌ది జనరంజక బడ్జెట్
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం, మార్చి 20(మనం న్యూస్): రంజాన్ పండగ నేపథ్యంలో ముస్లిం సోదరులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ అంటే ఉపవాసాలు, దైవారాధన, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించడం అని అన్నారు. మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ సామరస్యానికి,సుహృద్భావానికి, సర్వమానవ సమన్వత్వానికి కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని అన్నారు.'అల్లాహ్ ఆశీర్వాదాలు మీపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

**జనరంజక బడ్జెట్**

ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజక బడ్జెట్ అని, అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చే బడ్జెట్ అని నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ పునర్జీవానికి పునాది వేసిందని, రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవడం పై దృష్టి సారించారని, డాంబికాలకు పోకుండా వాస్తవిక దృక్పథంతో బడ్జెట్ ను రూపొందించారని, విద్య, వైద్యం, వ్యవసాయ, ఇందిరమ్మ ఇండ్లు, ఆరు గ్యారంటీల అమలుకు పెద్దపీట వేశారని, ఎస్సీ, ఎస్టీ, బిసి ల సంక్షేమానికి కేటాయించారని అదే విధంగా పేద ప్రజలకు అండగా ఉండే విధంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రూపు దిద్దారని ఉద్ఘాటించారు.

# తల్లి పేరనున్న భూమిని సమానంగా పంచాలి

## అన్నదమ్ముల సమస్యలోకి పొంగులేటిని, దయాకర్‌రెడ్డిని లాగొద్దు

## తండ్రి పేరనున్న భూమిని కాజేసేందుకు యత్నం

## మీడియా సమావేశంలో కొప్పుల రమేష్ అన్నదమ్ములు




ఖమ్మం, మార్చి 20(మనం న్యూస్): తల్లి పేరనున్న భూమిని ఆమె ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వారసులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కొప్పుల రమేష్, కొప్పుల నాగేశ్వరరావు, కొప్పుల జనార్దన్, కొప్పుల జైపాల్, కొప్పుల నాగేశ్వరరావు తండ్రి జైపాల్ కోరారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన వారు మీడియాతో మాట్లాడుతూ తీర్థాల రెవెన్యూలోని 760 సర్వే నెంబర్‌లో కొప్పుల పేరమ్మ పేరు మీద ఉన్న 4.13 కుంటలు మెట్ట భూమిని కొప్పుల రామారావు తన భార్య సుధారాణి పేరు మీద, ఎకరం ఒక కుంట మాగాణిని అతని కొడుకు ప్రపుల్లకుమార్ పేరు మీద దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. ఇది తెలుసుకున్న రామారావు తల్లి వీరమ్మ దానిని రద్దు చేయించి, తన ఐదుగురు కొడుకులకు సమానంగా పంచాలని వీలునామా రాసిందని, అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు. కొప్పుల పుల్లయ్య పేరు మీద ఉన్న 5 ఎకరాల 32 కుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రామారావు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇది అన్నదమ్ముల, పాలెభాగాల సమస్య అని అన్నారు. ఇందులోకి అనవసరంగా మంత్రి పొంగులేటిని, ఆయన క్యాంప్ ఆఫీస్ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డిని లాగుతున్నారని, ఇది సరి కాదని పేర్కొన్నారు. తమ సమస్యకు, పొంగులేటికి, దయాకర్‌రెడ్డికి సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి అంటే గిట్టని వారు కొప్పుల రామారావు, జగదీష్‌తోటి రాజకీయంగా పూయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యను తామే పరిష్కరించకుంటామన్నారు. దీనికి రాజకీయం పూయవద్దని సూచించారు.

# ఫోరోన్సిక్ నియామక ఫలితాలు విడుదల



హైదరాబాద్,మార్చి 20(మనం,ప్రత్యేక ప్రతినిధి): రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఖాళీగా ఉన్న వివిధ విభాగాలలో 60 పోస్టులకుగాను 59 పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబర్ 14న 60 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. 59 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామని, అభ్యర్థుల అకడమిక్ మార్కులు, రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో అటెస్టేషన్ ఫారాలను పూర్తి చేసి, మార్చి 30న హైదరాబాద్‌లోని పెట్లబుర్జ్ సిటీ ఆరమ్డ్ రిజర్వ్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

# భరతనాట్యంలో దూసుకుపోతున్న చిన్నారి 'శ్రీదాత్రి'

## పలు వేడుకల్లో ప్రదర్శనలు.. ప్రముఖులచే ప్రశంసలు

## ఉగాది సంబరాల్లో మేయర్ చేతుల మీదుగా సత్కారం



సాంస్కృతిక రంగంలో నేటి మేటిగా చిన్నారి శ్రీదాత్రి రాణిస్తోంది. ప్రధానంగా భరతనాట్యం ఇతివృత్తంగా ఎంచుకొని, ప్రాచీన కళలకు జీవం పోస్తోంది. ప్రదర్శించే బుడిబుడి నృత్యం ప్రేక్షకులను అబ్బురపరుస్తోంది. ఫస్ట్ క్లాస్ నుండి ఇప్పటివరకు పలు వేదికల్లో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆదరణ పొందుతున్నాయి. ఇప్పటివరకు పలు వేదికల ద్వారా సుమారు 100 ప్రదర్శనలిచ్చిన శ్రీదాత్రి కళాస్ఫూర్తికి ప్రజలు నీరాజనాలు పలకడం విశేషం.

పాల్వంచ, మార్చి 20(మనం న్యూస్): 'పిట్ట' కొంచెమైనా 'కూత' ఘనం సామెతను నిజం చేస్తూ.. భరతనాట్యంలో దూసుకుపోతోంది చిన్నారి 'శ్రీదాత్రి'. పట్టణ పరిధి ఒడ్డుగూడెంకు చెందిన బి టి పి ఎస్ కర్మగారంలో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్న కంచర్ల శేఖర్ బాబు-దివ్య దంపతుల కుమార్తె శ్రీదాత్రి, రెజీనా కార్మెల్ కాన్వెంట్ లో 2వ తరగతి విద్యనభ్యసిస్తోంది.

**చిన్నతనం నుండే భరతనాట్యంలో దిట్ట**

చిన్నతనం నుండే విద్యతోపాటు

**ఉగాది సంబరాల్లో.. మేయర్ ప్రశంసలు**

ఉగాది ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అతిథులుగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడు గణేష్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. భరతనాట్యం, సాంస్కృతిక కళా ప్రదర్శనలతో చిన్నారి 'శ్రీ ధాత్రి' హావభావాలతో మెప్పించింది. మేయర్ గణేష్ చిన్నారులను అభినందించారు. అనంతరం మెరిట్ సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ప్రత్యేకంగా శ్రీధాత్రి ప్రదర్శనకు మంత్రముగ్ధులయ్యారు.

# ముస్లింలకు కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు

## శ్రీరామ నవమి వేడుకలకు ఆహ్వానం

## చింతమడకలో ఈ నెల 25, 27న శ్రీపట్టాభి సీతారామచంద్ర స్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ట

## కేసీఆర్‌ను కలిసి సాదరంగా ఆహ్వానించిన కమిటి సభ్యులు



హైదరాబాద్, మనం ప్రతినిధి : రంజాన్ మాసం ఆఖరి పర్వదినమైన 'ఈద్ ఉల్ ఫితర్' సందర్భంగా, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ముస్లిం సహోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభం నుంచి చివరి రోజు వరకు, ప్రతి రోజూ ప్రత్యేక దైవ ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, భక్తి శ్రద్ధలతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరస్పర శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాలు పరిమళిస్తాయని కేసీఆర్ పేర్కొన్నారు. లౌకికవాద విలువలకు ప్రాధాన్యతనిస్తూ, విభిన్న మతాల సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ, గంగా-జమున తహజీబ్కు ప్రతీకగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందని తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం, ప్రగతి కోసం విద్య తదితర రంగాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వారి జీవన విధానంలో గుణాత్మక మార్పుకు దోహదం చేశాయని కేసీఆర్ అన్నారు. ప్రగతి తిరిగి పుంజుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా కేసీఆర్ ఆకాంక్షించారు.

**సార్.. మన ఊరికి రండ్రి..**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని ఆలయ కమిటీ ఆహ్వానించింది. ఈ మేరకు సిద్ధిపేట జిల్లా రూరల్ మండల్‌లో కేసీఆర్ స్వగ్రామం చింతమడకలో ఈ నెల 25, 27న జరిగే శ్రీపట్టాభి సీతారామచంద్ర స్వామి నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ట, శ్రీరామ నవమి వేడుకలకు రావాలని కోరుతూ శుక్రవారం నాడు కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆకుల రామ గౌడ్, పెండల గణేష్, బైరి నర్సింహా రెడ్డి, వాతం శివ, పడకండి విశ్వనాధం, ఎల్లప్పగారి పోచయ్య తదితరులు శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# బీసీల గొంతుకోసిండ్రు?

- ఇస్తామన్నరూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది?
- బీసీ ఆత్మగౌరవ భవనాల భూములను ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తోంది : కమలాకర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అంకెల గారడీ తప్ప ఏమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారంనాడు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. గతంలో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఈ బడ్జెట్‌లో వారిని మోసం చేసిందని ఆరోపించారు. బీసీలకు కేటాయించాల్సిన రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది? అని గంగుల ప్రశ్నించారు. కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించి బీసీల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన బీసీ ఆత్మగౌరవ భవనాల భూములను ప్రస్తుత ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా అబద్ధాలు చెబుతోందని గంగుల కమలాకర్ విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని ఇంతకు ముందు ఒక మంత్రి చెప్పారని, ఇప్పుడు మాత్రం కేసీఆర్ హయాంలో కార్డులు ఇవ్వలేదని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేశారని... ఇది ప్రజల చెవిలో పువ్వు పెట్టడమే అని విమర్శించారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

## చంద్రబాబు చేతుల మీదుగాఅంజికి ఉగాది పురస్కారం



కాత్రేనికోన మార్చి 20 మనం ప్రతినిధిః ఉగాది సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో భాగంగా చిత్ర కళా రంగం లో తాను చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి పురస్కారం కు ఎంపిక చేసినట్లు అంజి ఆకొండి తెలిపారు .పెయింటింగ్ విభాగంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పుష్కారాన్ని అందుకోవడం జరిగిందని కాత్రేనికోన గ్రామానికి చెందిన చిత్రకారుడు, క్రియేటివ్ ఆరట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు అంజి ఆకొండి తెలిపారు. తన సేవలను గుర్తించి తనకు పురస్కారం అందజేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంజి కి పురస్కారం రావడం పట్ల కాత్రేనికోన గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీభద్రకాళీ సమేత శ్రీవీరేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణనికి శంకుస్థాపన



ముమ్మిడివరం, మార్చి 20, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఐ పోలవరం మండలం మురమళ్ళ గ్రామంలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మరియు పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆలయాన్ని పూర్తిగా తొలగించి, రాతి నిర్మాణంతో శాశ్వతంగా నిలిచే విధంగా నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం తరఫున రూ. 4 కోట్ల నిధులు మంజూరు అయినట్లు వెల్లడించారు.మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ. 10 నుండి 12 కోట్ల వరకు ఉంటుందని అంచనాలు వేశామన్నారు, మిగిలిన నిధుల సమీకరణకు భక్తులు, దాతలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు,కార్యనిర్వహణా ధికారి వి సత్యనారాయణ స్వామి, సభ్యులు, ఆలయ అధికారులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కార్టూనిస్ట్ మాడా రాముకి ఉగాది పురస్కారం



అమలాపురం మార్చి 20 మనం న్యూస్ః అమలాపురం రూరల్ మండలం పాత బండారులంక శ్రీ భువనేశ్వరి సమేత త్రయంభకేశ్వర స్వామి ఆలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు శ్రీ శైలం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్టూనిస్టు జాతీయ అవార్డు గ్రహీత మాడా రాము కి ఉగాది పురస్కారం ను సోంబాబు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమం లో చింతా అత్తి లింగం. పిచ్చిక వెంకన్న. పిచ్చిక శ్యామ్. బల్ల వెంకటేశ్వరరావు. పడవల బాలాజీ. కొండా శ్రీనివాసరావు. ఏడుకొండలు. గుమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు

# అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు

- లబోదిబోమంటున్నారైతులు

గొల్లప్రోలు, మార్చి 20(మనం ప్రతినిధి)ః మండలకేంద్రమైన గొల్లప్రో లు పట్టణ పరిధి వివిధ ఆయకట్టుల రైతులుపండించేవరిపంటపొలాలు గురువారంరాత్రికురిసినఅకాలవర్షాని కి.ఈదురుగాలులకువరిపైరు నేలకు ఒరిగి దెబ్బ తిన్నాయని పలువు రు రైతులు లబోదిబో మంటున్నారు ఆరుగాలంశ్రమించిపండించిన దాల్వా పంటలుచేతికిఅందివచ్చే సమయం లో వాతావరణం మార్పు కారణంగా ఏర్పడిన ఈదురు గాలులు అకాల వర్షం రైతన్నలను నట్టేట ముంచిందని అన్నదాతలుఆవేదనవ్యక్తం చేస్తున్నా రు కొన్ని పొలాలు పొట్ట దశలో ఉంటే మరికొన్ని పొలాలుఈనిక దశ నుండి ఒరికంకెలు పాలు పోసుకునే దశలో ప్రకృతిఈదురుగాలులుఅకాల వర్షం తో పంటపొలాలపైవిరుచుకుపడటం తో పంటలునేలను అంటి రైతులకు నిరాశ మిగిలించాయని రైతన్నలు కౌవులుదారులుబోరుమంటున్నారు ఇప్పటికేఎకరాకి30.000.నుంచి35000. వేల రూపాయలు దాల్వా ఓరి సాగుకు పెట్టిన పెట్టుబడి రైతుల చేతికి చిల్లి గవ్వ కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దీనిపై కూటమి ప్రభుత్వం పిఠాపురం శాసనసభ్యుడు రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకుని గొల్లప్రోలు లో సీతానగరం లక్ష్మీపురం గొల్లప్రోలు పరిధి పంటలు నష్టపోయినరైతులనుప్రభుత్వం ద్వారానష్టపరిహారం కల్పించే విధంగా చర్యలుచేపట్టిఅన్నదాతలను ఆదుకో వాలని. అన్నదాతలు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## శ్రీ మావుళ్ళమ్మకు 16 గ్రాముల బంగారం విరాళం



భీమవరం, మార్చి 20 (మనం న్యూస్)ః భీమవరం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పు, ఆరాధ్య దైవం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి నిలువెత్తు సంపూర్ణ స్వర్ణమయం స్వర్ణనిధికి శుక్రవారం భీమవరం పట్టణానికి చెందిన తాడి రమేష్ కుమార్, కరిష్మ దంపతులు సుమారు రెండు లక్షల ఇరవై వేలరూపాయల విలువైన16 గ్రాముల బంగారాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ తాడి రమేష్ కుమార్ దంపతుల పేరున మావుళ్ళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ అమ్మవారి శేషవస్త్రం అందజేయగా ఆలయ చైర్మన్ బొండాడ నాగ భూషణం, ధరకర్తలు రామాయణం శ్రీనివాస్, గుసిడి నాగశిరీష, గొంతిన రమణ, యండ సత్యవతి, మిర్తిపాటి గుణేశ్వరరావు, పాపోలు ఏడుకొండలు రమేష్ కుమార్ దంపతులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందచేశారు.

## మృత్యుంజయ శర్మకు చిరు సత్కారం




ఏలేశ్వరం,మార్చి20(మనం న్యూస్ ):ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీఐ) తెలుగు రాష్ట్రాల వైస్ ప్రెసిడెంట్ గా మాచారి నాగ మృత్యుంజయ శర్మ నియమించబడ్డారు.ఈ మేరకు ఏలేశ్వరం మండలం వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు శర్మను దుస్సాలువతో శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అవసరాల కిషోర్,కవికొండల రవి,చెన్నాప్రగడ గోపి,నాగ సిద్ధాంతి,ఇంజరపు సత్య రామ గోపాల్,చల్లా కృష్ణమూర్తి,ఉడతల రమణారావు,నూకల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉగాది కానుక జాబ్ క్యాలెండర్

- జిల్లా టిడిపి అధ్యక్షుడు రామరాజు



భీమవరం, మార్చి 20 (మనం న్యూస్)ః రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తుందని పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో మంతెన రామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల కాలంలో 6,28,347 నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరిగిందని 23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు అండగాకూటమి ప్రభుత్వం నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి ఉప్పులూరి చంద్రశేఖర్ పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి చల్లబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరానికి అందిన గౌరవం డాక్టర్ నల్లా నరసింహమూర్తి



- బాలార్జున సత్యనారాయణ మాకే

అమలాపురం, మార్చి 20 మనం న్యూస్ః మూడున్నర దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్న నిరంతర అక్షర శ్రామికులు ,ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే వినమ్రత కలిగిన నడకకవి నల్లా నరసింహమూర్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారానికి ఎంపికై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారం అందుకున్న సందర్భంగా కవి వక్త వ్యాఖ్యాత ప్రశంసాపత్రాల రచయిత తెలుగు భాష ఉపాధ్యాయుడు బాలార్జున సత్యనారాయణ మాకే హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. నానీలు లక్కపిడతలు గాలిపటాలు మరమరాలు లాంటి వివిధ ప్రక్రియల సృష్టికర్తగా సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ప్రతిరోజుఅక్షరార్చనచేయనిదే అయనకి రోజు మారదు. నడక అనే అంశంపై 117 పుస్తకాలనురచించిన రచయితగా సమాజం చేత నడకకవిగా పేరుగాంచారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులుగా కోనసీమ రచయితల సంఘం ప్రధానకార్యదర్శిగా సేవలందిస్తున్నారు.అక్షరాన్ని నమ్ముకున్న కవికి అందిన గౌరవం ఈ పురస్కారం అని బాలార్జున అభినందనలు తెలియజేశారు.

## ఉగాది కానుకగా యువతకు జాబ్ క్యాలెండర్



- తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు

నరసాపురం, మార్చి 20 (మనం న్యూస్)ః నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం మర్రితిప్ప గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పొత్తూరి రామరాజు పాల్గొని మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉగాది పర్వదినం రోజున ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని ఆయన అన్నారు. గత 20 నెలల్లో యువతకు 6,28,347 ఉద్యోగాలు కల్పించడం జరిగిందని రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నాయకులు వాతాడి ఉమామహేశ్వరరావు, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించిన ప్రభుత్వ విప్



ముమ్మిడివరం, మార్చి 20, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరంలో ముమ్మిడివరం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు లాంఛనంగా ప్రారంభించారు . ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించి, శారీరక దృఢత్వానికి దోహదపడే కార్యక్రమాలను వరుసగా రెండవ సంవత్సరం నిర్వహిస్తున్న ముమ్మిడివరం క్రికెట్ క్లబ్ ను ఆయన ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా చేపట్టాలని, యువత ఇటువంటి క్రీడల పట్ల ఆసక్తిని కలిగి,పాల్గొనాలని సుబ్బరాజు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి సీనియర్ నేతలు తాడి నరసింహారావు, చెల్లి అశోక్,గోదశి పుండరీష్,కార్యకర్తలు,అభిమానులు,ప్రజలు,క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉగాది వేడుకల్లో పుస్తక సమీక్ష చేసిన కవి బాలార్జునకు సత్కారం



ముమ్మిడివరం, మార్చి 20 మనం న్యూస్ః కళా సాహితి ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో ఉగాది వేడుకలలో పుస్తక సమీక్ష చేసిన కవి, వ్యాఖ్యాత బాలార్జునను కళాసాహితి అధ్యక్షులు పచ్చిమాల శివ నాగరాజు ముమ్మిడివరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కోలా గంగాభవాని బాబ్జి మండల అభివృద్ధి అధికారి దీక్షితులు ఘనంగా సత్కరించారు.గంజి రామకృష్ణ శ్రీనివాసరావు రచించిన సూక్తి సుమాలు పుస్తకాన్ని కవి బాలార్జున సత్యనారాయణ మాకే సమీక్ష చేసారు . అనంతరం అహంకారానికి పరాభవం అనే ఉగాది కవిత ఆలపించారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రం అభినందన జ్ఞాపకం అందించి సత్కరించారు.

## నామినేషన్లు దాఖలు చేసిన గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



యానాం, మార్చి 20, మనం న్యూస్ః పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలో ఎన్నికల సందడి నెలకొంది. యానం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శాసన సభ్యులుగా పోటీ చేసే వారినించి నామినేషన్ లు స్వీకరించడం మొదలు కావడంతో ఔత్సాహికులు నామినేషన్లు వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజా మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ యానాం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు.ముందుగా గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సతీసమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రిటర్నింగ్ అధికారికినామినేషన్ పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ ప్రజల నిర్ణయం మేరకు ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు.

## కలెక్టర్ కార్యాలయంలో ఉగాది వేడుకలు



అమలాపురం మనం న్యూస్ః డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరాభవనామ ఉగాది వేడుకలు జరిగాయి ఈ ఉగాది కార్యక్రమంలోకవిత గానం చేసిన తెలుగు లెక్చరర్, కవి ఎస్.సంసోను ను ఏపీసి మరియు ఆర్డీఓ జి.మమ్మి,దేవాదాయ ధర్మాదాయ సహాయం కమీషనర్ వి.సత్యనార యణ,జిల్లా వైద్యాధి కారి ఎమ్.దుర్గా రావుఉగాది సభా నిర్వాహకులుజియస్.సుబ్రమణ్యం సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల కర్స్పాండెంట్ కె.నరసింహారావు, ప్రిన్సిపాల్ మనోహర్, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్ అధ్యాపకులు విద్యార్థులు ప్రత్యేక అభినందనలు,తెలియ జేశారు.


## పులి చంపిన 3 పశువులకు ఎమ్మెల్యే రూ.66వేలు నష్టపరిహారం పంపిణీ



ఏలేశ్వరం, మార్చి, 20(మనం న్యూస్ )ః కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సంచరించిన రాయల్ బెంగాల్ టైగర్ చంపిన మూడు పెంపుడు మూగ జీవాల యజమానులకు నష్ట పరిహారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ పంపిణీ చేసింది.పులి దాడిలో మొత్తం మూడు పెంపుడు జంతువులకూ కలిపి మొత్తం రూ. 66,000 లను నష్ట పరిహారాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చేతుల మీదుగా అందచేశారు.ఈ పులి జిల్లాలో 10 రోజుల పాటు సంచరించి ఈ మార్చి 12 న తాడువాయి గ్రామంలో నెక్కంటి శ్రీనివాసరావు గేదె దూడను పులి దాడిచేసి చంపినందుకు ఈ బాదితునికి నష్ట పరిహారంగా రూ. 16,000 లు,13 న అచ్చింపేట గ్రామంలో బొట్టా చినసత్యనారాయణ ఆవు దూడను పులి చంపినందుకు నష్టం పరిహారంగా రూ. 25,000 లు,15 న మండపం గ్రామంలో పోలం తమ్మయ్య గేదె దూడను పులి చంపినందుకు కూడా నష్టం పరిహారంగా రూ. 25,000 లు చొప్పున విడివిడిగా డి.డి రూపంలో ప్రభుత్వం అందజేసింది.ఈ డిడిలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతులు మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు.పులి దాడిలో చనిపోయిన పశువులకు నష్టపరిహారాన్ని సకాలంలో మంజూరు చేయించడంలో అతి వేగంగా నష్ట పరిహారాన్ని పంపిణీ చేయడంలోనూ కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు చూపిన చొరవ అభినందనీయం. ప్రస్తుతం పులి రాజవొమ్మంగి అటవీశాఖ రేంజ్ పరిధిలోనికి వెళ్ళిపోయిందని ఈ నష్టపరిహారాన్ని పంపిణీ సందర్భంగా అటవీశాఖ అధికారులు మీడియా ముఖంగా ప్రకటించారు.ఈ నష్టపరిహారం పంపిణీ కార్యక్రమంలో ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గ రాంప్రసాద్,డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జాన్సన్,శంఖవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి గంటిమళ్ళ నాగేశ్వరరావు,రౌతులపూడి ఫారెస్ట్ సెక్షన్ అధికారి పైడా శ్యాంకుమార్, కొత్తూరు అటవీ బీట్ ఆఫీసర్ పెయ్యల వెంకటరమణ, బవురువాక అటవీ బీట్ ఆఫీసర్ బుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన మురళీకృష్ణం రాజు

- మెరుగైన వైద్యంపై దృష్టి



ప్రత్తిపాడు, మనం న్యూస్ మార్చి 20ః ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన మచ్చర్ల రాజు భార్య సత్యవతి ఇటీవల అనారోగ్య సమస్యల కారణంగా కాకినాడలోని సూర్య గ్లోబల్ హాస్పిటల్లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు వెంటనే స్పందించి హాస్పిటల్కు చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. ఆసుపత్రిలో సత్యవతిని కలిసిన మురళీకృష్ణం రాజు, ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి వివరంగా తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్



ముమ్మిడివరం, మార్చి 20 , మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరంలో డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. సాధ్యమైనంత త్వరగా,నాణ్యతాయుతంగా నిర్మాణ పనులను పూర్తి చేసి తరగతి గదులు మరియు ఇతర సౌకర్యాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కూటమి సీనియర్ నేతలు, కార్యకర్తలు,అధికారులు పాల్గొన్నారు.

# జాలుక్‌బారీ బరిలో అస్సాం సీఎం హిమంత

## 88 మంది అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితా

**గువాహటి/ఢిల్లీ, మార్చి 20:** అస్సాం శాసనసభ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే 88 మంది అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ గురువారం విడుదల చేసింది. ఇందులో రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేరు ఉంది. ఆయన తన కంచుకోటైన జాలుక్‌బారీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. 2001, 2006, 2011, 2016, 2021ల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచే హిమంత విజయం సాధించారు. అస్సాం కాంగ్రెస్ విపక్ష నేత గౌరవ్ గొగొయ్ పోటీ చేసే జోర్హాట్ నియోజకవర్గంలో చేరిన కాంగ్రెస్ నేతలు ప్రద్యూత్ బోర్డోలోయ్, భూపేన్ బోరాలకు దిస్పూర్, బిహుపురియా సీట్లు లభించాయి. అస్సాంలో 126 శాసనసభ స్థానాలకు వచ్చే నెల 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.



**బెంగాల్ బరిలో ప్రమాణిక్, రూపా గంగూలీ**

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల రెండో జాబితాను కూడా గురువారం బీజేపీ విడుదల చేసింది. ఇందులో 112 మంది అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. ఈ జాబితాలో కేంద్ర మాజీ మంత్రి నిశీథ్ ప్రమాణిక్‌కు చోటు లభించింది. ఆయన మాథాభాంగా స్థానం నుంచి పోటీ చేయనున్నారు. హాకీ మాజీ క్రీడాకారుడు భరత్ ఛెత్రికి కలింపోంగ్ శాసనసభ స్థానాన్ని కేటాయించారు. జాబితాలో నటి రూపా గంగూలీ (సోనార్‌పూర్ దక్షిణ్), ఐపీఎస్ మాజీ అధికారి రాజేశ్ కుమార్ (జగత్‌దళ్), రేఖా పాత్రా(హింగల్‌గంజ్) పేర్లు కూడా ఉన్నాయి. ఇటీవల 144 మంది అభ్యర్థులతో తొలి జాబితాను బీజేపీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు రెండు దశల్లో వచ్చే నెల 23, 29 తేదీల్లో జరగనున్నాయి.

కన్నూరు జిల్లాలోని ధర్మదం నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న కేరళ సీఎం పినరయి విజయన్ గురువారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కేరళ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను బీజేపీ గురువారం ప్రకటించింది. ఇందులో 39 మంది పేర్లు ఉన్నాయి. అరన్‌ములా నియోజకవర్గం నుంచి మిజోరం మాజీ గవర్నర్ కుమ్మనమ్ రాజశేఖరన్‌ను బరిలోకి దింపింది. ఈ సీనియర్ బీజేపీ నేత.. ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జిని ఎదుర్కోనున్నారు. ఈ స్థానంలో కాంగ్రెస్ ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. గురువాయూర్ అసెంబ్లీ స్థానం నుంచి సీనియర్ బీజేపీ నేత గోపాల్ కృష్ణన్‌ను పోటీకి దింపింది. తొలి జాబితాలో బీజేపీ 47 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించిన సంగతి తెలిసిందే. గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో జరిగే ఐదు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు బీజేపీ తన అభ్యర్థులను గురువారం ప్రకటించింది. ఈ ఎన్నికలు వచ్చే నెల 9న జరగనున్నాయి.

కేరళ ఎన్నికల్లో తమ పార్టీ.. ఎన్డీయేకు మద్దతు ఇవ్వనుందని డెమొక్రాటిక్ సోషల్ జస్టిస్ పార్టీ ప్రకటించింది. అగ్రవర్ణ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చే ఈ పార్టీ.. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కల్పించింది ప్రధాని మోడీయేనని పేర్కొంది. రాష్ట్రంలో వామపక్షాలు, కాంగ్రెస్ ప్రభుత్వాలు మైనారిటీలను బుజ్జగించే రాజకీయాలకే పరిమితమయ్యాయని అగ్రవర్ణాల్లో పేదలను పట్టించుకోలేదని ఆరోపించింది.

# బ్రిటన్ వీసా ఛార్జీల పెంపు..

## ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి

**లండన్, మార్చి 20:** పర్యాటకులతో పాటు ఉన్నత చదువుల కోసం బ్రిటన్‌కు వెళ్లే విద్యార్థులపైనా ఇకపై మరింత ఆర్థిక భారం పడనుంది. స్టూడెంట్, విజిటర్ సహా అన్ని కేటగిరీల వీసా ఫీజులను పెంచుతున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. వీసా, సెటిల్‌మెంట్, స్పాన్సర్ లైసెన్స్ ఫీజుల కొత్త ఛార్జీలు ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు హోమ్ ఆఫీస్ ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తుల రుసుములు సుమారు ఆరు నుంచి ఏడు శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. కొత్త విధానం ప్రకారం..

మూడేళ్ల స్కిల్ వర్కర్ (కార్మిక) వీసా దరఖాస్తు రుసుము 769 పౌండ్ల నుంచి 819 (రూ.1,02,470) పౌండ్లకు పెరగనుంది. మూడేళ్లకు పైగా ఉండే దరఖాస్తుల రుసుము 1519 నుంచి 1618 (రూ.2,02,437) పౌండ్లకు పెరగనుంది. విద్యార్థి వీసాల పైనా ఈ పెరుగుదల ప్రభావం కనిపించనుంది.

విద్యార్థి వీసా రుసుములు 524 పౌండ్ల నుంచి 558 (రూ.69,814) పౌండ్లకు పెరగనున్నాయి. ఆరు నెలల విజిటర్ వీసా ఛార్జీ 127 పౌండ్ల నుంచి 135 (రూ.16,890) పౌండ్లకు పెరుగుతుందని బ్రిటన్ వెల్లడించింది.

# ప్రభుత్వం కార్మిక వ్యతిరేకి కాదు

- 'పరిశ్రమ' నిర్వచనంపై సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం



**ఢిల్లీ , మార్చి 20:** శ్రామికుల ప్రయోజనాల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం కార్మిక వ్యతిరేకి కాదని కేంద్రం గురువారం సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి తెలిపింది. పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం-1947లోని 'పరిశ్రమ' అనే పదానికి నిర్వచనం అంశంపై 9 మంది జడ్జీలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ముందు వరుసగా మూడో రోజు కూడా విచారణ కొనసాగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదనలు వినిపించారు. 'వివాదంలోని అంశంపై ప్రభుత్వాన్ని సంప్రదించాను. ప్రభుత్వం కార్మిక వ్యతిరేకి కాదు. శ్రామికుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. మనం ప్రపంచీకరణ చెందిన ఆర్థిక వ్యవస్థ దిశగా పయనిస్తున్నాం. ఇలాంటి వ్యవహారాలను ఎలా చక్కదిద్దుకోవాలనే విషయమై నిర్ణయం తీసుకోవాలి' అని వెంకటరమణి తెలిపారు. అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్, సీనియర్ న్యాయవాదులు శేఖర్ నఫాదే, ఇందిరా జైసింగ్, సి.యు.సింగ్, సంజయ్ హెగ్డే తదితరులు కూడా వాదనలు వినిపించారు. విచారణ పూర్తి చేసిన విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

## ఈసీ పనితీరు దిగ్భ్రాంతికరం

### పశ్చిమ బెంగాల్ సీఎం మమత

**కోల్‌కతా, మార్చి 20 :** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరు దిగ్భ్రాంతికరమని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు ఘాటైన పదజాలంతో లేఖ రాశారు. రాజ్యాంగబద్ధ సభ్యత, ఔచిత్యాలను ఈసీ అతిక్రమించిందని, రాష్ట్ర సర్కారు లేవనెత్తుతున్న ఏ అభ్యంతరాన్నీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. క్షేత్రస్థాయి వాస్తవాలు, ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టకుండా ఈసీ పనిచేస్తోందని దుమ్మెత్తిపోశారు. ఓటర్ల జాబితాల సవరణ కొనసాగుతున్న తరుణంలో జిల్లా ఎన్నికల అధికారుల్ని బదిలీ చేయడం వెనుక స్పష్టమైన దురుద్దేశాలు కనిపిస్తున్నాయన్నారు. ఇవన్నీ పరోక్షంగా కేంద్ర పాలనను, ఎమర్జెన్సీ తరహా పరిస్థితుల్ని గుర్తుచేస్తున్నాయని, ఈ నిర్ణయాలను పునఃసమీక్షించాలని కోరారు.

# ఎరువుల ఎగుమతులపై చైనా ఆంక్షలు

- వ్యవసాధారిత దేశాలకు షాక్
- భారత్ సహా పలు దేశాలకు ఎగుమతులు నిలిపివేత

**బీజింగ్, మార్చి 20:** ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది.



అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్జీ సరఫరా లేకపోవడంతో భారత్లోని పలు యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

### కుమార్తెతో కలిసి..

# ట్యాంకర్‌పై కిమ్ షికారు




**ప్యాంగ్యాంగ్, మార్చి 20:** ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె కిమ్-జు-యే మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల స్నైపర్ రైఫిళ్లను ఎక్కిపెట్టిన ఆమె.. తాజాగా తన తండ్రితో కలిసి ఓ ట్యాంకర్‌పై షికారుకు వెళ్లారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కిమ్ తన కుమార్తెతో కలిసి గురువారం ఓ ఆర్మీ ట్రైనింగ్ యూనిట్లో పర్యటించారు. ఈసందర్భంగా దళాలు లైవ్ ఫైరింగ్ డ్రిల్స్‌ను వారు పర్యవేక్షించారు. యుద్ధ సన్నాహాలను త్వరగా పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఈ క్రమంలో కిమ్, కుమార్తెతో కలిసి ట్యాంకర్‌పై షికారుకు వెళ్లిన ఫొటోలను కూడా విడుదల చేసింది. కిమ్-జు-యే ట్యాంకర్ లోపల కూర్చొని ఉండగా ఆమె తల మాత్రం బయటకి కన్పిస్తోంది. ఇక, బ్లాక్ కోట్ వేసుకున్న కిమ్.. ట్యాంకర్‌పై నవ్వుతూ కూర్చొని ఉన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ ఫొటోలు చక్కర్లు కొడుతున్నాయి. 13 ఏళ్ల కిమ్-జు-యే 2022 చివరినుంచి తన తండ్రితో పాటు అనేక కార్యక్రమాల్లో కన్పిస్తూ వచ్చింది. ఈ క్రమంలో కిమ్ ఆమెనే తన వారసురాలిగా ప్రకటించే అవకాశాలున్నట్లు వార్తలు కూడా వచ్చాయి. కిమ్ వారసత్వ బాధ్యతలను ఆమె దక్కించుకోనుందనే ఊహాగానాలు మరింత ఎక్కువయ్యాయి. అయితే, కిమ్ ఇప్పటివరకు దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

### హర్మూజ్‌ను తెరిచేందుకు...

# రంగంలోకి ఎ10లు.. అపాచీలు..!

**వాషింగ్టన్, మార్చి 20:** ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. అమెరికా ఛైర్మన్ ఆఫ్ ది జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. ఈ జలసంధిలో ఇరాన్ సీమైన్స్, బోట్స్, మిస్సైల్స్ నుంచి ఎదురయ్యే ప్రమాదాల్ని అరికట్టేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధిస్తూ ఇరాన్ పరిచిన ఉచ్చులను పూర్తిగా తొలగించడానికి వారానికి పైగా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ జలసంధి మూసివేతతో చమురు ధరలు 119 డాలర్లను తాకిన విషయం తెలిసిందే.





భారీ ఆయుధాలతో ఎ-10 యుద్ధ విమానాలకు తోడు అపాచీ అటాక్ హెలికాప్టర్లను కూడా పంపించింది. ఎ-10 యుద్ధ విమానాలు దక్షిణ తీర ప్రాంతాల్లోని ఇరాన్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్‌లను లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో తమ మిత్ర దేశాలు కొన్ని అటాక్ డ్రోన్లను ఎదుర్కోవడానికి అపాచీ హెలికాప్టర్లను రంగంలోకి దించినట్లు జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. అయితే ఆ దేశాల పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. వాస్తవానికి కొన్నాళ్ల నుంచే ఎ-10, అపాచీ హెలికాప్టర్లు ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. వీటికి అండగా ఇప్పటికే ఆ ప్రాంతంలో ఫైటర్ జెట్లు కూడా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు 120 నౌకలను పేల్చేసినట్లు రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్ వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికా ఎ-10 విమానాలను పదాతి దళాలకు క్లోజ్ ఎయిర్ సపోర్ట్ మిషన్ల కోసం నిర్మించారు. తాజాగా ఇప్పుడు వాటిని నౌకలను ధ్వంసం చేయడానికి వినియోగిస్తున్నారు. దీని ముక్కుపై 30 ఎంఎంగన్ ఉండగా.. రెక్కలపై బాంబులు అమర్చి ఉంటాయి. అమెరికా ఎ-10 విమానాలు జోర్డాన్ కేంద్రంగా ఉన్నాయి. వీటిని గతంలో ఐసిస్‌పై ఆపరేషన్లకు వాడారు. ఇప్పటికే దాదాపు 2,200 మంది అమెరికా మెరైన్ కమాండోలు ఇరాన్ యుద్ధంలో పాల్గొనేందుకు బయల్దేరారు. వీరు ఇరాన్ దక్షిణతీరంలోని ద్వీపాలను స్వాధీనం చేసుకొని హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది.

## ఛత్తీస్‌గఢ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్డు

**రాయ్‌పూర్, మార్చి 20:** స్వచ్ఛభారత్ మిషన్ కింద ఛత్తీస్‌గఢ్‌లోని సర్గుజా జిల్లా మైన్పాట్ ప్రాంతంలో చేపట్టిన ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారులు నిర్మించే పైలట్ ప్రాజెక్టు విజయవంతమైంది. ఒక కిలోమీటరు మేర ప్లాస్టిక్ వ్యర్థాలు కలిపిన తారు, కంకరలతో రోడ్డు వేశారు. దీంతో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రహదారి నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను విస్తృతంగా ఉపయోగించేందుకు మార్గం సుగమం అయింది. మైన్పాట్ ప్రాంతంలో ప్లాస్టిక్‌తో రహదారుల నిర్మాణానికి అవసరమైన సామగ్రి తయారీకి ఒక పరిశ్రమను కూడా ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్మించే రహదారులు సాధారణ రోడ్ల కన్నా ఎక్కువ మెరుపు కలిగి ఉంటాయి. పర్యావరణ సమస్యగా మారిన ప్లాస్టిక్‌ను నిర్మాణ కార్యకలాపాల్లో ఉపయోగించడం వల్ల పరిసరాలూ శుభ్రమవుతాయి. రహదారి నిర్మాణంలో వాడే తారు బరువులో 8 శాతం మేర ప్లాస్టిక్ కలుపుతామని ఇంజినీరు వికాస్ కౌశిక్ తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద మహిళా స్వయం సహాయక బృందాలు సేకరించే ప్లాస్టిక్ వ్యర్థాలకు కిలోకు రూ.25 చొప్పున చెల్లిస్తుండటంతో నిరుపేద మహిళలు లబ్ధి పొందుతున్నారు.

# అమెరికా ఎఫ్-35ని ఢీకొట్టామిలా..

- వీడియో రిలీజ్ చేసిన ఇరాన్



**టెహ్రాన్, మార్చి 20 :** ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా కీలక యుద్ధ విమానాలను కోల్పోతోంది. తాజాగా ఎఫ్-35 యుద్ధ విమానాన్ని ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో.. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరంలో అత్యవసరంగా దిగాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇరాన్ ప్రకటన విడుదల చేసింది. ''మా గగనతల రక్షణ వ్యవస్థ అర్ధరాత్రి దాటిన తర్వాత యూఎస్ సైన్యానికి చెందిన ఎఫ్-35 యుద్ధ విమానాన్ని దెబ్బతీసింది. అది ఏ స్థాయిలో దెబ్బతిన్నదనే దానిపై దర్యాప్తు చేస్తున్నాం. అది పూర్తిగా ధ్వంసం కావడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి'' అని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ వెల్లడించింది. అలాగే గాలిలో విమానాన్ని ఒక క్షిపణి ఢీకొడుతున్నట్టుగా ఉన్న వీడియోను రిలీజ్ చేసింది.

మరోవైపు ఇదే ఘటనపై యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ స్పందించారు. ఇరాన్ యుద్ధంలో భాగమైన ఫైటర్ జెట్ ఒకటి అత్యవసరంగా ల్యాండ్ అయిందని చెప్పారు. అది సురక్షితంగా దిగిందని, ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. ఎఫ్-35ని క్షిపణుల వంటివి తాకి ఇలా ఎమర్జెన్సీ ల్యాండ్ అవడం ఇదే తొలిసారి. ఈ ఫైటర్ జెట్ విలువ వందల కోట్లలోనే ఉంటుంది. దీని కనీస విలువ రూ.82.5 మిలియన్ డాలర్లు (రూ.769 కోట్లకు పైగానే)గా ఉంది.

# సర్‌ప్రైజ్ ఇస్తామని చెప్పిన గంటల్లోనే...

- ఇరాన్ సైనికాధికారి మృతి

**జరూసలెం, మార్చి 20:** అమెరికా-ఇజ్రాయెల్‌తో జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ దాడుల్లో కీలక సైనికాధికారి, ఐఆర్జీసీ ప్రతినిధి జనరల్ అలీ మహమ్మద్ నయినీ మృతి చెందారు. శత్రు దేశాన్ని హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఆయన చనిపోవడం గమనార్హం. ఈ మృతిని ఐఆర్జీసీ ధ్రువీకరించింది. నయినీ మరణించడానికి కొన్ని గంటల ముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. యురేనియం శుద్ధి చేయడం, బాలిస్టిక్ క్షిపణులు తయారుచేసే సామర్థ్యం ఇక ఇరాన్‌కు లేదని నెతన్యాహు అనగా.. ''ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం జరుగుతున్నప్పటికీ.. మా క్షిపణి పరిశ్రమ ఇప్పుడు అత్యున్నత స్థాయికి చేరుకుంది. ఈ ఘర్షణల్లో కూడా మేం ఉత్పత్తిని కొనసాగిస్తున్నాం. మావద్ద చాలినన్ని నిల్వలు ఉన్నాయి. ఈ విషయంలో మాకు ఎలాంటి ఆందోళనా లేదు. మా శత్రువుకు సర్‌ప్రైజ్‌లు ఎదురుకానున్నాయి. యుద్ధం కొనసాగేకొద్దీ అవి మరింత తీవ్రం కానున్నాయి'' అంటూ నయినీ కౌంటర్ ఇచ్చారు. అలాగే ఇరాన్ నౌకాదళం ధ్వంసం అయిందంటూ అమెరికా



అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనను తోసిపుచ్చారు. పర్షియన్ గల్ఫ్‌లోకి అమెరికా తన నౌకలను పంపాలంటూ సవాలు విసిరారు. ఇలా ఆయన హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ వారంలో ఇప్పటికే ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సొల్మనీ మరణించిన సంగతి తెలిసిందే.

# కేరళలో 37 మంది అభ్యర్థులతో కాంగ్రెస్

- రెండో జాబితా
- ఎంపీలకు దక్కని చోటు

**తిరువనంతపురం, మార్చి 20 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల కోసం 37 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తమ రెండో జాబితాను గురువారం విడుదల చేసింది. పార్టీ ఎంపీలెవరికీ ఇందులో చోటు దక్కలేదు. త్రిపునిథుర, పెరుంబవూర్ మినహా మిగతా చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలనే కాంగ్రెస్ మరోసారి బరిలో దించింది. త్రిపునిథుర ఎమ్మెల్యే కె.బాబు పోటీ నుంచి స్వయంగా తప్పుకోగా.. దీపక్ జాయ్‌కు టికెట్ ఇచ్చింది. పెరుంబవూర్లో ఎమ్మెల్యే ఎల్డోస్ కున్నపిల్లీను పక్కనపెట్టి, మనోజ్ మూథెదన్ను పోటీలో నిలిపింది. 55 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితాను గతంలోనే ప్రకటించింది. ఎంపీలను కేరళ శాసనసభ ఎన్నికల బరిలో దింపాలా, వద్దా అనే విషయంలో అంతకుముందు కాంగ్రెస్ మల్లగుల్లాలు పడింది. అసెంబ్లీకి పోటీ చేస్తామని కన్నూర్ ఎంపీ కె.సుధాకరన్ సహా పలువురు పార్లమెంటు సభ్యులు పట్టుపట్టడమే అందుకు కారణం.




టికెట్ నిరాకరించడంతో పార్టీకి రాజీనామా చేసేందుకూ సుధాకరన్ ఓ దశలో సిద్ధమై.. ఎ.కె.ఆంటోనీ వంటి అగ్రనేతలు జోక్యం చేసుకుని బుజ్జగించడంతో వెనక్కి తగ్గినట్టు సమాచారం. సుధాకరన్ కోరిన కన్నూర్ టికెట్‌ను టి.ఒ.మోహనన్‌కు ద్వితీయ జాబితాలో కాంగ్రెస్ కేటాయించింది. ఎంపీలను అసెంబ్లీ ఎన్నికలకు పంపించి, దానివల్ల తలెత్తబోయే ఉప ఎన్నికల్లో గెలవలేకపోతే లోక్‌సభలో బలం తగ్గిపోతుందేమోనని కాంగ్రెస్ భావించినట్లు సమాచారం. లోక్‌సభలో కాంగ్రెస్ చీఫ్ విప్ కె.సురేశ్ సహ కనీసం ఐదుగురు ఎంపీలు ఈసారి శాసనసభ ఎన్నికల్లో పోటీపై ఆసక్తితో ఉన్నారు.

# కువైట్‌లో కీలకమైన రిఫైనరీపై ఇరాన్ దాడి

- రిఫైనరీలో భారీగా చెలరేగిన మంటలు

**బాగ్దాద్, మార్చి 20:** గల్ఫ్ దేశాల్లోని కీలక చమురు వ్యవస్థలే లక్ష్యంగా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఇటీవల ఖతార్‌లోని రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రంపై, సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కోపై దాడులు చేయగా.. తాజాగా కువైట్ లో కీలకమైన మినా అల్- అహ్మదీ ఆయిల్ రిఫైనరీపై డ్రోన్ దాడికి పాల్పడింది. కువైట్‌లో శుక్రవారం రంజాన్ పండుగ జరుపుకుంటున్న తరుణంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. పశ్చిమాసియాలో అతిపెద్ద రిఫైనరీల్లో ఈ మినా అల్- అహ్మదీ కూడా ఒకటి. డ్రోన్ దాడి నేపథ్యంలో రిఫైనరీలో భారీగా మంటలు చెలరేగాయి. అధికారులు వాటిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా లేదా అనే విషయం ఇంకా తెలియరాలేదు. రోజుకి దాదాపు 7,30,000 బ్యారెళ్ల చమురు శుద్ధి చేయగల ఈ రిఫైనరీపై గురువారం కూడా ఇరాన్ దాడి చేసింది. కాగా..దుబాయ్ నగరం పైకి ఇరాన్ డ్రోన్లు దూసుకురాగా, వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకొన్నాయి. ఈ క్రమంలో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇక, తమపై దూసుకొచ్చిన ఓ క్షిపణిని అడ్డుకొన్నట్లు బహ్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ క్రమంలో దాని శకలాలు ఓ గిడ్డంగిపై పడటంతో మంటలు చెలరేగాయని పేర్కొంది.



# జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం




**సూర్యాపేట, మార్చి 20 (మనం ప్రతినిధి):** 2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు కీలకమని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో జనాభా గణన-2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి సెక్షన్ క్లార్క్ లు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు మార్చి 20, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు ఇళ్ల జాబితా, గృహ గణన (ఏఔ) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..జనాభా గణన నిర్వహణకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి దశగా ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) మరియు గృహ గణన మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు, రెండో దశగా జనాభా గణన 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారు. అని అన్నారు. జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈసారి జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. మొబైల్ యాప్ లు , వెబ్ పోర్టల్ ద్వారా గణన చేపడతారని, ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహ గణన సందర్భంగా ఇంటి నిర్మాణం, పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీరు, మురుగు పారుదల, మరుగుదొడ్లు, వంటగది వంటి సౌకర్యాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలపై ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సీపీఓ కిషన్ మాట్లాడుతూ... అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. జనాభా గణాంక అధికారి రవీంద్ర నాయక్ మండలాల వారీగా గణన బ్లాకుల విభజన, గణన విధానం పై శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గణాంక అధికారి వి. రామారావు, ఉప గణాంక అధికారి ఎం. రాజేష్, బి. కోటేశ్వరరావు, పర్యవేక్షకులు దున్న శ్యామ్, మండల ప్రణాళికా గణాంక అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమలగిరి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



**తిరుమలగిరి, మార్చి 20 (మనం న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగాజిల్లా ఎస్.పి నరసింహ శుక్రవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న రికార్డ్ లను, ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, రికార్డు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి భరోసా కల్పించాలని సూచించారు. ప్రజా సమస్యలపై సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందిస్తూ బాధితుల వద్ద నుండి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సామాజిక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సైబర్ మోసాలు రోడ్డు ప్రమాదాలు మహిళల భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది అందరూ జట్టుగా పనిచేసే మంచి ఫలితాలు సాధించాలని కోరారు.అనంతరం తిరుమలగిరి మండల కేంద్రంలో రోడ్లను, ప్రధాన జంక్షన్ లను, రోడ్డు ప్రమాద స్థలాలను పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పునరుద్ధరించడానికి ప్రత్యేక కార్యచరణ ప్రత్యేక దృష్టి పెట్టామని ఆపరేషన్ రోప్ అనే కార్యక్రమం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను గుర్తించి వేగవంతంగా వాటిని పునరుద్ధరించాలని సిఐ, ఎస్ఐ కు సూచించారు, మున్సిపల్ అధికారులతో సమన్వయంగా పనిచేసి తిరుమలగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై వేగంగా పనిచేయాలని అన్నారు. ప్రజలు వాహనదారులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. వ్యాపారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించవద్దని కోరారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది కలిగి ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. అయన వెంట స్థానిక ఎస్ఐ వెంకట్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# రంజాన్ తోఫాను అందజేసిన సర్పంచ్ పాలకి సురేష్



**కోదాడ, మార్చి 20(మనం న్యూస్):** మండల పరిధిలోని దోరకుంట గ్రామంలో మసీదు నందు రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు అందిస్తున్న రంజాన్ తౌఫాను ముస్లిం కుటుంబాలకు సర్పంచ్ పాలకి సురేష్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముస్లిం సోదరీ సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు. రంజాన్ పర్వదినాన్ని ముస్లింలంతా ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణం లో జరుపుకోవాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ అమీనా, ఖయ్యూం, పాలడుగు జాన్, కాంగ్రెస్ నాయకులు పత్తిపాక వెంకటేశ్వర్లు, జక్కుల నరసింహారావు, పత్తిపాక రాంబాబు, ఒగ్గు నాగేంద్రబాబు, సుంకర మల్లేశ్వరరావు, షేక్ అహ్మద్, డ్రైవర్ జబ్బర్, ఇమాం, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**కోదాడ, మార్చి 20(మనం న్యూస్):** నియోజకవర్గ పాస్టర్స్ నూతన కమిటీని శుక్రవారం కోర్ కమిటీ చైర్మన్ రెవ డాక్టర్ కె శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. నియోజకవర్గ అధ్యక్షుడిగా కె రామారావు, గౌరవ అధ్యక్షులుగా యేసురత్నం, వైస్ ప్రెసిడెంట్ పి డేవిడ్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి రమేష్, సెక్రటరీగా కోర్నేలిబాబు, జాయింట్ సెక్రెటరీ డి దానియేలు, ట్రెజరర్ పి పాల్ చారి, చీఫ్ -కో -ఆర్డినేటర్ ఇస్మాయేల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్గా రెవరెండ్ డాక్టర్ వి యేసయ్య, వైస్ చైర్మన్ గా శాంతవర్ధన్, టి ఇర్మియా లను ఏర్పాటు చేశారు. కోదాడ పట్టణ కమిటీ అధ్యక్షుడుగా రెవరెండ్ సైమన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె ప్రభుదాస్, గౌరవ అధ్యక్షులుగా జోసఫ్ రాజు, వైస్ ప్రెసిడెంట్ గుండు దానియేల్, సెక్రటరీ జి ఆమోస్, ట్రెజరర్ బి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూత్ కమిటీ ప్రెసిడెంట్ గా కె సురేష్, ఉపాధ్యక్షులుగా పి నిస్సి, సెక్రటరీ ప్రియదర్శన్, ట్రెజరర్ కే ఎనోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ క్రైస్తవ నాయకులు బిషప్ ఏజే శామ్యూల్, డాకూరి ప్రభుదాస్, పరంజ్యోతి, గుడిబండ ఏసయ్య, లాజర్, సిల్వరాజు, గబ్రీల్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన బంతుల తయారీ




**మహాదేవపూర్, మార్చి20 (మనం న్యూస్):** మహాదేవపూర్ మండల కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మహాదేవపూర్ లో నేషనల్ గ్రీన్ కార్ప్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులందరు చింత,సపోటా, రేగు,ఖర్జురా,సీతాఫలం గింజలతో విత్తనబంతులు( సీడ్ బాల్స్) తయారు చేశారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగింది.నేషనల్ గ్రీన్ కార్ప్ ఇంచార్జి బి ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో విత్తన బంతులు తయారు చేశారు. ఈ విత్తన బంతుల తయారీకి ఎరుపు బంక మట్టి, కంపోస్ట్ ఎరువు మరియు నీళ్లు తగుపాళ్ళలో కలిపిమట్టిని పిసికి ముద్దలు వచ్చేవిధంగా చేస్తూ విత్తనాలను మట్టిలో పెట్టి ఉండలా చుట్టి నీడలో ఆరబెట్టి జాగ్రత్తగా నిల్వ చేసి,వర్షాకాలంలో నేల మెత్తబడిన తర్వాత అడవిలో అక్కడక్కడ విసిరితే అవి మొలకెత్తి రాబోయే కాలంలో వృక్షాలుగా పెరిగే అవకాశం ఉండి పచ్చదనం మరింత పెరిగి పర్యావరణ పరంగా మేలు జరిగే అవకాశం ఉంటుందని ప్రభాకర్ రెడ్డి అందరికివివరించారు.ఈరోజు దాదాపు 500 పైచిలుకు విత్తన బంతులు తయారు చేసారని,ఈ అకాడమిక్ ఇయర్ చివరివరకు దాదాపు 5000 సీడ్ బాల్స్ తయారు చేయించి అటవీ శాఖ అధికారుల సూచనలతో వర్షాలు కురుస్తున్న సమయంలో అడవిలో వేయించి పర్యావరణ పరిరక్షణ మరియు అడవుల సంరక్షణలో మేముభాగస్వామ్యంఅవుతామని ప్రమాణం చేయించారు. ఈ విత్తన బంతుల తయారి కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి,రాజయ్య, దేవేందర్ రెడ్డి, రమేష్,లచ్చయ్య, అనిల్ కుమార్, సమ్మయ్య, అనిత, కవిత, కిరణ్ కుమార్, కోటేశ్వర్, శ్రీనివాస్ మరియు వెంకటేశ్వర్లు ఇంకా పాల్గొన్నారు.ఈనాటి విత్తన బంతులే రేపటి మహా వృక్షాలని మహాదేవపూర్ అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రాజేశ్వర్ మరియు ఫారెస్ట్ బీట్ ఆఫిసర్ సదానందం విద్యార్థులను అభినందించారు.

# దేవాదుల కాలువ భూసేకరణ పరిశీలించిన ఆర్.డి. ఓ.



**తిరుమలగిరి, మార్చి 20 (మనం న్యూస్):** దేవాదుల ప్రాజెక్టు కాలువల నిర్మాణంలో భాగంగా మైనర్ డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ అధికారులు తిరుమలగిరి మండలంలో సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా 12 టిఈ పరిధిలోని 2ఆర్ కాలువ, 11ఆర్ పరిధిలోని 2ఆర్, 3ఆర్, 4ఆర్ మైనర్ డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సంబంధించి భూసేకరణ పనులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కాలువల నిర్మాణం కోసం సేకరించాల్సిన భూమి, సర్వే నంబర్లు, సరిహద్దుల గురించి స్థానికంగా వివరాలు సేకరించారు. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, కాలువ పనులను వేగవంతం చేయాలని చర్చించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరిప్రసాద్, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# 5 ఎకరాల వరి పంటకు గడ్డి మందు కొట్టిన వ్యక్తులు

- దాచారంలో మహిళా రైతు ఆవేదన
- అన్నదాతకు 5 లక్షల ఆస్తి నష్టం



**నేరేడుచర్ల, మార్చి 20 మనం న్యూస్:** నేరేడుచర్ల మండలం దాచారం గ్రామంలో 5 ఎకరాల 14 గుంటల వరి పంటకు గడ్డి మందు కొట్టడంతో ఎండి పోయిందని, తద్వారా తనకు రూ. 5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని నేరేడుచర్ల మండలం దాచారం గ్రామానికి చెందిన మహిళా రైతు పేరాల శ్రీదేవి తెలిపారు. శ్రీదేవి శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2003లో తాను పొలం కొనుగోలు చేశానని అప్పటి నుంచి తాను భూమి సాగు చేసుకుంటుండగా, 2018లో ధరణిలో తనకు కొత్త పాసుపుస్తకం రాలేదని తెలిపారు. తనకు తెలియకుండా పట్టా మార్పు జరగడంతో తనకు అనుమానం వచ్చి కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. తనకు అనుకూలంగా 2025లో తీర్పు రావడంతో వరి సాగు చేసుకుంటున్నానని తెలిపింది. ఇదే తీర్పు ఆధారంగా తనకు కొత్త పాసుపుస్తకం వచ్చిందని తెలిసింది. తనకు వ్యతిరేకంగా ఉన్న కోట్ల సునీత, కోట్ల వెంకటరెడ్డితో పాటు మరికొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 16న తన పొలానికి గడ్డి మందు కొట్టారని తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి పొలం పూర్తిగా ఎండిపోవడంతో అనుమానం వచ్చి వెంటనే అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గురువారం రాత్రి పొలంలోని స్టార్టర్లు కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకు పోయారని తెలిపారు. ఈ సంఘటనపై తగు విచారణ చేసి తనకు న్యాయం చేయాలని నేరేడుచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ రవీందర్ వివరణ:- ఈ విషయంపై స్థానిక ఎస్ఐ రవీందర్ను వివరణ కోరగా శ్రీదేవి తన పొలానికి గడ్డి మందు కొట్టారని ఫిర్యాదు చేసిందని తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతామని, ఈ విషయంపై స్థానిక తహసీల్దార్, వ్యవసాయాధికారులకు కూడా సమాచారం అందించినట్లు తెలిపారు. బాధ్యులైన వారిని అరెస్టు చేయనున్నట్లు తెలిపారు.

# మహిళలు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**మహాదేవపూర్ మార్చి 20 మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామపంచాయతీ పరిధిలో కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున మహిళలు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజయలక్ష్మి శంకర్ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మంథని నియోజకవర్గ పరిధిలోని గ్రామాలలో మంత్రి శ్రీధర్ బాబు మహిళల కోసం సెల్ఫ్ అలీఫ్ సంస్థల భాగస్వామ్యంతో మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు పొందడానికి ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని దృఢ సంకల్పంతో మంత్రి ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే ఈ సదవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజయలక్ష్మి శంకర్ గ్రామ మహిళలను కోరుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు మరియు మండల అధికారుల తో కలిసి ప్రారంభించడం జరిగింది. ప్రస్తుత బ్యాచ్ లో 25 మంది మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మిగతా మహిళలు అప్లై చేసుకుంటే గ్రూపులుగా చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. పలుగుల గ్రామపంచాయతీలో ఇంత పెద్ద ఎత్తున మహిళల కోసం కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రూపకల్పన చేసిన మంత్రి శ్రీధర్ బాబు కి పలుగుల గ్రామపంచాయతీ తరపున మరియు గ్రామ మహిళల పక్షాన సర్పంచ్ విజయలక్ష్మి శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఐకెపి ఎపిఎం రాజన్న, కమ్యూనిటీ కోఆర్డినేటర్ శశి, ఉప సర్పంచ్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ సుధాకర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పైలెట్ బ్రదర్స్ కస్టడీపై కోర్టులో విచారణ



- తీర్పు..ఈనెల 23కి వాయిదా

**హైదరాబాద్,మార్చి 20(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసులో నిందితుల కస్టడీ పిటిషన్‌పై శుక్రవారం విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఉప్పర్ పల్లి కోర్టు ఈ పిటిషన్‌పై తీర్పును సోమవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన పైలట్ రోహిత్ రెడ్డి , రితీష్ రెడ్డి, నమిత్ శర్మలను విచారించేందుకు వారం ఱుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన వ్యవహారానికి సంబంధించి మరిన్ని కీలక ఆధారాలు సేకరించాల్సి ఉందని, నిందితుల నుంచి సమాచారం రాబట్టడం అత్యవసరమని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. నిందితుల తరపు లాయర్లు కస్టడీని వ్యతిరేకించగా, కేసు తీవ్రత దృష్ట్యా వారం రోజుల పాటు పోలీసు కస్టడీ అవసరమని ప్రభుత్వ తరపు న్యాయవాదులు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తుది తీర్పును వచ్చే సోమవారం నాటికి రిజర్వ్ చేసింది. తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో కీలకమైన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రంజిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేష్‌రెడ్డిలతో పాటు ఢిల్లీ వ్యాపారి నమిత్ శర్మలు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారని, వీరిని కస్టడీలో తీసుకుని విచారిస్తే మిగిలిన నిందితుల పాత్ర వెలుగులోకి వస్తుందని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం కోర్టు ఇచ్చే తీర్పుతో ఈ కేసులో తదుపరి విచారణకు అత్యంత కీలకం కానుందని పోలీసులు వివరించారు.

# అర్ధరాత్రి సైకోల వీరంగం



- ఇంటిముందు పార్క్ చేసిన వెహికల్స్ విధ్వంసం
- డీసీఎం లో నిలిపి ఉంచిన మద్యం చోరీ
- షాప్ ల ముందు ఏర్పాటు చేసుకున్నఫ్లెక్సీలు ధ్వంసం

**నేరేడుచర్ల, మార్చి 20 మనం న్యూస్:** నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో ఇటీవల సైకోలు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి గంజాయి మత్తులో మద్యం మత్తులో తిరుగుతూ ప్రజల ఆస్తులను నష్టపరుస్తున్నారు. పాత శ్రీనివాస థియేటర్ స్థలంలో ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్న మలిగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న కారుని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో ధ్వంసం చేశారు. గొడ్డలి సైతం కారు పైన ఇరుక్కో వడంతో వదిలి వెళ్లారు. కారు దగ్గరలో నిలిపిన ఆటోను సైతం గ్లాసు పగలగొట్టాడు. వారం రోజుల క్రితం అదే ఇంటి ముందు నిలిపి ఉంచిన టూ వీలర్ బైక్ సైతం ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు.గత మూడు రోజుల క్రితం నేరేడుచర్ల పట్టణ కేంద్రానికి చెందిన మద్యం వ్యాపారి ఒకరు తన ఇంటి ముందు నిలిపిన డీసీఎం వ్యాన్ లో సుమారు 80,000 రూపాయల విలువ గల మద్యం మాయమైనట్లు గుర్తించారు. గత 15 రోజుల క్రితం హుజూర్నగర్ రోడ్డు నందుగల ఐదు వ్యాపార సముదాయాల ముందు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను ముగ్గురు టీనేజీ యువకులు గంజాయి మత్తులో ధ్వంసం చేశారు. మూడు రోజుల తర్వాత వారిని గుర్తించిన వ్యాపారులు గట్టిగా మందలించడంతో తప్పుయింది అని ఒప్పుకోవడంతో వదిలిపెట్టారు. ఇలా రాత్రులలో జరగడంతో పట్టణ ప్రజలు భయపడుతున్నారు. పోలీస్ వారు రాత్రిపూట పెట్రోలింగ్ చేయాలని కోరుతున్నారు. ఎస్సై రవీందర్ నాయక్ వివరణ రాత్రివేళ పెట్రోలింగ్ చేస్తూనే ఉన్నాము అనుమానాస్పదంగా తిరిగే వాళ్లని విచారిస్తున్నాము. మద్యం చోరీ విషయం విచారణలో ఉంది


# శ్రద్ధగా చదవాలి.. ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి



- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల , మార్చి -20(మనం ప్రతినిధి ):** విద్యార్థులు నిత్యం శ్రద్ధగా చదవాలని, ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకళాశాలలో కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, సిబ్బంది హాజరు రిజిస్టర్, కిచెన్, స్టోర్ రూం పరిశీలించారు. స్టోర్ రూమ్ లో సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఆహార పదార్థాలను పరిశీలించారు. హాస్టల్ ఆవరణలో పలు అభివృద్ధి పనుల పురోగతి పై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులను పరీక్షల మధ్య విరామ సమయం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. శ్రద్ధగా అన్ని పాఠ్యాంశాలు మరోసారి చదవాలని, సమాధానాలు రాయాలని సూచించారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్ట్ లలో పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు




- బడ్జెట్‌లో ప్రతిపాదించిన భట్టి

**హైదరాబాద్, మార్చి 20 :** శాసన సభలో పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖకు రూ.13,679 కోట్ల నిధుల కేటాయింపు చేస్తున్నామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం అయిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్)ను ప్రారంభిస్తున్నట్టు భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు 421 ఎంప్యానెల్ ప్రయివేట్ ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చికిత్స పొందవచ్చని తెలియజేసారు. ఇందులో భాగంగా ప్రతి ఉద్యోగికి డిజిటల్ కార్డు అందిస్తామని వెల్లడించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 3 టిమ్స్ ఆసుపత్రులను ఈ ఏడాది చివరికి ప్రారంభిస్తామని అన్నారు. అంతేకాకుండా నిమ్స్ ఆసుపత్రి విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తో సహా మొత్తం 6,582 టెర్షియరీ కేర్ బెడ్లు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో ఇప్పటికే 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ స్కూల్స్, 28 పారా మెడికల్ కాలేజీలను ప్రారంభించినట్టు భట్టి తన ప్రసంగంలో వివరించారు.

# స్వయం ఉపాధితో..ఉన్నత శిఖరాలు

- సాంకేతికత చేయూతతో ఆర్థికంగా ఎదగాలి
- మహిళలను ప్రోత్సహించడంలో అలీప్ కీలక భాగస్వామ్యం
- జిల్లాలో రైజ్ కేంద్రం ద్వారా ఔత్సాహికులకు ప్రోత్సాహం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

( విజయవాడ,మనం బ్యూరో ) స్వయం ఉపాధి.. వ్యక్తిగత స్వావలంబన, ఆర్థిక స్వేచ్ఛకు, సమాజ అభివృద్ధికి కీలక మార్గమని.. సొంతంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం ద్వారా మహిళలు తమ ప్రతిభను వెలికితీసి, ఉన్నతంగా ఎదిగేందుకు పెద్ద ఎత్తున అవకాశముంటుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో పాటు ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ల అభివృద్ధి లక్ష్యంగా అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) వి కార్ట్ ఎగ్జిబిషన్, భాగస్వాముల సదస్సు శుక్రవారం విజయవాడలోని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ అండ్ కేటరింగ్లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ జాయింట్ సెక్రటరీ మెర్సీ ఎపావో, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జెడ్పీ మాజీ ఛైర్మన్ గద్దె అనూరాధ హాజరయ్యారు. డీఆర్డీఏతోపాటు వివిధ మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆయా యూనిట్ల వ్యవస్థాపకులతో మాట్లాడి వ్యాపార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థిక సహాయం, శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా సమాజ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. మహిళలను పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సహించడంతో పాటు వారిని విజయం దిశగా చేయిపట్టి నడిపించడంలో అలీప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలోని గుంటుపల్లిలో రైజ్ కేంద్రం ద్వారా కూడా ఔత్సాహిక మహిళలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అలీప్ అధ్యక్షురాలు రమాదేవి కన్నెగంటి మాట్లాడుతూ అలీప్- పే నియర్ బై మధ్య ఎంవోయూ కుదిరిందన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని.. వివిధ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ, వ్యాపార అవకాశాలు, మహిళా సాధికారత, హ్యాకథాన్, ఆర్థిక అవగాహన వంటి అంశాలపైనా చర్చోపచర్చలు జరుగుతాయని వివరించారు. ఎంఎస్ఎంఈల బలోపేతానికి, మహిళల ఆర్థిక పురోగతికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో



డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, అలీప్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హోటల్ పై రెవెన్యూ పోలీస్ అధికారులు దాడులు

- 8 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

గొల్లప్రోలు, మార్చి 20 మనం ప్రతినిధిః మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణం పరిధి మెయిన్ రోడ్ లో పలు హోటల్ పై శుక్రవారం గొల్లప్రోలు తాసిల్దార్ కుమార్ దాడులు నిర్వహించి8 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు గల్ఫ్ దేశాల్లో యుద్ధం కారణంగా ఏర్పడిన గ్యాస్ కొరతను వారించేందుకు కాకినాడ జిల్లాలో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు కాకినాడ ఆర్టీవో మల్లి బాబు ఆదేశాల మేరకు గొల్లప్రోలు తాసిల్దార్ రామ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ పోలీస్ సిబ్బంది భోజనం హోటల్ లో టీ స్టాళ్లు హోటల్స్ ఫుడ్ సెంటర్లపై దాడులు చేసి కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకుబదులుగా డొమెస్టి క్ .గ్యాస్ సిలిండర్లను అనధికారికంగా వినియోగిస్తున్నట్లుగా గుర్తించిన8. వంట సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు తనిఖీల్లో పట్టుబడిన8 సిలిండర్లనుభద్రపరిచేందుకుస్థానిక గ్యాస్



గొడవనకుఅధికారులు తరలించినట్లు తెలిపారు సివిల్ సప్లైస్ అధికారుల పరిశీలన అనంతరం అక్రమంగా గ్యాస్ వినియోగిస్తున్న హోటల్స్ పై6.అ. కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఈ దాడుల్లో డిప్యూటీ తాసిల్దార్ సౌజన్య ఆర్ ఐ. బాలకృష్ణ గొల్లప్రోలు పర్సనల్ ఎస్త్రు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడవసారి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులుగా లంక



- అంబరాన్నిఅంటిన సంబరాలు

మైలవరం మార్చి 20 మనం న్యూస్: స్థానిక మండలం లో మూడవ సారి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులుగా లంక లితీష్ నియమితులైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కటింగ్, పూలమాలల సత్కారాల మధ్య అభిమానుల ఆనందోత్సాహాలు అంబరాన్ని తాకాయి.

## సముద్రస్నానానికి వచ్చి యువకుడు గల్లంతు



అల్లవరం మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధి: అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో ఉన్న బీచ్ కి సరదగా సముద్ర స్నానం కోసం వెళ్లిన నలుగురు యువకుల్లో ప్రమాదవశాత్తూ ఓ యువకుడు సముద్రంలో గల్లంతయ్యాడు. గల్లంతైన యువకుడు అమలాపురం పట్టణంలోని నారాయణపేటకు చెందిన దొమ్మేటి లోకేష్(16) గా గుర్తించారు. గల్లంతైన యువకుడి స్నేహితులు పోలీసులకు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నారాయణపేటకు చెందిన నలుగురు స్నేహితులు శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సరదాగా ఓడలరేవు సముద్రం వద్దకు వచ్చారు. ఓఎన్జీసీ టెర్మినల్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో సముద్రకోత నియంత్రణకు నిర్మిస్తున్న గ్రోయన్ల మీద ఎక్కి చివరన స్నానాలు చేసేందుకు ప్రయత్నించారని, ఆసమయంలోనే కాలుజారి లోకేష్ సముద్రంలో పడిపోయాడని తెలిపారు. కొన్ని క్షణాల్లోనే సముద్రంలో మునిగి గల్లంతయ్యాడని తెలిపారు. సమాచారం అందుకున్న ఓడలరేవు మెరైన్ పోలీసులు హుటాహుటీన ఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడికోసం గాలించారు. అయినప్పటికీ లోకేష్ దొరకలేదు. ఈ ఘటనపై అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

# పులి చంపిన మూడూ పశువులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లింపు..

శంఖవరం మార్చి 20 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా లోని శంఖవరం మండలంలో పెద్దపులి సంచారం చేసిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సంచరించిన రాయల్ బెంగాల్ టైగర్ చంపిన మూడు పెంపుడు మూగ జీవాల యజమానులకు నష్ట పరిహారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ పంపిణీ చేసింది. పులి దాడిలో మొత్తం మూడు పెంపుడు జంతువులకూ కలిపి మొత్తం రూ. 66,000 లను నష్ట పరిహారంగా ప్రభుత్వం డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో శుక్రవారం చెల్లించింది. ఈ పులి జిల్లాలో 10 రోజుల పాటు సంచరించి ఈ మార్చి 12 న తాడువాయి గ్రామంలో నెక్కంటి శ్రీనివాసరావు గేదె దూడను పులి దాడిచేసి చంపి నందుకు ఈ బాధితునికి నష్ట పరిహారంగా రూ. 16,000 లు, 13 న అచ్చింపేట గ్రామంలో బొట్టా చినసత్యనారాయణ ఆవు దూడను పులి చంపినందుకు నష్టం పరిహారంగా రూ. 25,000 లు, 15 న మండపం గ్రామంలో పోలం తమ్మయ్య గేదె దూడను పులి చంపినందుకు కూడా నష్టం పరిహారంగా రూ. 25,000 లు చొప్పున విడివిడిగా డి.డి రూపంలో ప్రభుత్వం అందజేసింది. ఈ డిడిలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



చేతులు మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. పులి దాడిలో చనిపోయిన పశువులకు నష్టపరిహారాన్ని సకాలంలో మంజూరు చేయించడంలో అతి వేగంగా నష్ట పరిహారాన్ని పంపిణీ చేయడంలోనూ కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు చూపిన చొరవ శ్లాఘనీయం. ప్రస్తుతం పులి రాజవొమ్మంగి అటవీశాఖ రేంజ్ పరిధిలోనికి వెళ్ళిపోయిందని ఈ నష్టపరిహారాన్ని పంపిణీ సందర్భంగా అటవీశాఖ అధికారులు మీడియా ముఖంగా ప్రకటించారు. ఈ నష్టపరిహారం పంపిణీ కార్యక్రమంలో ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గ రాంప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జాన్సన్, శంఖవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి గంటిమళ్ళ నాగేశ్వరరావు, రౌతులపూడి ఫారెస్ట్ సెక్షన్ అధికారి పైడా శ్యాంకుమార్, కొత్తూరు అటవీ బీట్ ఆఫీసర్ పెయ్యల వెంకటరమణ, బవురువాక అటవీ బీట్ ఆఫీసర్ బుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సౌకర్యమే నా ప్రాధాన్యత - వియంసి స్పెషల్ ఆఫీసర్ డా. జి. లక్ష్మీశా

(విజయవాడ,మార్చి,20,మనం ప్రతినిధి) విజయవాడ నగరపాలక సంస్థ(వియంసి) స్పెషల్ ఆఫీసర్గా డా. జి. లక్ష్మీశా శుక్రవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్పెషల్ ఆఫీసర్ చాంబర్లో శుక్రవారం దుర్గగుడి ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఎంసీ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీఎంసీ స్పెషల్ ఆఫీసర్ మరియు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనను స్పెషల్ ఆఫీసర్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ నగరాన్ని సీఎం ఎప్పుడు 'గేట్ వే టు అమరావతిగా' పేర్కొంటారని , అందుకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రజా సౌకర్యాలను విస్తరించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి,



నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు మరియు వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. నగరాభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యత ఉన్న అంశాలను గుర్తించి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు మరియు ఇతర కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షణలో నగర స్థాయిని నిలుపుకోవడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి, వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వివిధ శాఖలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈవో శీనా నాయక్, అడిషనల్ కమిషనర్లు డా. డి. చంద్రశేఖర్, ఎ. రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇన్చార్జ్) పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె.శ్రీనివాస్,ఏ. శ్రీనివాసరెడ్డి, జి సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ గోపాల నాయక్, డాక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ కమిషనర్లు ఏ యు బి శర్మ, హెలెన్, డి ఎస్ ఎస్ శ్రీనివాస్ , బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, మేనేజర్ ప్రభావతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# డెంగ్యూ, మలేరియా నివారణకు 'ఫ్రైడే డ్రైడే' సర్వే కీలకం

- జిల్లా మలేరియా అధికారి ప్రభాకరరావు..

శంఖవరం, మార్చి 20 మనం ప్రతినిధిః వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే సమాజం సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించగలదని జిల్లా మలేరియా అధికారి ప్రభాకరరావు పేర్కొన్నారు. మండలంలోని కత్తిపూడి గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను సమీక్షించారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించిన ఆయన, ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటి గుంతలు, డ్రైనేజీ వ్యవస్థ పరిస్థితిని పరిశీలించారు. దోమల పెరుగుదలకు కారణమయ్యే నిల్వ నీటిని వెంటనే తొలగించాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా ఇంటి లోపల, బయట వారానికి మించి నిల్వ ఉండే నీటి పాత్రలు, పాత టైర్లు, కుండలు, నీటి ట్యాంకులు వంటి వాటిని తరచుగా శుభ్రం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రైనేజీ కాల్వల్లో మురుగు నీరు నిల్వ కాకుండా పారే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామస్థులు స్వచ్ఛందంగా శుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి జ్వరాలతో బాధపడుతున్నవారిని గుర్తించి,



అవసరమైన పరీక్షలు నిర్వహించి, రక్త నమూనాలను ల్యాబ్కు పంపించాలని ఆదేశించారు.

# గరిక పాటి వ్యాఖ్యలు ఖండించిన సర్పంచ్

కాత్రేనికోన మార్చి 20 మనం ప్రతినిధిః మధ్యాహ్న భోజన పథకం గురించి గరికపాటి నరసింహారావు ఇటీవల చేసిన చేసిన వ్యాఖ్యలను కాత్రేనికోన సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అనేది పేద కుటుంబాల పిల్లలకు పోషకాహారం అందించే అత్యంత ముఖ్యమైన సంక్షేమ కార్యక్రమమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నాయని, అలాంటి కుటుంబాల పిల్లలకు స్కూల్లో అందే మధ్యాహ్న భోజనం వారి ఆరోగ్యం, చదువుకు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పథకాలపై బాధ్యతగల వ్యక్తులు వ్యాఖ్యలు చేసే సమయంలో సమాజంలోని పేదల పరిస్థితులను గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పేద పిల్లలకు అందుతున్న



పోషకాహార పథకాన్ని తక్కువ చేసి మాట్లాడటం సమంజసం కాదని సుధాకర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు, వారి ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, దాని ప్రాముఖ్యతను గుర్తించి అందరూ బాధ్యతగా మాట్లాడాలని సుధాకర్ సూచించారు.



# ఎన్హెచ్-16పై ప్రమాద నివారణకు ప్రత్యేక చర్యలు

## జగ్గంపేట సర్కిల్ పరిధిలో బ్లాక్ స్పాట్స్ గుర్తింపు

కిర్లంపూడి మార్చి 20 ( మనం న్యూస్ ) : ఎన్హెచ్-16పై రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక పరిశీలన చేపట్టారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం సబ్డివిజన్ ఇన్చార్జ్ ఎస్డీపీఓ కెవివి సత్యనారాయణ ఆధ్వర్యంలో జగ్గంపేట సర్కిల్ పరిధిలోని ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. తిరుపతి, పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి బ్లాక్ స్పాట్స్ను పరిశీలించారు. ఇటీవల జరిగిన ప్రమాద స్థలాలను అధికారులు ప్రత్యక్షంగా సందర్శించి ప్రమాదాలకు దారితీసే కారణాలను విశ్లేషించారు. ప్రమాదకరంగా ఉన్న డివైడర్లను గుర్తించి, అనుమతులు లేని డివైడర్లను మూసివేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. దాబాలు, హోటళ్ల వద్ద వాహనాలను రహదారిపై నిలిపితే సంబంధిత యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జెడ్ రాగంపేట, తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి గ్రామాల పరిధిలోని ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాహనదారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, అందరూ అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని అధికారులు కోరారు.

## దుకాణాలపై రెవెన్యూ దాడులు



యు.కొత్తపల్లి మండలం మనం న్యూస్ః హోటల్స్ నిర్వాహకులు కమర్షియల్ సిలిండర్లకు బదులుగా గృహ అవసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లు వాడుతున్నారనే సమాచారం రావడంతో పోలీస్ సిబ్బంది సహకారంతో యు కొత్తపల్లి తాహసిల్దార్ జి.చిన్నారావు తనిఖీలు నిర్వహించి ఆరు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బుకింగ్ విషయంలో సమన్య ప్రజలు గ్యాస్ సిలిండర్ల ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఈ తనిఖీల్లో 6 సిలిండర్ లను స్వాధీనం చేసుకుని హోటల్ నిర్వాహకులపై 6అ కేసు నమోదు చేశామని తహసిల్దార్ జి. చిన్నారావు తెలిపారు.

# ప్రపంచానికి భారతదేశం ఆదర్శంగా నిలుస్తుంది

- 140 కోట్ల ప్రజల సంక్షేమమే మా కూటమి లక్ష్యం
- ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం ప్రగతి సాధిస్తుంది
- కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి జి. కిషన్ రెడ్డి

తిరుమల,మార్చి 20, మనం న్యూస్ : కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి శుక్రవారం వేకువ జామున నిర్వహించే అభిషేక సేవలో కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి జి. కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్సు నుండి ఆలయం మహాద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

దర్శనం అనంతరం ఆలయం వెలుపల తనను కలిసిన మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరం అయినా శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా శ్రీవారి పాదాల చెంత గడపడం తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. దేశం మొత్తం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నానని తెలిపారు. ముఖ్యంగా మన దేశానికి వెన్నుముకైనా రైతులకు ఈ ఏడాది మంచి పంటలు పండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో రాష్ట్రం, దేశం తులతూగాలని స్వామివారిని మనసారా ప్రార్థించానని తెలిపారు.

ప్రస్తుత ప్రపంచ పరిణామాలపై స్పందిస్తూ, అంతర్జాతీయంగా అనేక దేశాలు యుద్ధ మేఘాలు, ఆర్థిక సంక్షోభాలు, ఉద్రిక్త పరిస్థితుల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అస్థిరమైన ప్రపంచ వాతావరణంలో భారతదేశం మాత్రం శాంతికి చిరునామాగా నిలుస్తుందని ఆయన గర్వంగా ప్రకటించారు. ఆధ్యాత్మికత, అభివృద్ధి, శాంతి అనే మూడు సూత్రాల సమన్వయంతో భారతదేశం ప్రపంచానికి దిక్సూచిగా మారుతుందని ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం గత పదేళ్లుగా అప్రతిహతంగా ప్రగతి పదంలో దూసుకుపోతుందని కేంద్రమంత్రి



కొనియాడారు. 140 కోట్ల మంది భారతీయుల సంక్షేమమే తమ ప్రభుత్వ పరమావధి అని, పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. దేశాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రధాని మోడీకి శ్రీవారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆయన సంకల్ప బలానికి మరింత శక్తిని ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు.

# మూడో టీ20 మ్యాచ్‌లో కివీస్ ఘన విజయం



సౌతాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్ లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 137 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్ జట్టు 16.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్ ను అందుకుంది. ఓపెనర్ టామ్ లాథమ్ (55 బంతుల్లో 63 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) యాంకర్ రోల్ పోషించాడు. మరో ఓపెనర్ డెవాన్ కాన్వే (39) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. ప్రొటీస్ బ్యాటర్లలో టెయిలెండర్ కొబాని మొకినా (26 నాటౌట్) టాప్ స్కోరర్ గా నిలవగా, జార్జ్ లిండే (23) పర్వాలేదనిపించాడు. అయితే సౌతాఫ్రికా టాపార్డర్, మిడిలార్డర్ పూర్తిగా విఫలం కావడంతో సఫారీలు సాధారణ స్కోరుకే పరిమితమయ్యారు. కివీస్ బౌలర్లలో కైల్ జేమీసన్, మిచెల్ సాంట్నర్, బెన్ సియర్స్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అయితే తొలి రెండు టీ20 మ్యాచ్ లతో పోలిస్తే ఈ మ్యాచ్ లో న్యూజిలాండ్ ఛేదనలో స్పష్టమైన ఆధిపత్యం కనబరిచింది. కాన్వే, టామ్ లాథమ్లు తొలి వికెట్ కు 96 పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత కాన్వే ఔటైనా లాథమ్ చివరి వరకు నిలిచి జట్టుకు స్పష్టమైన విజయాన్ని అందించాడు. పొదుపుగా బౌలింగ్ చేసిన లోకీ ఫెర్గూసన్ ను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు వరించింది. ఈ మ్యాచ్ విజయంతో న్యూజిలాండ్ ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.

# ఐపీఎల్‌కు మూడో ర్యాంకు..

సంపదపరంగా ప్రపంచంలోనే అత్యంత విలువైన టీ20 లీగ్ ఐపీఎల్. ఇందులో ఒక్కసారి చోటు దక్కించుకుంటే ఆటగాళ్లకు కాసుల వర్షమే. అలాంటి లీగ్ కు వరల్ క్రికెటర్స్ అసోసియేషన్ మూడో ర్యాంకు ఇవ్వడం గమనార్హం. దీనిపైనే సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఐపీఎల్ లో అందుకొనే పారితోషికంలో కనీసం ఐదోవంతు కూడా ఉండని ది హండ్రెడ్ లీగ్ కు అగ్రస్థానం ఇచ్చింది. ఇటీవల ముగిసిన ది హండ్రెడ్ లీగ్ వేలంలో అత్యధిక ధరను సొంతం చేసుకొన్న క్రికెటర్ కు దక్కిన మొత్తం రూ.4.81 కోట్లు. అదే ఐపీఎల్ లో అయితే రూ.25 కోట్ల పైమాటే. కామెరూన్ గ్రీన్ను కోల్ కతా నైట్ రైడర్స్ రూ.25.20 కోట్లు వెచ్చించి మరీ సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా వేదికగా జరిగే ఎస్ఏ20 లీగ్ కూ ర్యాంకింగ్స్ లో రెండో స్థానం దక్కింది. ఇక్కడా టాప్ ప్లేయర్కు వచ్చిన మొత్తం కేవలం రూ. 8.3 కోట్లే. అంటే ఐపీఎల్ లో దేశవాళీ క్రికెటర్ దక్కించుకున్న రూ.12.40 కోట్ల కంటే చాలా తక్కువే. ఇలాంటి లీగ్ కు మూడో స్థానం ఇవ్వడమేంటని అభిమానుల నుంచి కామెంట్లు వస్తున్నాయి. ర్యాంకులను ప్రకటించేందుకు డబ్ల్యూసీఏ కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంది. వాటిని క్రోడీకరించి 100 పాయింట్లకు ఎవరికి ఎంత ఇవ్వాలో నిర్ణయించింది. ఆటగాళ్లకు జీత భత్యాలు, సెక్యూరిటీ, హక్కులు, వృత్తిపరమైన ప్రమాణాలు.. ఇలాంటివాటిని ఎంచుకొని పాయింట్లను కేటాయించింది. ఆటగాళ్లు, వారి అసోసియేషన్లు, ఏజెంట్ల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని ర్యాంకులను ప్రకటించింది.



**ఎవరికి ఏ స్థానమంటే?**

ది హండ్రెడ్ - 75.2
ఎస్ఏ20 - 68.0
ఐపీఎల్ - 62.6
బిగ్ బాష్ లీగ్ - 62.5
పీఎస్ఎల్ - 48.0
మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్సీ) - 43.0
ఐఎల్ టీ20 - 39.1
సీపీఎల్ - 38.9
అబుదాబి టీ10 - 30.1
బీపీఎల్ - 22.6

ఐపీఎల్ కు తగ్గిందిలా..

ఆటగాళ్లకు ఇచ్చే మొత్తం, చెల్లింపుల వ్యవహారంలో ఐపీఎల్ కు పూర్తి మార్కులు పడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ లో ఐపీఎల్ కు ఉన్న ఆర్థికబలం మరే జట్టుకు లేదని డబ్ల్యూసీఏ పేర్కొంది. అయితే, ఆటగాళ్ల హక్కుల రక్షణకు సంబంధించి ఐపీఎల్ కు తక్కువ మార్కులు వచ్చాయి. ఈవిషయంలో ఇంకాస్త మెరుగుకావాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు లీగ్ ల కృషి మరువలేనిదని డబ్ల్యూసీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టామ్ మోఫాట్ తెలిపారు. ఇప్పుడీ ర్యాంకుల ఉద్దేశం ఆయా లీగ్ లను తక్కువ చేయడం కాదని.. మరింత విజయవంతంగా మారేందుకు అవసరమైన సాయం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.



# పెద్దిపై మళ్లీ షాకింగ్ రూమర్స్!

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో చేస్తున్న సాలిడ్ సినిమానే పెద్ది. భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా దాదాపు షూటింగ్ పూర్తి చేసుకుంది. అయితే ఈ సినిమా నిజానికి ఈ మార్చ్ 27నే విడుదల కావాల్సి ఉంది కాని ఓ నెల వెనక్కి వాయిదా వేశారు. ఇక ఈ కొత్త డేట్ గా ఏప్రిల్ 30న గ్రాండ్ గా విడుదలకి ఫిక్స్ చేశారు. అయితే పెద్ది ఈ డేట్ లో కూడా రాదు అన్నట్టు మరోసారి షాకింగ్ రూమర్స్ మొదలయ్యాయి.

దీనితో మెగా అభిమానుల్లో మరోసారి కలవరం మొదలైంది. ఆల్రెడీ ఈ సినిమా కోసం ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎగ్జైటెడ్ గా ఎదురు చూస్తున్నారు. మళ్లీ వాయిదా.. అందులో ఇంకా దూరంగా వెళుతుంది అంటే సినిమాపై ఉన్న హైప్ కి కూడా దూరం పెంచినట్టే అవుతుంది. ఎంత వీలైతే అంత త్వరగా సినిమా విడుదల చేసుకోవడమే మంచిది. ఎంత హైప్ ఉన్న సినిమాలు అయినా ఆన్ టైం రాకపోతుంటే వాటి ప్రభావం క్రమంగా తగ్గిపోతుంది. సో మేకర్స్ ఇలాంటి మిస్టేక్ లు చేయకుండా ఉంటేనే బెటర్.

# పరాభవ వేళా... ప్రతిభకు పట్టం

## వైభవంగా గద్దర్ సినీ పురస్కారాల ప్రదానం

తెలుగు సినిమా దేశ సరిహద్దులు దాటి సత్తా చాటుతున్న వేళ ఇది. భాషతో సంబంధం లేకుండా... ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు వినోదాలు పంచుతూ అలరిస్తోంది. ఎక్కడకు వెళ్లినా... ఏ నోట విన్నా ఇప్పుడు సినిమా ముచ్చటే! అలా రచ్చ గెలిచేసిన మన సినిమాకి ప్రోత్సాహంగా ఇంట సంబరం జరపకపోతే ఎలా? అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ఏర్పాటు చేసి రెండేళ్లుగా ఘనంగా ప్రదానం చేస్తోంది. ఉగాది అనగానే గతంలో తెలుగు ప్రేక్షకులు.. చిత్రసీమ సినీ పురస్కారాల పండగని గుర్తు చేసుకొనేది. పలు కారణాలతో మధ్యలో పద్నాలుగేళ్లపాటు ఈ పురస్కారాలకు నోచుకోలేకపోయింది తెలుగు సినిమా. గతేడాది నుంచి సినిమా రంగంలోని ప్రతిభకు పట్టం కడుతూ... ఉత్తమ చిత్రాల రూపకల్పన కోసం ప్రోత్సాహాన్ని అందించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ప్రదానం చేస్తోంది. గత ఆనవాయితీ మేరకే ఈసారి ఉగాది సందర్భంగానే గద్దర్ సినీ పురస్కారోత్సవం - 2025 వేడుకని నిర్వహించడం విశేషం. తెలుగు సంవత్సరాది రోజున... పురస్కారాల్ని చేతపట్టి సినీ తారలు, సాంకేతిక బృందాలు, దర్శకనిర్మాతలు మురిసిపోయారు. దక్షిణాది తారలతోపాటు... హిందీ తారలూ ఈ వేడుకలో పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆటపాటల తోనూ... ప్రసంగాలతోనూ వేడుక సందడిగా సాగింది.

**సందడే సందడి :**

సాంస్కృతిక కార్యక్రమాలు, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుక ఆద్యంతం సందడిగా సాగింది. అలనాటి తారలు సావిత్రి, శ్రీదేవి, సౌందర్య తదితరుల్ని గుర్తు చేస్తూ... కథానాయిక నిధి అగర్వాల్ వేదికపై చేసిన నృత్యాలు, గాయని మంగ్లీ ఆటాపాట, 'నాగబంధం'లోని నమోరే పాటకు నభా నటేశ్, దక్ష నాగర్కర్ నృత్యాలు, దేవిశ్రీప్రసాద్ హుషారెత్తించేలా పాడిన పాటలు, ఆయన మార్క్ సంగీత ప్రదర్శనలు వేడుకకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగుసినీ తారలు, పురస్కార గ్రహీతలతోపాటు హిందీ నుంచి వచ్చిన మాధురీ దీక్షిత్, జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ సందడితో వేడుక కళకళలాడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టీఎఫ్డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎఫ్.డి.సి ఎండీ సీహెచ్ ప్రియాంక తదితరులు విజేతలకు పురస్కారాల్ని ప్రదానం చేశారు.

**మా ఊరి కోడలు : సీఎం**

ఉత్తమ నటి పురస్కారం అందుకోవడానికి వేదికపైకి వచ్చిన రష్మిక మందన్నని 'మా ఊరి కోడలు...' అంటూ యాంకర్ సుమకి పరిచయం చేశారు రేవంత్ రెడ్డి. పురస్కారం అందుకున్న అనంతరం రష్మిక మాట్లాడుతూ ''రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్న ఈ పురస్కారం ఎంతో ప్రత్యేకం. ఒకప్పుడు నా నటనపై సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ వచ్చేవి. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం నా నటనని మెచ్చి పురస్కారం ఇచ్చింది'' అన్నారు. ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న నాగచైతన్య మాట్లాడుతూ ''పదహారేళ్ల సినీ ప్రయాణంలో ఇదెంతో ప్రత్యేకమైన గుర్తింపు. గద్దర్ గొప్ప వ్యక్తి, విప్లవకారుడు. ఆయన పేరు మీద ఏర్పాటు చేసిన ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది'' అన్నారు.

**గొప్ప నటుడు ఏఎన్నార్ : జయసుధ**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కథానాయకుడు నాగార్జున చేతులమీదుగా అక్కినేని నాగేశ్వరరావు పురస్కారం అందుకున్న జయసుధ మాట్లాడుతూ ''ఏఎన్నార్‌తోఎన్నో గొప్ప చిత్రాల్లో నటించాను. ఆయన హృదయానికి చికిత్స జరిగిన అనంతరం తిరిగి సినిమాల్లోకి వచ్చినప్పుడు 'ట్రెండ్ మారిపోయింది కదా, నటనలో ఏమైనా మార్పులు చేసుకోవాలా?' అంటూ అప్పుడప్పుడే పరిశ్రమలోకి వచ్చిన నటుడిలా అడిగేవారు. అంత గొప్ప నటుడు అంత సాధారణంగా ఉండటం మా అందరికీ ఓ గొప్ప పాఠం'' అన్నారు.

**నా జన్మ ధన్యం : ఆర్. నారాయణమూర్తి**

కాంతారావు పురస్కారాన్ని అందుకున్న ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ ''పదమూడేళ్లపాటు సినీ పరిశ్రమ పురస్కారాల కోసం ఎదురు చూసింది. అలాంటిది సూపర్స్టార్ కృష్ణ అభిమాని అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతేడాది పురస్కారాల్ని పునః ప్రవేశపెట్టి తెలుగు సినిమా ఉనికిని, కళాకారుల్ని గుర్తించి, గౌరవించినందుకు నా అభినందనలు. గద్దర్ ప్రజా వాగ్గేయకారుడు. ఆయన పేరుపై ఈ పురస్కారాల్ని అందించినందుకు నా సెల్యూట్. ఎన్టీఆర్, ఏఎన్నార్ తర్వాత అంతటి మరో హీరో కాంతారావు. తెలంగాణ గడ్డ బిడ్డ అయిన ఆయన పేరుపై పురస్కారాన్ని నాకు ఇచ్చి జన్మ ధన్యం చేశారు'' అన్నారు.

**గద్దర్ అభిమానుల్లో నేనూ ఒకడిని : కమల్**

బి.ఎన్. రెడ్డి పురస్కారానికి ఎంపికైన సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తరఫున కమల్హాసన్ పురస్కారాన్ని స్వీకరించడం విశేషం. పైడి జయరాజ్ పురస్కారాన్ని అందుకున్న కమల్హాసన్ మాట్లాడుతూ ''సింగీతం పురస్కారం అందుకున్నప్పుడు నాకు ఆయన 'సొమ్మొకడిది సోకొకడిది' సినిమా గుర్తుకొచ్చింది. గద్దర్కు ఉన్న మిలియన్లకొద్దీ అభిమానుల్లో నేను ఒకడిని. నా సినిమా కెరీర్లో నేను కలిసిన అత్యంత యువకుడైన సీనియర్ ఆయన. కవి, విప్లవకారుడైన ఆయన్ను గౌరవిస్తూ ఈ పురస్కారం ఏర్పాటు చేయడంతోనే మా అందరికీ గౌరవం దక్కినట్టైంది.''అని కమలహాసన్ అన్నారు.

**ముఖ్య మంత్రికి రుణపడి ఉంటాం : చిరంజీవి**

సీనియర్ కథానాయిక మాధురీ దీక్షిత్ నుంచి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న అనంతరం చిరంజీవి మాట్లాడుతూ ''కళాకారులకు ఎక్కడ గౌరవం దక్కుతుందో ఆ రాష్ట్రం, ఆ దేశం, ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నానుడి. దాని అర్థం పరమార్థం గ్రహించి నిర్లక్ష్యానికి గురైన పురస్కారాల్ని మళ్లీ పునరుద్ధరించి, పునరుజ్జీవం పోసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మేం కలిసిన ప్రతిసారీ సినిమా గురించి, సినిమా అభివృద్ధి గురించే చర్చ ఉంటుంది. తెలుగు సినిమా, దక్షిణ భారత సినిమా అని కాదు, భారతదేశ సినిమాకు హైదరాబాద్ని కేంద్రంగా నిలిపేందుకు, ఆ దిశగా తెలుగు చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ జరిగినప్పుడు సినిమాకి ప్రాధాన్యం కల్పించారు. చిత్ర పరిశ్రమకు చెందిన మంచి చెడులు చర్చించి సదుపాయాలు కల్పించేందుకు ముందుకొచ్చారు. సినిమావాళ్లకు అతి దగ్గరగా ఉన్నటువంటి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గద్దర్ సినీ పురస్కారాల్ని స్ఫూర్తిగా తీసుకొని, ఆ దిశగా ప్రోత్సహిస్తే యువతరం మరిన్ని సినిమాలు చేస్తుంది'' అన్నారు.












ఉత్తమ దర్శకుడిగా రాజు వెడ్స్ రాంబాయి నుంచి అవార్డు అందుకున్న సాయిలు

# అవార్డు విజేతలు





ఉత్తమ చిత్రం – రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ నటుడు – నాగ చెతన్య (తండేల్)
ఉత్తమ నటి – రష్మికా మందన్న(ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు – సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ ద్వితీయ చిత్రం – దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం – ది ప్రీ వెడ్డింగ్ షో
నేషనల్ ఇంటిగ్రిటీ సినిమా – తండేల్
ఉత్తమ పర్యావరణ చిత్రం – ఇగ్వా
ఉత్తమ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ – లిటిల్ హార్ట్స్
ఉత్తమ వినోదాత్మక చిత్రం – సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ సోషల్ మెసేజ్ చిత్రం – కోర్టు
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ మూవీ – మిరాయ్
ఉత్తమ బాలల చిత్రం – అనగనగనా
ఉత్తమ సహాయ నటుడు – శివాజీ (దండోరా)
ఉత్తమ సహాయ నటి– భూమిక (యుఫోరియా)
ఉత్తమ సంగీత దర్శకుడు – మార్క్ కె. రాబిన్ (దండోరా)
ఉత్తమ నేపథ్య గాయకుడు – అనురాగ్ (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ నేపథ్య గాయని – సాహితి చాగంటి (కన్నప్ప)
ఉత్తమ హాస్యనటుడు – కృష్ణ తేజ (జిగ్రీస్)
ఉత్తమ బాలనటుడు – రోహన్ రాయ్ (ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ కథా రచయిత – గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ – అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ గేయ రచయిత – నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ – కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ – శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్ – ఎం.ఆర్ రాధాకృష్ణన్ (కిష్కిందపురి)
ఉత్తమ కొరియోగ్రాఫర్ – గిర గిర గిర (ఛాంపియన్)
ఉత్తమ ఆర్ట్ డైరక్టర్ – తోట తరణి (ఛాంపియన్ )
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ – గోవింద్ (అఖండ)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ – చంద్రకాంత్ (చంద్రకాంత్)
ఉత్తమ స్పెషల్ జ్యూరీ ఫిల్మ్ – 23
ఉత్తమ మేల్ యాక్టర్ – చైతూ జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ నటి – అనంతిక (8 వసంతాలు)
స్పెషల్ జ్యూరీ హీరో – రోషన్ (చాంపియన్ )

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.